# ఉపమాన జ్ఞాన సందేశాలు

రచన : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు



# ఉపమాన జ్ఞాన సందేశాలు



రచన & ప్రచురణ : బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు

మొదటి ముద్రణ : అక్టోబరు, 2025

ప్రతులు : 2,000

వెల : రూ.90/-

పుస్తకముల కొరకు :-

**తటవర్తి వీరరాఘవరావు,**

తటవర్తివారి వీధి, భీమవరం - 534 201.

సెల్ : 94901 71853, 9440309812

## తటవర్తి రాజ్యలక్ష్మి గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) మరోజన్మ | - | రూ.160/- |
| 2) సాధనలో స్థితులు | - | రూ.80/- |
| 3) జ్ఞానమాల | - | రూ.70/- |
| 4) దత్తాత్రేయుని 24 మంది గురువులు | - | రూ.70/- |
| 5) బుద్ధుని సూక్తులు | - | రూ.70/- |
| 6) జీవిత పరమార్థం | - | రూ.70/- |
| 7) అవిద్య అంటే? | - | రూ.70/- |
| 8) మనసుకు వున్న మూడు దోషాలు | - | రూ.70/- |
| 9) గురుపౌర్ణమి విశిష్ఠత | - | రూ.60/- |
| 10) మానవుడు యోగిగా ఎదగాలంటే? | - | రూ.60/- |
| 11) ఏది సరైన సాధన? | - | రూ.60/- |
| 12)పంచకోశాలు | - | రూ.60/- |
| 13) మానవుని కర్తవ్యాలు | - | రూ.50/- |
| 14) చిత్తవృత్తులు ఎలా ఏర్పడతాయి? | - | రూ.50/- |
| 15) ప్రీతి,భీతి, నీతి | - | రూ.40/- |

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్: 9440309812,

## YouTube ఛానెల్‌లో ప్రసారమయ్యే తటవర్తి దంపతుల కార్యక్రమాలు

a) Channel Name : Tatavarthy Veera Raghava Rao. ఇందులో 2500 పైగా వీడియోలలో తటవర్తి దంపతుల సందేశాలు ఇవ్వడం జరిగింది.

b) అలాగే PMC వారు కూడా బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు గారి యొక్క YouTube Channel ప్రారంభించారు. Channel Name : Brahmarshi Tatavarthy Veera Raghavarao

c) తటవర్తి దంపతుల దగ్గర ట్రైనింగ్ అయిన మాస్టర్ల సందేశాల కొరకు Tatavarty Spiritual Trainees ఛానెల్‌లో చూడండి.

d) Direct గా YouTube app లోకి వెళ్ళి search bar లో Tatavarthy Veera Raghava Rao అని టైపు చేస్తే తటవర్తి దంపతుల అన్ని వీడియోలు చూడవచ్చు.

# ఉపమాన జ్ఞాన సందేశాలు

**::1::**

పత్రీగారు ఏమన్నారంటే "ధ్యానం వల్లనే జ్ఞానం, జ్ఞానం వల్లనే ముక్తి" అన్నారు. ఇక్కడ ముక్తి అన్నది జ్ఞానం వల్లనే వస్తుంది అన్నది తెలుసుకోవాలి. ప్రతి ఒక్కరు కష్టాల నుంచి సమస్యల నుంచి ముక్తి పొందాలనే చూస్తారు. అటువంటి ముక్తి 'జ్ఞానం' వల్లనే వస్తుంది.

అందుచేత 'జ్ఞానం' యొక్క గొప్పతనం 'జ్ఞానం' యొక్క అవసరం ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలి. గొప్పవారు, జ్ఞానులు, యోగీశ్వరులు, అందరూ దేవుళ్ళు అనుకునేవారంతా జ్ఞానం సంపాదించుకున్న వారే! జ్ఞానాన్ని బోధించిన వారే! జ్ఞానం యొక్క లాభాలు ఎన్నో రకాలుగా చెప్పినవారే!

అటువంటి 'జ్ఞానం' "శ్వాస మీద ధ్యాస" ధ్యానం వల్లనే వస్తుందని పత్రీగారు చెప్పారు.

అందుచేత గొప్పవాళ్ళు ధ్యానం చేస్తే ఏ జ్ఞానం వస్తుందని చెప్పారో.. ఆ జ్ఞానం యొక్క గొప్పతనాన్ని ఉపమానాల ద్వారా చెప్పుకుంటే అప్పుడు జ్ఞానం బాగా అర్థమవుతుంది, జ్ఞానం పొందడానికి ఆసక్తి చూపిస్తారు.

జ్ఞానం యొక్క గొప్పతనం అర్థం కాకపోతే ఈ జ్ఞాన మార్గాన్ని వదిలేస్తారు. ఇందులో ఏమీ లేదనుకొని ఇంకా కొత్త కొత్త మార్గాలు, రకరకాల గురువులని కూడా ఆశ్రయిస్తూ ఉంటారు. చివరికి జీవితాన్ని, శ్రమను వృధా చేసుకుంటారు.

అందుచేత ఈ జ్ఞానం యొక్క గొప్పతనం అర్థం కావడానికి ఉపమానాలు, ఉదాహరణలు చెప్పుకుంటే ఇంకా శ్రద్ధగా, దీక్షగా ఈ ఆధ్యాత్మిక మార్గంలో కృషి చేయడానికి అవకాశం ఉంటుంది. అందుచేత ఇప్పుడు ఒక ఉపమానం చెప్పుకుందాం.

**"బీజం అంటే విత్తనం నాటిన తర్వాత ఎన్నో రోజులు వేచి ఉండాలి, అలా వేచి ఉన్నప్పుడు శ్రమ వృధా అయినట్టు కనిపిస్తుంది. కానీ కొన్ని రోజులు వేచి ఉంటే ఆ బీజం పగిలి మొక్క బయటకు వస్తుంది, పడిన శ్రమ ఫలిస్తుంది".**

అలాగే **"జ్ఞానం కోసం "శ్వాస మీద ధ్యాస" ధ్యాన సాధన చేసేవారు జ్ఞానం కోసం కొన్ని రోజులు వేచి ఉండాలి. అలా వేచి ఉన్నప్పుడు తాను చేసిన శ్రమ వృధా అయినట్టు కనిపిస్తుంది, కానీ నిరుత్సాహ పడకుండా అలాగే కొనసాగిస్తే ఏదో ఒక రోజు ఫలితం దానంతట అదే వస్తుంది, మీరు పడిన శ్రమ ఫలిస్తుంది".**

ఎందుచేతనంటే ఎవరైనా ఏదైనా చేస్తే ఇలా చేయగానే అలా ఫలితం రావాలనుకుంటారు. ఏదైనా షాప్ కి వెళ్ళినప్పుడు వాడు ముందు సరుకులు ఇస్తేనే తర్వాత మీరు డబ్బులు ఇస్తారు. సరుకు మన చేతిలో పెట్టకుండా చచ్చినా మీరు డబ్బులు ఇవ్వరు.

కానీ సృష్టి నియమం అలా లేదు, "మీరు చేయవలసింది చేస్తేనే రావలసింది వస్తుంది". అంతేకానీ వస్తే చేస్తాను అంటే కుదరదు, మీరు ఆశించిన ఫలితం రావాలి అంటే! ఎంత చేయాలో? ఎంత కాలం చేయాలో? ఎలాంటి ధ్యానం చేయాలో? తెలుసుకోకుండా ఊరికే కాసేపు కళ్ళు మూసుకొని రావట్లేదు, రావట్లేదు అని సాధనలు మార్చి, గురువుల్ని మార్చి తిరిగితే అనుకున్నది రాదు.

ఇక్కడ సృష్టి నియమం ఏమిటంటే ? "చేయవలసింది చేస్తేనే పొందవలసింది పొందుతారు." ఇప్పుడు మీరు ఈ ధ్యానాన్ని ఆరోగ్య సమస్యలు కోసం, ఆర్థిక సమస్యలు కోసం, కుటుంబ సమస్యలు కోసం, వృద్ధాప్య సమస్యల కోసం, సంసారంలో గొడవల కోసం, పిల్లలతో, తల్లిదండ్రులతో, భర్తతో, భార్యతో ఉన్న సమస్యల కోసం చేస్తున్నారు.

అలాగే కొంతమందికి పిల్లలు ఉంటారు, కొంతమందికి పిల్లలు

ఉండి ఇబ్బంది పడతారు, కొంతమంది పిల్లలు లేరని బాధపడతారు. ఇంకా కొంతమంది రాత్రిపగలూ కష్టపడినా డబ్బులు సంపాదించలేరు, ఎన్నాళ్ళు ధ్యానం చేసినా రోగాలు తగ్గవు, ఏ మాస్టర్ వచ్చినా ధ్యానం చేయండి రోగాలు పోతాయి అంటాడు. ఎవరు వచ్చినా అదే చెప్తుంటే ఓహో.. ధ్యానం చేస్తే రోగాలు పోతాయి అని చేస్తారు. కానీ అసలు ధ్యానం అంటే ఏమిటి? ఎందుకు అన్నది ఎంతమంది తెలుసుకుంటున్నారు?

ఈ ప్రశ్న అడిగితే చాలామంది రకరకాల సమాధానాలు చెప్తారు. నిన్ను నువ్వు తెలుసుకోవడం అని, నీలోకి నువ్వు వెళ్ళడం అని, ధ్యానం అంటే "శ్వాస మీద ధ్యాస" అని ఇలా రకరకాలుగా చెప్తారు. కానీ ధ్యానం అంటే "శ్వాస మీద ధ్యాస" కూడా కాదు అనేసరికి చాలా ఆశ్చర్య పోతారు.

అప్పుడు కొంతమంది అడుగుతారు, మరి పత్రి గారు ధ్యానం అంటే "శ్వాస మీద ధ్యాస" అని స్పష్టంగా చెప్పారు కదా? మీరు అది కాదు అని ఎందుకు అంటున్నారు? అని అడుగుతారు.

గుర్తుపెట్టుకోండి ధ్యానం అంటే ఆలోచనా రహిత స్థితికి చేరుకోవడం, దాన్నే పతంజలి మహర్షి "నిర్విషయ మనః ధ్యానం" అన్నారు. "చిత్తవృత్తి నిరోధః" అని కూడా అన్నారు. ముందు ఈ ఫండమెంటల్ అర్థం కాకపోతే ఏమీ ప్రయోజనం లేదు, వాళ్ళు అందులో ఏమీ పొందలేరు, చివరికి నిరుత్సాహ పడతారు.

ఆలోచనలు లేని స్థితి అంటే మనసు పని చేయని స్థితే ధ్యానం, ఆలోచించేది మనసు కాబట్టి ఆలోచిస్తూ ఉంటే మనసు పని చేస్తున్నట్టు, ఆలోచించట్లేదు అంటే మనసు పని చేయట్లేదు అని అర్థం. అందుచేత "మీ మనసు ఏమాత్రం పని చేస్తున్నా మీరు 'ధ్యానం' చేస్తున్నట్టు కాదు."

అందుకే పత్రి గారు కళ్ళు మూసుకొని నామస్మరణ చేస్తే మనసు పనిచేస్తుంది కాబట్టి అది ధ్యానం కాదు అని చెప్పారు. ఒక మంత్రాన్ని జపించినా

మనసు పనిచేస్తుంది కాబట్టి అదీ ధ్యానం కాదు అన్నారు. అలాగే ఒక రూపాన్ని ఊహించుకున్నా, రూపం మీద దృష్టి పెట్టినా మనసు పనిచేస్తుంది కాబట్టి అదీ ధ్యానం కాదు అన్నారు. అందుకే ఏ నామము వద్దు, ఏ మంత్రము వద్దు, ఏ రూపము వద్దు అన్నారు పత్రిగారు.

అలాగే ఇప్పుడు గైడింగ్‌లో మాటలు చెప్తూ ఉంటే వీరు వింటూ వాడు చెప్పినట్టుగా వీరు మనసులో ఊహించుకుంటూ ఉంటారు. అందుచేత మనసు పని చేస్తుంది కాబట్టి, గైడింగ్ కూడా ధ్యానం కాదు, అలాగే మ్యూజిక్ పెట్టుకున్నా మనసుతో వింటూ ఉంటారు, అందుచేత ఇక్కడ కూడా మనసు పనిచేస్తుంది. అందుచేత అది ధ్యానం కాదు.

ఎందుకంటే? "మనసు పని చేస్తే ధ్యానం కాదు, మనసు పని చేయకపోతేనే ధ్యానం"

ఇది చాలా చాలా ముఖ్యం. ఎవ్వరికైనా మీరు క్లారిఫై చేయవలసింది ఇదే. మరి మనసు పని చేయని స్థితి ఎలా వస్తుంది? అంటే పత్రిగారు చెప్పిన "శ్వాస మీద ధ్యాస" వల్లనే వస్తుంది అని తెలుసుకోవాలి.

గుర్తుపెట్టుకోండి ఆ స్థితి అన్నది ఒక్క "శ్వాస మీద ధ్యాస" వల్ల తప్ప ఇంక దేని వల్లా రాదు. అంటే మ్యూజికల్ వల్లా, గైడింగ్ల వల్లా, ఓంకార ధ్యానాల వల్లా, కర్మ విపాక ధ్యానాల వల్లా రాదు.

అందుకే పత్రిగారు ఇంకేదీ లేదు వున్నది ఒక్కటే కాబట్టి ధ్యానం అంటే "శ్వాస మీద ధ్యాస" అని చెప్పారు.

ఎందుకంటే చూడండి మీరు ఒక గంట ధ్యానం చేశారు అనుకుందాం. ఈ గంటలో మీరు ఫస్ట్ కళ్ళు మూసుకుంటారు. కళ్ళు మూసుకోగానే ఆలోచనలు వస్తాయి.

అలా ఆలోచనలు వచ్చినప్పుడు కట్ చేసి "శ్వాస మీద ధ్యాస" పెడతారు. అలా శ్వాసను గమనిస్తూ ఉంటే మళ్ళీ ఆలోచనలలోకి వెళ్ళిపోతారు,

మళ్లీ కట్ చేస్తారు.

అలా గంట మీకు ఆలోచనలు ఉన్నట్టుగానే ఉంటుంది. కానీ మీకు తెలియకుండా ఒక నిమిషం, లేకపోతే ఐదు నిమిషాలు ఆలోచనలు ఆగిపోతాయి.  అలా గంట అయ్యాక ఓకే చెప్తారు, కళ్ళు తెరుస్తారు.

ఇప్పుడు మీరు గంట కూర్చున్నారు, కాని ధ్యానం చేసింది మాత్రం ఒక్క నిమిషం మాత్రమే! ఇక్కడ గంటసేపు 'శ్వాస మీద ధ్యాస'  ఉంచినా కూడా నీ మనసు పనిచేస్తుంది.


అందుచేత 'శ్వాస మీద ధ్యాస' కూడా ధ్యానం కాదు. 'శ్వాస మీద ధ్యాస' ఉంచడం ద్వారా ఎంతసేపు నువ్వు మనసు పని చేయని స్థితికి చేరుకుంటావో అంతసేపే నువ్వు ధ్యానం చేసినట్టు, అంతసేపే నీకు శక్తి లభించినట్టు. గుర్తుపెట్టుకోండి ఇది తెలియకపోతే గంట ధ్యానం చేసాను అనుకుంటారు.

అందుచేత పత్రి గారు రకరకాల ధ్యానాలు లేవు, ఉన్నది ఒక్కటే ధ్యానం అదే ' శ్వాస మీద ధ్యాస' అన్నారు. తెలుసుకోండి  "కళ్ళు మూసుకుంటే ధ్యానం కాదు, మనసు కూడా మూస్తేనే ధ్యానం". అందుచేత  చేయవలసిన "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేస్తేనే  పొందవలసిన జ్ఞానం పొందుతావు.  .

లోకంలో మానవులకి ఎన్నో రకాల కష్టాలు, బాధలు, రోగాలు ఉంటాయి.  ఇవన్నీ గతంలో చేసుకున్న కర్మల వల్లే వస్తున్నాయి. కర్మల వల్ల వచ్చినవి ధ్యానం వల్ల తగ్గవు, కారణం ధ్యానంలో కర్మలు పోవు అంటే దగ్ధం కావు. శ్రీ కృష్ణుల వారు స్పష్టంగా చెప్పారు కదా? "జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణాం" అని. అంటే కర్మలు జ్ఞానాగ్నిలోనే దగ్ధమవుతాయని తెలుసుకోవాలి. అందుకే జ్ఞానం అంత గొప్పదని తెలుసుకోవాలి. దానికి 'జ్ఞానం' సంపాదించుకోవాలి. లేదా ఆ కర్మలు తీరేదాకా ఆరు మాసాలు, లేదా సంవత్సరం ఓపికగా అనుభవించాలి.

అందుచేత ఊరికే విత్తనం నాటి ఇంకా మొక్క రావట్లేదు, ఇది మంచి విత్తనం కాదు, దీని వల్ల లాభం లేదు అని ఇంకొక విత్తనం వేయడం కాదు. విత్తనం నాటి ప్రతిరోజు కొద్ది కొద్దిగా కొన్నాళ్ళు నీరు పోయాలి, ఎదురు చూడాలి, ఎందుకు రాదు? ఆ బీజం పగిలి మొక్క బయటకి వస్తుంది, మీరు పడిన శ్రమ ఫలిస్తుంది.

అలాగే ఊరికే ధ్యానం మొదలుపెట్టి ఇంకా జ్ఞానం రాలేదు అని గైడింగ్ లోకి, కర్మ విపాక ధ్యానంలోకి, మనీ మెడిటేషన్ కి, సంకల్ప ధ్యానాలకి, ఓంకార ధ్యానాలకి వెళ్ళడం కాదు, పత్రిగారు ఇచ్చిన "శ్వాస మీద ధ్యాస" ధ్యానాన్ని తీవ్రంగా చేస్తూ, ఆహార నియమాలు పాటిస్తే పొందవలసిన జ్ఞానాన్ని పొందుతారు, కర్మలు రహితం చేసుకుంటారు, కష్టాల నుంచి బయట పడతారు.



## ధ్యానం చేసే పద్ధతి శ్వాస మీద ధ్యాస



ఎవరికి తగిన సుఖాసనంలో వారు హాయిగా కూర్చుని... చేతులు రెండూ కలిపి... కళ్ళు రెండూ మూసుకుని... ప్రకృతి సహజంగా జరుగుతోన్న ఉచ్ఛ్వాస, నిశ్వాసలను గమనిస్తూ వుండాలి!

మధ్యమధ్యలో అనేకానేక ఆలోచనలు వస్తున్నా వాటిని ఎప్పటికప్పుడు 'కట్' చేస్తూ... మళ్ళీ, మళ్ళీ శ్వాస మీదకే... ధ్యాస మరల్చుతూ వుంటే.. క్రమక్రమంగా... ఆలోచనా రహిత స్థితి కలుగుతుంది.... చిత్తవృత్తులు నిరోధించబడతాయి... మనస్సు నిర్విషయం, శూన్యం అయిపోతుంది. మనస్సు శాంతిస్తుంది. ఇదే ధ్యాన స్థితి.

ఈ ఆలోచనా రహిత స్థితిలో కలిగే అనేకానేక శారీరక, నాడీ మండల, ఆత్మానుభవాలను గమనిస్తూ వుండాలి. ఆ స్థితిలో విశ్వమయ ప్రాణశక్తి. అపారంగా శరీరంలోకి ప్రవేశించి నాడీమండలాన్ని శుద్ధి చేస్తుంది. ఆ శక్తి వల్ల రోగాలన్నీ తగ్గుతాయి. నాడీమండలశుద్ధి వల్ల కర్మలు పోతాయి.

ప్రతిరోజూ ఎవరి వయస్సు ఎంతుంటుందో... కనీసం అన్ని నిమిషాలు... తప్పనిసరిగా... రోజుకి రెండు సార్లుగా... ధ్యానం చెయ్యాలి.

::2::

**"ఒక తామర పువ్వు మీద తూనీగ వాలింది. ఇంతలో చీకటి పడడంతో తామర పువ్వు ముడుచుకుని తూనీగ అందులో ఉండిపోయింది. ఆ తూనీగ ఏమనుకుందంటే? కాసేపాగితే తెల్లవారుతుంది, నేను బయటకు వెళ్ళిపోవచ్చు అని అనుకుంది. కానీ ఇంతలో ఒక ఏనుగు వచ్చి ఆ కొలనును చిందర వందర చేసి, ఆ తామర పువ్వుల్ని కాళ్ళతో తొక్కింది. ఆ పువ్వులో ఉన్న ఈ తూనీగ చనిపోయింది.**

**అలాగే మానవుని జీవితం ఎప్పుడు అంతమవుతుందో తెలియదు. అవకాశం ఉన్నప్పుడే ధ్యాన సాధన చేయాలి, జ్ఞానాన్ని సంపాదించుకోవాలి, ఆత్మను తెలుసుకోవడానికి ప్రయత్నించాలి, తాను తెలుసుకున్న జ్ఞానాన్ని ఇతరులకు పంచడానికి ప్రయత్నించాలి".**

ఆ తూనీగ తెల్లవారితే బయట పడొచ్చు అని అనుకుంది. తర్వాత ఏనుగు రావడం అవన్నీ చిందర, వందర చేసి తొక్కేయడంతో, చనిపోవడం జరిగింది. అలాగే మానవులు కూడా ఇంకా చాలా కాలం ఉంటాము, చాలా కాలం బ్రతుకుతాము, మెల్లిగా ధ్యాన సాధన చేసుకోవచ్చు, మెల్లిగా జ్ఞానం సంపాదించుకోవచ్చు అని అశ్రద్ధ చేస్తారు. కానీ ఎవరి జీవితం ఎప్పుడు అంతమవుతుందో ఎవరికీ తెలియదు.

అసలు నేను ఎవరిని? ఏం చేయడానికి ఇక్కడికి వచ్చాను. చేయవలసిన పని చేస్తున్నానా? లేదా? నాకు ఇవ్వబడిన సమయంలో సాధించవలసింది సాధిస్తున్నానా? లేదా? అన్నది ఆలోచించాలి, ఆ ప్రయత్నం చెయ్యాలి.

పత్రి గారు ఎప్పుడూ మరణానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు. నాకు ఇంకా చాలా వయసు ఉంది అనుకుంటూ కూర్చోకూడదు. అందుకే

మహాభారతంలో యక్షుడు ధర్మరాజును ఒక ప్రశ్న అడుగుతాడు, అన్నిటికంటే ఆశ్చర్యకరమైనది ఏది? అని. దానికి ధర్మరాజు ఏమని చెప్పాడంటే? లోకంలో ఎంతో మంది వెళ్ళిపోవడం చూస్తున్నారు, కానీ తానేదో శాశ్వతం అన్నట్టుగా జీవిస్తున్నారు ఇదే ఆశ్చర్యం కలిగించే విషయం అన్నాడు.

పత్రి గారు 2095 దాకా నేను ఉంటాను అని చెప్పారు. కాని ఆయన నిష్క్రమించి మూడేళ్ళయ్యింది. ఇది ఎంత ఆశ్చర్యం కలిగించే విషయం. కనుక ఎవరూ శాశ్వతం కాదు, ప్రతి ఒక్కరు ఏదో ఒక రోజు శరీరాన్ని వదలవలసిందే అని తెలుసుకోవాలి. అందుచేత స్త్రీ అయినా, పురుషుడు అయినా శరీరంతో జ్ఞానం సంపాదించుకోవడానికి ఇవ్వబడిన పరికరం మాత్రమే అని తెలుసుకోవాలి. కానీ మీరు ఈ పరికరాన్నే నేను అనుకుంటున్నారు.

పరికరం మీరెలా అవుతారు? మీ ఇంట్లో మీరు ఉపయోగించుకునే పరికరాలు ఎన్నో ఉంటాయి. ఒకటా, రెండా ఆడవాళ్ళకి చీపిరి, చాట, వంట చేసుకోవడానికి గిన్నెలు ఇలా ఎన్నో ఉంటాయి. మగవాళ్ళకి స్కూటరు, కారు, సైకిలు ఇలా ఎన్నో పరికరాలు ఉంటాయి. మరి ఆ చీపిరితో పొద్దున్నే ఇల్లు శుభ్రం చేసి ప్రక్కన పెట్టేస్తారు కాని మెడలో వేసుకుని తిరుగుతారా? తిరగరు కదా? పనైపోతే వదిలేస్తారు. అలాగే ఆత్మైన మీకు ఈ శరీరం కూడా ఒక పరికరమే.

అలాగే ఈ శరీరం అనే పరికరాన్ని కూడా ఉపయోగించుకుని వదిలేస్తారు. ఎలాగైతే చీపిరి కొన్నాళ్ళకి అరిగి పనికిరాకుండా పోతుందో! అలాగే ఈ దేహం అనే పరికరం కూడా ముసలిదైపోయి పనికిరాకుండా పోతుంది. చూడండి కొత్త చీపురు పని చేసినట్టు, అరిగిపోయిన చీపురు పనిచేస్తుందా? పనిచేయదు కదా? అలాగే యవ్వనంలో ఉన్న శరీరం ఉపయోగపడినట్టు ముసలిదైపోయిన శరీరం పనిచేయదు కదా? అటువంటి

శరీరంతో ఆత్మకు ఏమీ ఉపయోగం లేదు. చివరకు ఆ చీపిరిని బయట పడవేస్తారు, అలాగే చివరకు దేహాన్ని కూడా వదిలేస్తారు.

అందుచేత ప్రతి ఒక్కరు ఈ పరికరం ఉన్నప్పుడే అంటే దేహం ఉన్నప్పుడే దేహంతో మీకు లాభం కలిగించే, మీకు అంటే ఆత్మకు లాభం కలిగించే పనులు చేయాలి. మరి అన్నింటికంటే ఆత్మకు లాభం కలిగించేది జ్ఞానం కాబట్టి ఈ దేహంతో ధ్యానం చేసి జ్ఞానం సంపాదించుకోవాలి. దానికి ఆత్మజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు చదవాలి, సజ్జనులతో సాంగత్యం చేయాలి, ఈ మార్గంలో చేయగలిగిన సేవలు చేయాలి. అలా చేసి సంపాదించిన జ్ఞానం భూలోకంలోనే కాదు, ఈ శరీరం వదిలి పైలోకాలకి వెళ్ళాక కూడా మీకు లాభిస్తుంది. మీకు ఉన్నతి కలిగించి, ఊర్ధ్వ లోకాలకు చేరుస్తుంది. మరి ఎవరైతే ఈ శరీరం శాశ్వతం కాదు ఇది ఒక పరికరం మాత్రమే అని తెలుసుకుని దీన్ని సరైన విధంగా ఉపయోగిస్తారో వారు అదృష్టవంతులు.

నాకు 23 సంవత్సరాల క్రితం పత్రీగారు పరిచయం అయ్యేదాకా నేను ఆత్మ, ఈ శరీరం ఒక పరికరం అన్నది అర్థం కాలేదు! ఈ పరికరానికి ఒక పేరు పెట్టుకున్నాను, దీనికి పేరు వస్తే మురిసిపోయాను, ఇంకా పేరు రావాలని తాపత్రయ పడ్డాను. అలా రాత్రీ, పగలు శరీరం కోసమే కష్టపడ్డాను. ఇంకా దీన్ని ఏసీలో పడుకోబెట్టాలి, కారులో తిప్పాలి, మూడు పూట్ల బాగా మేపాలి, దీన్ని బాగా అలంకరించాలి అని ఎప్పుడూ ఆ గోలే ఉండేది.

ఎంత డబ్బు సంపాదిస్తే అంత గౌరవం అని, డబ్బు ఉంటేనే ఎవడైనా మాట్లాడేది, పలకరించేది, గౌరవించేది అని డబ్బు సంపాదించడానికే ఈ శరీరం అనే పరికరాన్ని ఉపయోగించాను. పెద్ద రైస్ మిల్ కట్టి వ్యాపారం చేశాను.

అప్పుడే పత్రీగారి పరిచయమైంది. ఆయన నువ్వు దేహం కాదయ్యా అన్నాడు. ఒక్కసారి ఆయన చెప్పిన మాట వినగానే ఆశ్చర్యమేసింది. ఇలా

అంటాడేంటి అని ఆశ్చర్యపోయాను. మరి నేను ఎవరండి? అంటే నువ్వు ఆత్మ అన్నారు. అంతటి వారు చెప్తే కొట్టిపడేయడం కాదు అని చాలా ఆలోచించాను. అంతకు ముందు ఆత్మ అని ఎప్పుడూ వినలేదు, అది ఎక్కడ ఉంది? అన్నది తెలియదు. అందుకే పుస్తకాలు చదివాను, ఎంతో మందిని అడిగాను, ఎన్నో వీడియోలు విన్నాను.

చివరికి ఆయన చెప్పింది సత్యం అని అర్థమైంది. మరి నేను ఆత్మనైతే 50 ఏళ్ల నుంచి కష్టపడి సంపాదించిన ఈ కోట్లు నాకు ఉపయోగపడతాయా? అని ఆలోచిస్తే లేదు అని అర్థమైంది. వెంటనే నా వ్యాపారాలన్నీ మానేసాను. ధన సంపాదన ఆపేసి, జ్ఞాన సంపాదన మొదలుపెట్టాను. నా రైస్ మిల్ ప్రాంగణంలో ధ్యాన మందిరం కట్టుకున్నాను. ఇంతకు ముందు రైస్ మిల్లు వల్ల ధనం వచ్చేది ఇప్పుడు ఈ ధ్యాన మందిరం వల్ల జ్ఞానం వస్తుంది. ధనం దేహానికి లాభం అయితే జ్ఞానం ఆత్మకు లాభం కలుగుతుంది.

అప్పుడు ఇంకా అనుకున్నాను మరి నేను ఆత్మ అని తెలిసినప్పుడు అరే ఇంత వయసయిపోయింది 53 ఏళ్ళు వచ్చేసాయి. మా నాన్నగారు 56 ఏళ్ళకే పోయారు. మా పెదనాన్న 58 ఏళ్లకు పోయారు. 60 లోపు మా చిన్నాన్నా పోయారు. అందరూ 60 లోపు పోయారు. మరి ఇప్పటికి నేనేమీ జ్ఞానం సంపాదించలేదు అనుకున్నాను. అప్పుడు పత్రిగారిని అడిగాను. ఏమండీ మీరు10 ఏళ్ల క్రితం పరిచయం అయి ఉంటే ఎంత బాగుండేది బోలెడు జ్ఞానం సంపాదించుకునే వాడిని కదా? అన్నాను.

అప్పుడు ఆయన అన్నారు దాని గొడవ నీకెందుకు? కనీసం ఇప్పటి నుంచైనా నువ్వు జాగ్రత్తపడు అన్నారు. అప్పటినుంచి ఆత్మైన నాకు లాభించే జ్ఞానం పెంచుకోవడానికి ఈ 4 పనులు చేస్తున్నాను.

1) శ్వాస మీద ధ్యాస ఉంచి ధ్యానం చేయడం.

2) ఆత్మజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు చదవడం.

3) ఆత్మజ్ఞానం బోధించేవారి సాంగత్యం చెయ్యడం.

4) ఈ జ్ఞాన మార్గంలో సేవచేయడం. అంటే నేను సంపాదించుకున్న జ్ఞానం అందరికి పంచడం.

పత్రిగారు చెప్పారు కదా? "పంచింది పెంచబడుతుంది" అని. ఇప్పుడు నాకు కావాల్సింది జ్ఞానం కాబట్టి, ఆ జ్ఞానాన్నే పంచుతున్నాను. మరి ఎవరైతే ఇవన్నీ చేస్తారో వాళ్లే జీవితాన్ని సద్వినియోగం చేసుకున్నట్టు. ఏమో ఎప్పుడు ఈ దేహమనే పరికరాన్ని వదిలేయవలసి వస్తుందో ఎవరికి తెలుసు? కనుక ఉన్నప్పుడే సద్వినియోగం చేసుకోవాలి.

ఈ దేహమనే పరికరాన్ని ఉపయోగించుకోకపోతే వాళ్ళ పరిస్థితి ఎలా ఉంటుందో ఒక చిన్న ఉదాహరణ చెప్తాను.

ఒకడు 20 లక్షలు పెట్టి కొత్తగా కారు కొన్నాడు, ఆ కారు తళ తళా మెరిసి పోతుంది. తీసుకొచ్చి షెడ్లో పెట్టాడు. అలా మెరిసిపోతున్న కారు బయటికి తీస్తే బురద అయిపోతుందేమో, దేనికైనా తగిలి గీతలు పడుతుందేమో అని భయపడి షెడ్ లోనే ఉంచి రోజూ ఒక పాలిష్ క్లాత్ పెట్టి దుమ్మంతా శుభ్రంగా తుడిచేవాడు, కారును బయటకు తీసేవాడు కాదు.

అలా పదిహేను సంవత్సరాలు ఉంచేసాడు. తరువాత ఏదో కారణం వల్ల దాన్ని వాడదామని బయటకు తీశాడు. అప్పుడు తుప్పు పట్టి స్టార్ట్ చేస్తే స్టార్ట్ అవ్వదు, బ్యాటరీ పోయింది. అది ఇంక దేనికి పనికిరాకుండా పోయింది, ఎంతో బాధపడ్డాడు. దీన్ని మొదటి నుంచి ఉపయోగించుకుని ఉంటే నాకు ఎంత పని చేసేది? ఎంతో ఉపయోగపడేది, ఎన్ని చోట్లకు తిరిగేవాడిని? అని ఎంతో బాధపడ్డాడు.

అందుచేత ఎవరైనా సరే శరీరం అనే పరికరం మీద జాలి చూపించడం కాదు, అవసరానికి అంటే ధ్యానానికి, జ్ఞానానికి దాన్ని వాడుకోవాలి.

అలాగే ఈ శరీరమనే పరికరం అలిసిపోతుందని ఏసీ రూమ్‌లో పెట్టి, మూడు పూట్లా బాగా తిండిపెడితే కొన్నాళ్ళకి యవ్వనం పోయి, శరీరం ముసలి డొక్కైపోతుంది, అప్పుడు ధ్యానం చెయ్యమంటే ఏమి చేస్తుంది? అందుచేత దీనితో కండిషన్ లో ఉన్నప్పుడే అంటే యవ్వనంలోనే దీన్ని బాగా ఉపయోగిస్తే అంటే ధ్యానం చేయిస్తే ఎంతో జ్ఞానాన్ని సంపాదించి పెడుతుంది, ఆత్మ అయిన మీకు ఎంతో లాభం కలిగిస్తుంది.

రమణ మహర్షి, షిరిడీ బాబా లాంటి గొప్ప గొప్ప వాళ్ళు శరీరాన్ని ఎలా ఉపయోగించుకున్నారో అలా ఉపయోగించుకోవాలి. అంతేకాని ఈ శరీరాన్ని సుఖపెడితే ఏ లాభమూ ఉండదు. అందుచేత ఈ శరీరాన్ని అందరికీ జ్ఞానం పంచడానికి ఉపయోగించండి, అది మీకు ఎంతో లాభిస్తుంది.

## తటవర్తి దంపతుల YouTube ఛానెల్ Subscribe చేసుకోవాలంటే

a) Whatsapp group లో మీకు పంపబడుతున్న Youtube లింక్ మీద నొక్కినప్పుడు Tatavarthy Veera Raghava Rao ఛానెల్ open అవుతుంది. Open అవ్వగానే subscribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

లేకపోతే www.tst.org.in/videos/ ఓపెన్ అయిన తరువాత I లో Tatavarthy Veera Raghava Rao పేరు మీద నొక్కండి. II & III లో వున్న పేరు మీద నొక్కండి. ఛానెల్స్ Open అవుతాయి. Open అవ్వగానే subcribe కనిపిస్తుంది. దాని మీద నొక్కితే subscribe అవుతారు. ప్రక్కనే వున్న bell button నొక్కితే ప్రతీ రోజు వచ్చే వీడియోలు చూడవచ్చు.

::3::

**"నాలుగు అంగుళాలు లోతు ఉండే మురుగు నీటిలో ప్రమాదకరమైన పాములు కానీ, గాజు పెంకులు కానీ, ఇనుప మేకులు కానీ, ఏమీ కనపడవు. అంతేకాదుి పైన ఉండే ఆకాశం కానీ, సూర్య చంద్రులు కానీ, ఆ మురుగు నీటిలో ప్రతిబింబించవు.**

**అలాగే మలిన మనసు ఉన్నవారికి విన్నవి సరిగ్గా అర్థం కావు, వివేకం ఉండదు, సరైన నిర్ణయాలు చేయలేరు, మూర్ఖునిలా ప్రవర్తిస్తారు. అంతేకాదు చెడు అలవాట్లకు, చెడు వ్యసనాలకు బానిసై వాటి వల్ల వచ్చే కష్టాలు అనుభవించలేక జీవితంలో నరకం అనుభవిస్తారు.**

**కానీ పరిశుద్ధమైన నీటిలో నాలుగు గజాల లోతులో కూడా అడుగు భాగంలో ఉన్న ఏ వస్తువైనా కనిపిస్తుంది. ఆ నీటి పై భాగంలో ఆకాశం, సూర్యచంద్రుల యొక్క ప్రతిబింబాలు కూడా కనిపిస్తాయి. అలాగే శుద్ధ మనసు గలవారికి తాను చేసే పనుల ఫలితం తెలియడం వల్ల వాటి నుంచి మంచినే పొందుతారు"**.

అలాగే ఒక చిన్న కీటకాన్ని తీసుకుంటే దానిలో అతి కొద్దిగా ఆత్మ శక్తి కనిపిస్తుంది. కానీ ధ్యానం చేసే యోగులలో అత్యంత అధికంగా ఆత్మశక్తి కనిపిస్తుంది. అలా ప్రతి మానవుని యొక్క అంతఃకరణ శుద్ధిని అనుసరించి ఆత్మ ప్రకాశం యొక్క తేడాలు కనిపిస్తూ ఉంటాయి. వాటి ఫలితాలు కూడా కనిపిస్తూ ఉంటాయి."

ఇక్కడ మనం గమనించినట్లయితే మురుగు నీటికి, స్వచ్ఛమైన నీటికి తేడాలు చెప్పడం జరిగింది. మురుగు కాలవలో బాగా మురికి పట్టిన నీరు ఉంటుంది. అది ప్రవహిస్తూ ఉంటుంది కానీ పెద్ద లోతు ఉండదు. ఒక నాలుగు అంగుళాలే ఉంటుంది. అయినా సరే ఆ మురుగు నీరు అడుగున

ఏముందో కనిపించదు. అందులో ఏదో పడిందని ఎవరైనా దిగితే ఏమీ కనిపించవు. అందులో విషసర్పాలు ఉంటే అవి కరిచే ప్రమాదం ఉంటుంది. గాజు పెంకులు, మేకులు కూడా ఉంటే అవి కాలికి గాయం చేసే అవకాశం ఉంటుంది. అంటే మురుగు నీరు వల్ల ఎంత ప్రమాదమో ఒక్కసారి ఆలోచించండి.

కానీ మానస సరోవరంలో స్వచ్ఛమైన నీరు ఉంటుంది. ఆ నీరు ఎంత లోతు ఉన్నా క్రింద నేల కనిపిస్తుంది, రాళ్లూ, చేపలూ ఏమున్నా కనిపిస్తాయి. కాబట్టి ఆ నీటిలో దిగినా వాడికి ఏ ప్రమాదం ఉండదు. మురికి నీటికీ, స్వచ్ఛమైన నీటికీ ఎంత తేడా ఉందో చూడండి. ఆ మురికి నీటిని, స్వచ్ఛమైన నీటిని మానవుని మనసుతో పోల్చారు.

తమో గుణంలో, రజో గుణంలో ఉన్నవాళ్ళకి మనసు మురికిగా ఉంటుంది. అందుచేత మురికి మనసుతో ఉన్నవాళ్ళు ఏం చేస్తారో వాళ్ళకే తెలియదు. మంచీ చెడ్డ తేడా తెలియదు, వివేకం ఉండదు, ఏం మాట్లాడతారో వారికే అర్థం కాదు. వాళ్ళ పనులన్నీ చాలా మూర్ఖంగా ఉంటాయి, నాకే అన్ని తెలుసు అంటారు, ఎవరి మాట వినరు, చేయకూడని పనులు చేస్తారు. చివరికి వాటి ఫలితంగా కష్టాలు తెచ్చుకొని జీవితంలో నరకం అనుభవిస్తారు.

కానీ శుద్ధ మనసు ఉన్నవారికి అంటే సాత్విక గుణంలో ఉన్నవారికి బుద్ధి బాగా పనిచేస్తుంది, సరైన నిర్ణయాలు తీసుకుంటారు. వారికి వివేకం కూడా ఉంటుంది, ఏది ధర్మము? ఏది అధర్మము? అన్నది అర్థమవుతుంది. ఏది నష్టం కలిగిస్తుంది? ఏది లాభం కలిగిస్తుంది? అన్నది కూడా తెలుస్తుంది. అందుచేత వారి నిర్ణయాలు, వారు చేసే పనులు వారికి లాభం కలిగిస్తాయి. వారికి ఏమి చేయాలో ఎవరూ చెప్పక్కర్లేదు, వాళ్ళ శుద్ధ బుద్ధే అన్నీ చెప్తుంది. శుద్ధ బుద్ధి ఉంటే సరైన నిర్ణయం తీసుకోగలరు.

మురికి మనస్సు మంచి మనస్సు కావాలంటే సరైన ధ్యానం అంటే

"శ్వాస మీద ధ్యాస" ధ్యానం చెయ్యాలి, సాత్వికమైన శాకాహారం తీసుకోవాలి. అలా చేసినపుడు  మనస్సు శుద్ధమవుతుంది. అప్పుడు ఎవరి సలహాలు అడగనవసరంలేదు, మీరే సరైన నిర్ణయాలు తీసుకుంటారు.

చాలామంది, సీనియర్ మాస్టర్లని సలహాలు, సమస్యలకు పరిష్కారం కూడా అడుగుతూ ఉంటారు. అలా అడిగినప్పుడు మాస్టర్ మీలో  నెగిటివ్ బ్లాక్ ఉంది, మీకు ఎనర్జీ పాస్ చేయాలి, దానికి ఇంత అవుతుందని వేలు, లక్షలు తీసుకుంటారు. పాపం వాడిని నమ్మి వీళ్లు డబ్బు ఇస్తారు. కొన్నాళ్ళు పోయాక  ఏ మార్పు రాదు, మళ్ళీ అడిగితే  ఇంకోకటి చేయాలి ఇంకొక రెండు, మూడు లక్షలు పంపించు అంటారు. పంపించాక ఫోన్ ఎత్తరు. వాడు ఎక్కడున్నాడో తెలియక వీళ్ళకి పిచ్చెక్కిపోతూ ఉంటుంది.

అందుచేత ఎవరి సలహా అడగక్కర్లేదు. ఇంచక్కా తీవ్రమైన సాధన చెయ్యండి, అంతకన్నా ఉత్తమమైన పని ఇంకొకటి లేదు. తీవ్రమైన సాధన చేయడం వల్ల అంటే ఆలోచనలు లేని స్థితిలో గంటలు గంటలు కూర్చో గలగడం. అప్పుడు అపారమైన శక్తి మీరు పొందుతారు. శక్తి పెరిగే కొద్ది మీ గుణం మారుతూ ఉంటుంది, మనస్సు శుద్ధి అవుతుంది

అందుకే భీమవరం వచ్చి తీవ్ర సాధన చెయ్యండి, అలా ఎక్కువ గంటలు "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేస్తూ ఆహార నియమాలు కఠినంగా పాటిస్తే కచ్చితంగా మీ అంతఃకరణం పవిత్రంగా తయారువుతుంది. అంతః కరణం అంటే మనసు, బుద్ధి, చిత్తము, అహంకారం. అంతఃకరణ శుద్ధి వల్లే హృదయ శుద్ధి కూడా జరుగుతుంది. హృదయ శుద్ధి వల్ల వారి శరీరంలో ఆత్మ శక్తి అపారంగా విజృంభించి ఉంటుంది.

ఉదాహరణ: మిట్ట మధ్యాహ్నం ఎండ తీవ్రంగా, ప్రచండంగా ఉంటుంది, అందుచేత తట్టుకోలేరు. అంటే సూర్యుని యొక్క ప్రతాపం అలా ఉంటుంది. మరీ అప్పుడు సడన్ గా నల్లటి మబ్బులు వేస్తే ఆ వేడి ఉంటుందా?

ఆ కాంతి ఉంటుందా? ఆ ప్రకాశం ఉంటుందా? ఏదీ ఉండదు. సూర్యుడు అక్కడ లేడా అంటే? అక్కడే ఉన్నాడు. కానీ ఆ ప్రకాశము, ఆ వేడి, ఆ కాంతి కనబడట్లేదు. దేని వల్ల? మబ్బుల వల్ల. మళ్ళీ మంచి గాలి వీస్తే మబ్బులు పోతాయి. అప్పుడు మళ్ళీ సూర్యుని ప్రకాశం మామూలుగా ఉంటుంది.

అలాగే ఈ శరీరంలో ఉన్నటువంటి ఆత్మ అఖండ తేజస్సుతో, అపారమైన కాంతితో, ఊహించలేనంత శక్తితో ఉంటుంది. కానీ అంతఃకరణం మలినంగా ఉండడం వల్ల హృదయం కూడా మలినమై ఆ హృదయంలో ఉండే ఆత్మ ప్రకాశం, ఆత్మ శక్తులు ఈ శరీరంలో వ్యక్తం కావు. అందుకే ప్రతి ఒక్కడు మాధవుడైనా కూడా మానవుడిలా ప్రవర్తిస్తున్నాడు, మనస్సు మలినంగా ఉంటే దుష్టుడిగా ప్రవర్తిస్తాడు, ఇంకా మలినంగా ఉంటే దుర్మార్గుడిగా ప్రవర్తిస్తాడు, ఇంకా మలినంగా ఉంటే సైకోలా ప్రవర్తిస్తాడు, ఇంకా మలినంగా ఉంటే రాక్షసుడులా ప్రవర్తిస్తాడు.

మరి వాడి శరీరంలో ఆత్మ లేదా? దైవం లేడా? అంటే ఉంది. దైవం ఉన్నా రాక్షసుడిలా ఎందుకు ప్రవర్తిస్తున్నాడు? మనస్సు శుద్ధి లేకపోవడం వల్ల. అందుచేత సరైన ధ్యానం "శ్వాస మీద ధ్యాస" చెయ్యండి, మనస్సు శుద్ధి చేసుకోండి.

## ::4::

**"సముద్రంలో అపార జలరాశి ఉంటుంది. అయినా అది దానిని తనకోసం ఉపయోగించుకోదు. సూర్యుని సహాయంతో తన నీటిని ఆవిరి చేసి మేఘాల రూపంలో ప్రపంచానికిస్తుంది, జీవుల దాహాన్ని తీరుస్తుంది, వృక్షజాతి ఎదుగుదలకు ఉపకరిస్తుంది. ఆ వృక్ష జాతి వల్లే సమస్త జీవులు మనుగడ సాగిస్తున్నాయి. అలా చేసినా సముద్ర నీటి మట్టం తగ్గదు. అనేక నదుల రూపంలో మరల సముద్రంలోనికి నీరు చేరి సముద్రం నింపబడుతుంది.**

**అలాగే జ్ఞాని పరోపకారం చేయడం వల్ల ధనానికి లోటు ఉండదు. ఏదో విధంగా అతనికి ధనం సమకూరుతూనే ఉంటుంది. అంతే కాదు అలా పరోపకారం చేసేవారికి  దుఃఖం కూడా దూరం అవుతుంది, అతనికి నూతన సామర్థ్యం లభిస్తుంది,  మనసు చంచలత్వం తొలగిపోతుంది. బుద్ధికి కొత్త తేజస్సు వస్తుంది,  శరీరానికి  కష్టాలు సహించే శక్తి వస్తుంది. అటువంటి జ్ఞానికి అన్ని రకాలుగా గొప్పతనానికి మార్గం సుగమమవుతుంది అంటే తేలికవుతుంది".**

ఈ ఉపమానంలో సృష్టి నియమం మనకి బోధింపబడింది. దీన్ని అర్థం చేసుకున్న వాళ్ళు  చాలా గొప్పవారు కాగలుగుతారు, అన్ని రకాలుగా సుఖ సంతోషాలతో జీవించగలుగుతారు. ఇక్కడ జ్ఞానిని సముద్రంతో పోల్చడం జరిగింది. ఈ ఉపమానం ద్వారా జ్ఞానం యొక్క గొప్పతనం మనం తెలుసుకో గలుగుతున్నాం. ఇది అర్థమైన వారు జ్ఞానం సంపాదించుకోవడానికి ప్రయత్నిస్తారు, కారణం జ్ఞానం కంటే గొప్పది లేదని తెలుసుకుంటారు.

ఇది ఒక రకంగా ఆశ్చర్యం కలిగించే విషయమే.  ఎందుచేతనంటే సముద్రంలో అపార జలరాశి ఉంటుంది, అంచనా కూడా వేయలేరు. ఆ సముద్రం సూర్యరశ్మి సహాయంతో నీటిని ఆవిరిగా మార్చి అంటే త్రాగడానికి ఉపయోగపడని ఉప్పు నీటిని, ఉపయోగపడే మంచి నీటిగా మార్చి, మేఘాల

రూపంలో వర్షించడం వల్ల 84 లక్షల జీవరాశులు జీవించడానికి, మనుగడ సాగించడానికి ఎంతో ఉపకరిస్తుంది.

విచిత్రం ఏమిటంటే? ఎంత నీరు ఆవిరైపోయినా సముద్ర నీటి మట్టం తగ్గదు. అలా అందరికీ ఉపయోగపడడానికి ఇచ్చిన నీరు మరలా నదుల రూపంలో ఆ సముద్రానికే చేరుతుంది.

సముద్రం తన దగ్గర ఉన్న నీటి సంపదని అది ఉపయోగించుకోకుండా ఆ నీటిని లోకానికి, లోకులకి ఉపయోగపడే రీతిలో పంచుతుంది. అలా పంచుతూ ఉంటే దాని నీరు తగ్గదు, పంచింది మరలా దాన్నే చేరుతుంది, ఇది సృష్టిలో ఉన్నటువంటి ఒక గొప్ప ఏర్పాటు. సముద్రం నుంచి మానవులు నేర్చుకోవాల్సిన గొప్ప సందేశం ఇదే.

ఎందుచేతనంటే మానవులు అజ్ఞానంలో ఉండడం వల్ల స్వార్థంతో తన దగ్గర ఉన్న వనరులను తనకు, తన వారికే ఉపయోగించుకుంటారు. ఇతరులకు ఉపయోగిస్తే తరిగిపోతుందని భయపడతారు, ఇవ్వలేరు.

కానీ సముద్రం నుంచి దీన్ని మనం నేర్చుకుంటే లోకానికి, లోకులకి ఉపకరించడానికి ఖర్చు పెట్టడం వల్ల తన వనరులు తగ్గవు. పైగా అలా పంచుతూ ఉంటే పెరుగుతూనే ఉంటాయి అన్నది అర్థమవుతుంది. ఈ పంచడం అన్నది ఒక జ్ఞానికే సాధ్యమవుతుంది. ఎందుచేతనంటే? అంతా ఒకటే, అంతా నేనే అని తెలుసుకున్నవాడు కాబట్టి. అలాంటి జ్ఞాని ఎంత పంచినా ఇహంలోనూ నష్టపోడు, పరంలోనూ నష్టపోడు, వాడు ఎప్పుడూ లాభం పొందుతూనే ఉంటాడు.

దీనికి ఉదాహరణ మన పత్రిగారే. ఆయనేమి కోటీశ్వరుడు కాదు, ఒక ఉద్యోగం మీద బ్రతికే సంసారం ఆయనది. ఆయన ఉద్యోగిగా జీవిస్తున్నంత కాలం ఉద్యోగిగానే ఉండిపోయాడు. కానీ ఆ ఉద్యోగానికి రాజీనామా చేసి తాను తెలుసుకున్న ధ్యానాన్ని, తాను పొందినటువంటి జ్ఞానాన్ని, అహింసా మార్గాన్ని లోక కళ్యాణం కోసం పంచడం మొదలుపెట్టాడు. ఆయన ఏమి

తలబెట్టినా అవి విజయవంతం అయ్యాయి.

అంతకుముందు ఆయన జీవితానికి, లోక కళ్యాణం కోసం ఆయన ప్రయత్నిస్తున్నప్పుడు ఉన్న జీవితానికి సంబంధమే లేదు. ఇది మనం గమనించగలిగితే పంచడంలో ఉన్న గొప్పతనం మనకు అర్థమవుతుంది, దీన్నే పెద్దలు సముద్రాన్ని ఉపమానంగా తీసుకొని బోధించడం జరిగింది.

నిజంగా చూడండి ఆయన తలపెట్టినటువంటి ప్రాజెక్టులు చిన్నవా! కోట్లున్న కోటీశ్వరులు కూడా చేయలేని పనులు చేశాడు. వాళ్ళు కోట్లు సంపాదించగలుగుతున్నారు కానీ అలాంటి పనులు చేయలేకపోయారు. ఇక్కడ ప్రకృతి ధర్మం మనకి ఏం నేర్పుతుందంటే? కోట్లు సంపాదించడం గొప్ప కాదు, తనకున్న దాంట్లో కొంత లోక కళ్యాణానికి, అందులోనూ ముఖ్యంగా సరైన ధ్యానానికి వినియోగించాలి అని నేర్పుతుంది.

సత్య జ్ఞానానికి వినియోగించడం అన్నది గొప్ప ఫలితాన్ని ఇస్తుంది. లోక కళ్యాణానికి ఉపయోగించే ఎన్నో రకాల పద్ధతులు ఉన్నాయి. అన్నిటికంటే గొప్పది "సరైన ధ్యానము, సత్యజ్ఞానము". సరైన ధ్యానము అంటే "శ్వాస మీద ధ్యాస." సత్యజ్ఞానము అంటే "ఆత్మజ్ఞానం". మరి వీటి కోసం ఖర్చు పెట్టడం వల్ల ధనానికి లోటు ఉండదు, వారికి ఏదో ఒక విధంగా ధనం సమకూరుతూనే ఉంటుంది.

మేము వ్యాపారాలన్నీ మానేసినా అలాగే సమకూరుతుంది. మేము ఎన్నో షాపులు వేయడం జరిగింది. వ్యాపారంలో వచ్చే డబ్బు.. అద్దెల రూపంలో ఆ షాపుల నుంచి మాకు వస్తుంది.

కానీ పత్రిగారు 91లో ఉద్యోగం రాజీనామా చేసి కొన్నాళ్ళు చాలా ఇబ్బంది పడ్డారు. 2002 లో నేను పరిచయమయ్యాను, అప్పటికీ ఆయన ఇబ్బందుల్లో ఉన్నారు. కానీ తర్వాత పరిస్థితి అంతా మారిపోయింది, అంటే ఎవరికైనా కొంత పరీక్షా సమయం ఉంటుంది.

పత్రి గారు పరిచయం అయినప్పుడు 2003 లో నేను మొత్తం

వ్యాపారాలన్నీ మూసేసాను. ఇంచుమించు 2012, 13 దాకా చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాను, సంపాదన లేదు. ఈ ధ్యాన, జ్ఞాన ప్రచారానికి ఈ ఊర్లు తిరగడం, ఆ ఖర్చులు వల్ల 10 సంవత్సరాలు చాలా ఇబ్బందులు పడ్డాను, 2013 నుంచి పరిస్థితి మళ్ళీ మారింది .

ఇదంతా జరుగుతుంటే నాకు పత్రి గారే గుర్తొచ్చేవారు. ఎందుకో తెలీదు 2013 నుంచి షాపులు వేయడం మొదలుపెట్టాను. వాటి మీద ఆదాయం వస్తూ ఉంటే ఆ ఆదాయంతో ఇంకా కొన్ని షాపులు కట్టాను. అవి, ఇవి కలిపి వస్తూ ఉంటే ఇంకా కొన్ని షాపులు కట్టాను. వ్యాపారం లేకపోయినా ప్రకృతి ఈ రకంగా సమకూర్చింది.

ఈ ఉపమానంలో చెప్పినట్టుగా ఏదో ఒక విధంగా ప్రకృతి మనకు సమకూరుస్తుంది అన్నది మా ఇద్దరి విషయంలో జరిగింది. ఎంత కష్టంగా ఉన్నా ఈ పనులు చేయడం మానలేదు. తర్వాత అనిపించింది ఇదంతా పరీక్షా సమయమని.

కోట్లు ఆస్తి ఉన్నా పిల్లల్ని బయటికి పంపడం వల్ల వారి వాటాలు వాళ్ళకి ఇవ్వాల్సి వచ్చింది, మేము కొద్దిగా ఉంచుకున్నామంతే. కానీ మాకు ఎప్పుడూ లోటు రాలేదు, ఇప్పటికీ మా కోసం ఖర్చు పెట్టే కంటే అందరికీ ఖర్చు పెట్టడానికే మేము ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాం. అంతేకాదు పరోపకారం చేసేవారికి దుఃఖం కూడా దూరమవుతుంది, నూతన సామర్థ్యం లభిస్తుంది అన్నారు. ఇది కూడా మా జీవితంలో జరిగింది.

ఏమీ తెలియని ఈ ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చిన మేము ఈ మార్గంలో ఛాంపియన్స్ అయ్యాం. మేము పొందిన ప్రతీదీ మీరూ పొందాలనేదే మా ఉద్దేశ్యం. ఇక్కడ నూతన సామర్థ్యం అన్నాను అంటే అంతకు ముందు పుస్తకాలు వ్రాయలేకపోయే వాడిని, ఇప్పుడు ఇద్దరం పుస్తకాలు వ్రాస్తూన్నాం. అంతకు ముందు సందేశాలు ఇవ్వలేకపోయే వాళ్ళం, ఇప్పుడు సందేశాలు ఇవ్వగలుగుతున్నాం. అంతకు ముందు పుస్తకం అంతా చదివినా ఒక విషయం

చెప్పలేకపోయేవాళ్ళం, ఇప్పుడు మీరు ఒక విషయం ఇస్తే పుస్తకమంత సందేశం ఇస్తాం. ఇవన్నీ మా నూతన సామర్థ్యం.

మన ఇంటికి 10 మంది వస్తే ఒక్క రోజుకే గందరగోళ పడిపోతాం. ఇప్పుడు ప్రతి నెలా నాలుగు, ఐదు వందల మంది వచ్చినా, మేడం వంట చూసుకుంటూ, క్లాసులు చెబుతుంది, నేను క్లాసులు చెబుతూ బయట పనులు చూసుకుంటాను, అలా పనులు అయిపోతున్నాయి. చూసేవాళ్ళకి ఆశ్చర్యం కలగొచ్చు, ఇదంతా పరోపకారం యొక్క ఫలితం.

చాలా మంది ఎంతసేపు ఆ పని చేయాలా? ఈ పని చేయాలా? అది చేస్తే బాగుంటుందా? ఇది చేస్తే బాగుంటుందా? అని ఓ ఘర్షణ పడిపోతారు. మనసు కాసేపు అటు, కాసేపు ఇటు ఎటూ తేల్చుకోలేరు. మీరు ఎప్పుడైతే ధ్యాన సాధన చేస్తారో ఏది అవసరమో అదే చేస్తారు, సాధిస్తారు, మంచి ఫలితాలు పొందుతారు. అలాంటి చంచలత్వం పోతుంది, సరైన నిర్ణయాలు చేయగలుగుతారు.

అలాగే శరీరానికి కష్టాలు సహించే శక్తి వస్తుంది. దానికి ఉదాహరణ ఎవరో అక్కర్లేదు. మేమిద్దరమే! సంవత్సరం క్రితం యాసిడ్ నోట్లో పోసుకున్నప్పుడు నేనేమీ విలవిల లాడిపోలేదు, ఏడుస్తూ కూర్చోలేదు, నా బ్రతుకిలా అయిపోయిందే అనుకోలేదు, అసలు నా భవిష్యత్తు ఏమిటి? అని అనుకోలేదు.

ఫైర్ యాక్సిడెంట్ అయినప్పుడు మా మేడం కూడా అలా అనుకోలేదు. నేను ఖచ్చితంగా బయటికి వస్తాను, మళ్లీ మామూలుగానే తిరుగుతాను అనే భావం తోటే ఉంది. ఇవన్నీ జ్ఞానం ఉన్న వాళ్ళకి, జ్ఞానికి ఉండే లక్షణాలు. ఖచ్చితంగా వాళ్ళని సముద్రంతో పోల్చుకోవచ్చు, వాళ్ళు అన్ని రకాలుగా గొప్పవాళ్ళు కాగలుగుతారు. గొప్పవాళ్ళని అనుసరిస్తే ఎవరైనా సరే గొప్పవారు అవుతారు.

## ::5::

**"ధాన్యం గింజలు గాదెలో ఎక్కువ కాలం ఉంచుకుంటే అవి శక్తి కోల్పోయి పనికి రాకుండా పోతాయి. కానీ వాటిని పొలంలో చల్లితే ఎన్నో రెట్ల ఫలితం వస్తుంది.**

**అలాగే భగవంతుడు ఇచ్చిన శరీరం, ఇంద్రియాలు ఉపయోగించ కుండా ఉంచుకుంటే ముసలివైపోయి పనికి రావు. కానీ వాటిని ఉపయోగించు కుని జ్ఞానం సంపాదించుకుంటే, లోక కళ్యాణకరమైన పనులు చేస్తూ ఎన్నో రెట్ల ఫలితం పొందవచ్చు, మోక్షాన్నే పొందవచ్చు, జీవిత లక్ష్యాన్ని సాధించవచ్చు"**

గొప్పవాళ్ళు చెప్పినటువంటి సందేశాల్లో ఎంతో లోతు అర్థం దాగి ఉంటుంది. వాటిని గ్రహించగలిగే సూక్ష్మ బుద్ధి మనకు ఉండాలి. ఏది విన్నా, ఏది చదివినా, ఏది తెలుసుకున్నా, ఏది చూసినా దాని నుంచి ఎంతో గ్రహించాలి. అది సూక్ష్మ బుద్ధిఉన్నవారికే సాధ్యం.

చూడండి ఈ శరీరాన్ని చూస్తే పైకి చర్మమే కనిపిస్తుంది. ఈ చర్మాన్ని ఒక మైక్రోస్కోప్ తో చూస్తే ఎన్నో కణాలు కనిపిస్తాయి. అలాగే ఆ కణాలని అల్ట్రా మైక్రోస్కోప్ పెట్టి చూస్తే ఇంకా సూక్ష్మమైనవి అందులో ఉంటాయి. అలాగే గొప్పవాళ్ళు చెప్పే సందేశాల్లో ఎంతో లోతు అర్థాలు ఉంటాయి. అవి మనం గ్రహించగలిగితే అవి మన జీవితాన్నే మార్చేస్తాయి.

ఏదైనా బుక్ చదవమంటే నేను చదివేసానండి అంటారు. ఏదో చదివితే మనకు తెలిసినట్టు కాదు, అర్థమైనట్టు కాదు. చాలా మంది నాకు ఆ పుస్తకం అయిపోయింది కొత్త పుస్తకం కావాలండి అంటారు. చదవడం అంటే దానిలో ఉన్న సారాన్ని గ్రహించడం, గ్రహిస్తూ చదివేదే సరైన చదువు.

ఎందుకో తెలియదు కానీ ఇంతకుముందు, ఈ మార్గంలోకి వచ్చాక కూడా నాలో ఉండే లక్షణం ఏమిటంటే? పుస్తకాన్ని చదివేటప్పుడు వేగంగా ఎదరికి వెళ్ళలేను. అందరూ పుస్తకాలు అయిపోయినియ్యి, చదివేసాను

అంటారు. కానీ నాకు అర్థం చేసుకుంటూ చదవాలంటే చాలా నెమ్మదిగా చదవాల్సి వచ్చేది. పైపైన అలా చూసేస్తే చదవడం ఎలా అవుతుంది? దానివల్ల ఉపయోగం ఏమిటి?

అందుచేత ఒక పేరా చదివితే దాని గురించి ఎంతో సేపు ఆలోచించే వాడ్ని. అందులో ఉన్న ప్రతీ వాక్యాన్ని అర్థం తెలుసుకుంటూ ఎదరికి వెళ్ళేవాడిని. అందుకే నేను ఏ పుస్తకం కూడా పూర్తిగా చదవలేదు. పుస్తకం పూర్తి చేద్దామన్నట్టుగా చదివితే అది చదివినట్టు లెక్క కాదు.

అందుచేత గొప్పవాళ్ళు వాళ్ళ స్థాయిలో వ్రాసినటువంటి బోధలు ఎంత అర్థంతో కూడుకుని ఉన్నాయో ఆలోచించండి! అందుకే పత్రి గారు ఒక కృష్ణుడు బోధించిన గీత ఆ స్థాయిలో ఉన్న మరొక కృష్ణుడికే అర్థమవుతాయి తప్ప అందరికీ అర్థం కాదు అంటారు. అందుకే భగవద్గీత మీద 100 రకాల వ్యాఖ్యానాలు ఉన్నాయి. చాలామంది పండితులు వివరించిన భగవద్గీతలు చదువుతారు. మా దగ్గర భగవద్గీత ఉంది అని చెప్పుకుంటారు. అది ఎవరు వ్రాసిన భగవద్గీత? ఎవరు వివరించిన భగవద్గీత? అన్నది చూడరు. ఏది పడితే అది చదివితే ఎలా అర్థమవుతుంది? బ్రతుకంతా అలాగే ఉంటారు.

అన్నిటికంటే విద్యా ప్రకాశానందగిరి స్వామి వారు వ్రాసినటువంటి గీతామకరందం చాలా బాగుంటుంది. కానీ దానికంటే కూడా పత్రి గారు మనకు ఇచ్చినటువంటి శ్రీకృష్ణ సందేశం అనే పుస్తకం నాకు చాలా అద్భుతంగా అర్థమైంది.

చివటం అమ్మవారు తన ఆశ్రమానికి వచ్చిన సామాన్యులు ఖాళీ సమయంలో కూర్చుని ఏదో సోది కబుర్లు చెప్పుకుంటుంటే, వాళ్లు ఎంత సమయాన్ని వృధా చేస్తున్నారో వాళ్ళకి అర్థం కావడానికి వాళ్ళందరినీ తీసుకెళ్లి పొలంలో కలుపు మొక్కలు తీయించేదట. ఇంకొక రోజు ఆశ్రమం చుట్టు పక్కలంతా శుభ్రం చేయించేదట. అప్పుడు వాళ్ళు అమ్మ మన చేత శ్రమదానం చేయించింది, అది బాగా పుణ్యం అని భావించేవారట.

కానీ ఆవిడ ఆ పని ఎందుకు చేయించిందో అసలు కారణం వాళ్ళకి అర్థం కాలేదు. ఆవిడ అలా ఎందుకు తీయించిందంటే? మానవుడిలో అరిషడ్ వర్గాలనే కలుపు మొక్కలు ఉన్నాయి, అవి తొలగించుకోవాలి. అలాగే మనసు మురికి పట్టి మలినమై ఉంది, దాన్ని శుభ్రం చేసుకోవాలి. పిచ్చి వెదవల్లారా ఖాళీగా ఎందుకు కూర్చుంటారు? ఈ పని చేయండి. మీ మనసును శుద్ధి చేసుకోండి, మీలో ఉన్న చెడు లక్షణాలు, చెడు గుణాలు తొలగించుకోండి అని ఆవిడ ప్రాక్టికల్ గా చేయించి చూపించారావిడ.

అటువంటి గొప్ప స్థాయిలో ఉన్నవాళ్ళ యొక్క పనులు, మాటలు, సందేశాలు ఆ స్థాయిలో ఉన్న వాళ్ళకే అర్థమవుతాయి కానీ సామాన్యులకు అర్థం కావు. అందుచేత ముందు బుద్ధిని పెంచుకోండి తర్వాత మీకు ఎవ్వరూ, ఏమీ చెప్పక్కర్లేదు. ఆ బుద్ధే మీకు అన్నీ చెప్తుంది. అదే సరైన దారిలో మిమ్మల్ని నడిపిస్తుంది. బుద్ధి అన్నది మానవుడు ఎలా పయనించాలో తెలియజేసే ఒక అద్భుతమైన దిక్సూచి.

మీరు ఇతరులను సలహాలు అడుగుతారు. వాడి పరిస్థితే అలా ఉంటే వాడెలా సలహా ఇస్తాడు. కొంతమంది అంటూ ఉంటారు మేము రాత్రంతా కూర్చుని సజ్జన సాంగత్యం చేసుకున్నామండి అంటారు. అలా వాళ్ళు కలిసి గంటలు... గంటలు తెల్లార్లు కబుర్లు చెప్పుకుంటారు.

సజ్జన సాంగత్యం అంటే సత్యం తెలుసుకన్నవారి సాంగత్యం, అంటే ఆత్మను తెలుసుకున్న వారి సాంగత్యం. సూక్ష్మాతి సూక్ష్మమైన, అణువు కంటే సూక్ష్మమైన, మైక్రోస్కోపుకు కూడా దొరకనంత సూక్ష్మమైన ఆత్మను తెలుసుకోవడమే కాదు, అటువంటి ఆత్మ గురించి చర్చించుకోవడమే అసలైన సజ్జన సాంగత్యం.

అందుచేత ఈ ఉపమానం ఏమిటంటే? ధాన్యం గింజలు ఎక్కువ కాలం ఉపయోగించకుండా గాదిలో ఉంచితే, అవి శక్తి కోల్పోయి పనికి రాకుండా వృధా అయిపోతాయి, వాటిని పొలంలో చల్లితే ఎన్నో రెట్లు ఫలితం

వస్తుంది, పెద్ద పంట వస్తుంది.

అలాగే భగవంతుడు ఇచ్చినటువంటి ఈ శరీరంలో మనకి పైకి కనిపించే బాహ్యేంద్రియాలే కాదు అంతరేంద్రియమైన మనసు కూడా ఉంది. వీటితో రోజూ, మూడు పూటలా ఖానా, పీనా, సోనా చూసుకుంటే ఉపయోగం లేదు. అవి చూసుకుంటుంటే శరీరం అలాగే ఉంటుందా? అంటే ఉండదు. కొన్నాళ్ళకి ముసలిదైపోతుంది, ఇంద్రియాలు శక్తిని కోల్పోతాయి, దేనికీ పనికి రాకుండా పోతాయి.

కానీ ఆ శరీరాన్ని, ఇంద్రియాల్ని కండిషన్లో ఉన్నప్పుడే ఉపయోగించుకుంటే, అంటే ఖాళీ దొరికినప్పుడల్లా ధ్యానంలో కూర్చోపెడితే అద్భుతమైన జ్ఞానం సంపాదించి పెడతాయి. అప్పుడు వాడు లోకానికి ఉపయోగపడే ఎన్నో రకాలైన పనులు చేస్తాడు, ఎన్నో సేవలు చేస్తాడు. ఆ ఇంద్రియాల్ని ఆ శరీరాన్ని ఉపయోగించి వాడు చివరికి ఎన్నో రెట్లు ఫలితం పొందుతాడు అంటే మోక్షాన్నే పొందుతాడు. వాడికి నిర్దేశించబడినటువంటి లక్ష్యాన్ని కూడా సాధిస్తాడు, జన్మ ధన్యం చేసుకుంటాడు అంటే జన్మ లేని స్థితిని పొందుతాడు, ఏది చేయాలో అది చేసి సాధిస్తాడు.

ధాన్యం గాదెలో పడేస్తే పనికి రాకుండా పోతాయి. అలాగే ఇంద్రియాల్ని, శరీరాన్ని ఊరికే పనికి రాని కబుర్లు చెప్పుకోడానికి, వాడి మీదా వీడి మీదా నేరాలు చెప్పుకోడానికి, విమర్శించుకుంటూ కాలక్షేపానికి ఉపయోగిస్తే ఏమవుతుంది? కొన్నాళ్లకి ముసలి వయస్సు వచ్చి కంటి చూపు తగ్గిపోతుంది, మాట స్పష్టత ఉండదు, వినికిడి తగ్గిపోతుంది, శరీరం కూడా పని చేయదు.

అదే ఇవన్నీ సరైన విధంగా ఉపయోగిస్తే మిరకల్స్ చేస్తారు. మరి యోగులు చేసిన పని అదే. అందుకే వాళ్ళని దేవుళ్ళని పొగడడమే కాదు, వాళ్ళ కాళ్ళ మీద పడి మేము తరించే మార్గం చెప్పండని కోరడం కాదు, వాళ్ళలాగే సాధన చేసి జ్ఞానం పొందాలి.

::6::

**"ఒక పిల్లవానికి ఒక రత్నం దొరికింది. ఆ పిల్లవానికి ఆ రత్నం విలువ తెలియక దానిని గోళీగా ఆడి ఆకలైన వెంటనే ఆ రత్నాన్ని అవతల పారవేసి ఇంటికి వెళ్ళిపోతాడు.**

**అదే విధంగా మానవులు పరమేశ్వరుని దయచేత దొరికిన రత్నం లాంటి ఈ అమూల్యమైన మానవ జన్మను, గోళీ ఆటలా సుఖాలకు, భోగాలకు, జల్సాలకు ఉపయోగించి రత్నం విలువ తెలియని పిల్లవానిలా శరీరాన్ని వదిలివేస్తున్నారు.**

**కానీ ఈ శరీరం విలువ తెలుసుకున్నవారు శరీరాన్ని ఉపయోగించి ధ్యానం చేసి జ్ఞానం సంపాదించుకుంటారు, జీవితంలో ఎన్నో లాభాలు పొందుతారు, చివరకు దైవంగా ఎదుగుతారు".**

లోకంలో ఎక్కువ శాతం మందికి ఈ శరీరం విలువ తెలియదు. మానవ జన్మ యొక్క గొప్పతనం అర్థం కావట్లేదు. మానవ జన్మ లభించడం దుర్లభమని, అంత తేలిగ్గా రాదని పెద్దలు చెప్పారు.

పత్రి గారు కూడా చెప్పారు. పరిణామ క్రమంలో ఎన్నో రకాల కీటక జన్మలు, జలచరాల జన్మలు, పక్షి జన్మలు, జంతు జన్మలు పూర్తి చేసుకోవడానికి కోట్లాది సంవత్సరాలు పడుతుంది. వాటి తర్వాత లభించిందే మానవ జన్మ. అంటే 84 లక్షల రకాల జీవరాశుల కంటే కూడా మానవ జన్మ ఎంత గొప్పదో మనం అర్థం చేసుకోవచ్చు.

ఒక పిల్లవాడికి రత్నం దొరికినా రత్నం విలువ తెలియక అది గోళీ అనుకొని కాసేపు ఆట్లాడుకొని పడేసి వెళ్ళిపోయినట్టు, మానవ జన్మ వచ్చినా కూడా ఈ జన్మ యొక్క విలువ తెలియక దీన్ని ఎక్కువ శాతం మంది సుఖపడడానికి, భోగించడానికి, సరదాలకి, ఏవో జల్సాలకి, త్రాగుడికి ఇలా

రకరకాలు వాటికి ఉపయోగించి చివరికి శరీరాన్ని వదిలేస్తున్నారు.

ఎక్కువ శాతం మంది తమో గుణంలో, రజో గుణంలో వుంటారు. అంటే భూమిమీద తమో గుణంలో ఉన్నవాళ్ళు 60%, రజో గుణంలో ఉన్నవాళ్ళు 30% ఉంటారు అంటే 90% మంది ఈ శరీరాన్ని వీటికే ఉపయోగిస్తున్నారు.

కానీ చాలా తక్కువ శాతం మంది ఈ మానవ జన్మ యొక్క గొప్పతనం తెలుసుకుని ఈ శరీరంతో "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేసి, అద్భుతమైన జ్ఞానాన్ని సంపాదించుకుంటున్నారు, జీవితంలో ఎన్నో లాభాలు పొందుతున్నారు, చివరకు మానవ జన్మ లక్ష్యమైనటువంటి దైవంగా ఎదుగుతున్నారు, పూర్ణాత్మ కాగలుగుతున్నారు.

అందుచేత రత్నం విలువ తెలియని పిల్లవాడిలా మీ జీవితం వుండ కూడదు. రత్నం విలువ తెలిస్తే దాన్ని దాచుకుని ఎన్నో రకాలుగా ఉపయోగించు కుంటారు, జీవితంలో ఎంతో లాభం పొందుతారు.

అలాగే దొరికినటువంటి ఈ మానవ జన్మ గొప్పతనం తెలుసుకుని, ఈ శరీరం యొక్క గొప్ప శక్తి ఏమిటో తెలుసుకుని దీన్ని ఉపయోగించి జ్ఞానం సంపాదించుకోవాలి.

మీరు పత్రిగారిని గమనించినట్లయితే ఆయన్ని కడ్తాల్‌లో స్టేజ్ మీద కానీ, ఇంకెక్కడైనా కానీ ఎన్నో రకాలుగా, ఎంతో మంది చేత ఇంటర్వ్యూలు చేయించేవారు. వాళ్ళ సమస్యల గురించి, వాళ్లకున్న సందేహాలు గురించి రకరకాల ప్రశ్నలు వేసేవారు. ఏ ప్రశ్న వేసినా ఆయన చివరికి మీరు ధ్యానం చేయండి అనేవారు. ఏ లాభం రావాలన్నా ధ్యానం చేయండి అనేవారు, ఏ సమస్య పోవాలన్నా ధ్యానం చేయండి అనేవారు. అన్నిటికీ "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేయాలనేవారు.

మీరు ఏ లాభం పొందాలన్నా ధ్యానం తప్ప ఇంకేదీ లేదు అన్నది

అప్పుడు నాకు అర్థమైంది. అలాగే ఆయన ఈ ధ్యానం ద్వారానే జ్ఞానం అని కూడా చెప్పారు, అంటే విలువ కట్టలేని జ్ఞానం పొందాలి అంటే ధ్యానం చేసి తీరవలసిందే. అలాగే జ్ఞానం పొందితే జీవితంలో వచ్చే లాభాల గురించి ఎన్నో రకాలుగా చెప్పుకున్నాము. జ్ఞానం సుఖ శాంతులను కలుగజేయడమే కాదు జ్ఞానం పొందడం వల్ల జీవిత లక్ష్యం కూడా సాధించడానికి ఎంతో ఉపయోగ పడుతుంది.

ఎందుచేతనంటే మీరు జ్ఞానం పొందితే దేనికి ఆశపడరు, కోరికలు అదుపులో ఉంచుకుంటారు, ఉన్న దానితో తృప్తిగా జీవిస్తూ ఇతరులకి కొంచెం పంచుతారు, సృష్టి రహస్యమైన అంతా ఒకటే అన్న విషయం తెలుసుకుంటారు.

అసలు నేను ఎవరు? ఎక్కడి నుంచి వచ్చాను? దేనికోసం వచ్చాను? నా చుట్టూ ఉన్న వాళ్ళకి, నాకు అసలు సంబంధం ఏమిటి? ఏమిటి ఈ జీవితం? లోకంలో రకరకాల జనం, రకరకాల సమస్యలతో, రకరకాల కష్టాలతో ఉంటున్నారు. దీనికి కారణం ఏంటి? అని ఆలోచిస్తారు. ఒక బుద్ధుడికి ఎలాంటి ఆలోచన వచ్చిందో కొంచెం జ్ఞానం సంపాదించుకుంటే మీకు కూడా అటువంటి ఆలోచనే వస్తుంది.

ఎంతసేపూ ఎలా తిందామా? ఎలా తాగుదామా? ఎలా సుఖ పడదామా? అని ఆలోచించడం కాదు. పిల్లాడికి గోలీ దొరికితే ఒక రాయి అనుకుని కాసేపు ఆడుకొని అవతల పారేశాడు, అలాగే ఈ శరీరం కొన్నాళ్ళు ఉంటుంది తర్వాత పోతుంది అనుకుంటూ.. ఉన్నన్నాళ్ళు సుఖపడాలనుకుంటూ.. ఎన్ని రకాలుగా వీలైతే అన్ని రకాలుగా సుఖపడాలి అనుకుంటూ.. అలా సుఖపడడానికి కావలసినటువంటి ధన సంపాదనకు ఎక్కువ సమయం వెచ్చిస్తూ, సంపాదించిన ధనాన్ని సుఖపడడానికి ఉపయోగిస్తున్నారు, జీవితాన్ని అలాగే గడుపుతున్నారు మానవులు.

అలా గడిపితే ఏమవుతుంది? చూడండి పిల్లవాడు ఎదగడం

ఎంతసేపు? ఎదిగిన వాడు యవ్వనంలోకి రావడం ఎంతసేపు? వాడు పెళ్లి చేసుకుని కౌమార స్థితికి రావడం ఎంతసేపు? ముసలితనంలోకి ప్రవేశించడం ఎంతసేపు? చివరికి ఆ శరీరం వదిలేయడం ఎంతసేపు? అలా జన్మని వృధా చేసుకుంటున్నారు.

అదే ఈ శరీరాన్ని ఉపయోగించి జ్ఞానం సంపాదిస్తే విలువ కట్టలేనటు వంటి దైవ స్థితిని సంపాదించుకోగలుగుతారు. జీవితం యొక్క విలువ తెలిసినవాడు అంటే  కొద్దిగా జ్ఞానం పొందినవాడు చేయకూడని పనులు చేయడు, చేయవలసిన పనులే చేస్తాడు. అంతేకాదు లోక కళ్యాణకరమైన కార్యక్రమాలు నిర్వహిస్తాడు. వాటిని ప్రోత్సహిస్తాడు. వాటికి సహకరిస్తాడు. అంతే కాదు తాను చేసే పని ధర్మమా? కాదా? అని చూస్తాడు. తన గురించి ఎవరు ఏమనుకున్నా లెక్క చేయడు.

అరిషడ్ వర్గాలు అదుపులో ఉంచుకుంటాడు, త్రికరణ శుద్ధిగా జీవిస్తాడు, ధర్మాన్ని ఆచరిస్తాడు. జీవితంలో ఎదురయ్యే ద్వంద్వాలలో అంటే శీతోష్ణాల్లో కానీ, గెలుపు ఓటముల్లో కానీ, నిందా స్తుతుల్లో కానీ, సుఖ దుఃఖాల్లో కానీ, మాన అవమానాల్లో కానీ సమస్థితిలో ఉంటాడు, మాట మీద ఎరుక ఉంటుంది.

సృష్టికి అనుగుణంగా జీవిస్తాడు, సృష్టి నిర్ణయాన్ని గౌరవిస్తాడు. సృష్టి తీసుకునే ప్రతి నిర్ణయము సరైనదే అని తెలుసుకుంటాడు. ఇక్కడ మీరు ఒక విషయం తెలుసుకోవాలి. సృష్టిలో ఎన్నో మార్పులు, ఎన్నో సంఘటనలు జరుగుతూ ఉంటాయి, ప్రతీదానికి కూడా కారణం ఉంటుంది, కారణం లేకుండా ఏదీ జరగదు.

వరదలు వచ్చినా, వర్షాలు వచ్చినా, మండేటటువంటి ఎండ కాసినా, తట్టుకోలేని చలి వేసినా, ఇలాంటి మార్పులు ఎన్ని వచ్చినా, సహించలేని వాళ్ళు తిట్టుకుంటూ ఉంటారు, చిరాకు పడుతూ ఉంటారు.  ప్రకృతి అంటే

ఎవరో కాదు సాక్షాత్తు ఆ పరబ్రహ్మే. ప్రకృతిని మీరు విమర్శిస్తే పరబ్రహ్మను విమర్శించినట్లే. మీరు ఆయన ముందు ఎంత? ఆయన్ని విమర్శించే స్థాయిలో ఉన్నారా? ఎంత అజ్ఞానం.

అందుచేత జ్ఞానవంతులు కావాలనుకునేవారు సృష్టిలో ఏది జరిగినా విమర్శించకూడదు, అన్నీ సృష్టికర్త నిర్ణయం ప్రకారమే జరుగుతున్నాయని తెలుసుకోవాలి.

అనంతమైన ఈ ప్రపంచంలో ఏం జరుగుతుందో మీకేం తెలుసు? మీ ఊళ్ళో, మీ ఇంట్లో ఉండి ఏదో చిన్న పరిధిలో జీవిస్తున్న మీకు ఏవి? ఎందుకు? జరుగుతున్నాయో ఎలా తెలుస్తుంది? ఆయన ఒక ప్రణాళికతో ఈ సృష్టి రచన చేశాడు. ఈ సృష్టిలో పరిణామ క్రమంలో మానవులుగా వచ్చిన వారు మీరు. మీకు మాధవుడు కావాలనేటటువంటి లక్ష్యం ఇవ్వబడింది.

మీ లక్ష్యం సాధించడానికే ఆయన చేసే ప్రయత్నం. ఇన్ని కోట్ల మంది మానవులు ఉన్నా ఒక్కొక్కడు ఒక్కొక్క స్థాయిలో ఉంటారు, అది మీకు తెలియదు. మానవులంతా ఒకటే అనుకుంటారు, కాని వాళ్ళు రకరకాల ప్రవర్తనలతో ఉంటారు. వారు ఎదగాలి కానీ ఎదిగే ప్రయత్నం మానేసి ఎన్నో చేయకూడని పనులు చేస్తున్నారు.

ముఖ్యంగా పత్రి గారు భూమ్మీదకు వచ్చి ఆ విషయమే నొక్కి చెప్పారు. జీవ హింస చేయకండి, మాంస భక్షణ మానండి అన్నారు. ఎందుకన్నారంటే? అది సృష్టి విరుద్ధమైన పని కాబట్టి. మరి అది అందరికీ చెప్పడానికి ఆయన జన్మ ఎక్కడ సరిపోయింది?

అందుచేత ఆ విరుద్ధమైన పనులు చేసినప్పుడు వారికి బుద్ధి చెప్పడానికి ప్రకృతిలో జరిగే విపరీతమైన మార్పులు భూమిమీద ఉన్న అందరినీ ఆలోచింపచేస్తాయి. ఎంతో పెద్ద ఇల్లు కట్టుకొని హాయిగా జీవించేవాడికి భూకంపం వచ్చి ఇల్లు కూలిపోయి రోడ్డు మీద పడితే, కోట్లు ఉన్నవాడు

బికారి అయిపోతే ఆలోచించడా? ఎందుకు నా పరిస్థితి ఇలా అయిపోయింది అని అంతర్మధనం జరగదా?

చిన్న కష్టం వస్తే చిన్న కష్టం అనుకుంటాడు. మానవులం కాబట్టి వస్తున్నాయి అనుకుంటాడు, లేకపోతే ముసలోళ్ళమయ్యాం కాబట్టి వస్తున్నాయి అనుకుంటాడు. కానీ ఇంత పెద్ద కష్టం వస్తే అంతర్మధనం బాగా జరుగుతుంది. ఓ.. నేను చేయకూడని పనులేవో చేశాను, నేను చేయకూడని హింస చేశాను. ఇతరులని బాధించాను, ఇతర జీవుల్ని హింస పెట్టాను, ఈ రకంగా ఆ ఫలితం అనుభవిస్తున్నాను. ఇంకెప్పుడూ ఇలాంటి పని చేయకూడదు అని చెప్పి నిర్ణయించుకొని ఎటువంటి పరిస్థితిలో ఆ పని చేయడు.

అలా ఎప్పుడైతే మానేస్తాడో వాడు ఒక మెట్టు ఎదిగినట్టు. అలా జీవితంలో అనుభవాలతో ఎన్నో మెట్లు ఎదుగుతాడు. అసలు అంతా జన్మ తీసుకునేది కర్మలు అనుభవించడానికే. కర్మలు లేకపోయినా భూమిమీదకు వస్తే అవతరించాడు అంటారు. అవతారము అంటే లోక కళ్యాణం కోసం భూమ్మీదకి రావడం, మీరు ఆ స్థాయికి రావాలి.

మరి ఎన్నో అనుభవాలు పొందిన తర్వాత ఎన్నో తెలుసుకున్న తర్వాత, ఎంతో జ్ఞానం సంపాదించుకున్న తర్వాత, తన తప్పులు ఎన్నో సరి చేసుకున్న తర్వాత, ఆ స్థితికి వస్తారు. నిజానికి మీరంతా కూడా ఆ ప్రయత్నంలో వున్నారు.

నేను ఖచ్చితంగా చెప్తున్నాను మీరు 60% లో ఉన్నవాళ్ళు కాదు, 30% లో ఉన్నవాళ్ళు కాదు, ఆఖరికి 9% లో ఉన్నవాళ్ళు కూడా కాదు, మీరు 1% లో ఉన్నవాళ్ళు. మీ బుద్ధి బాగా ఉపయోగిస్తే మీరు ఇంకా ఎన్నో విజయాలు సాధిస్తారు. గుర్తుపెట్టుకోండి భూమిమీద మీరు శాశ్వతం కాదు, మీ చుట్టూ ఉన్నవి ఉండవు, మీవారు అనుకున్నవారు ఎవ్వరూ మీ వారు కాదు, నీవారు అనుకున్నావంటే అది నీ భ్రమ.

అందుచేత ముఖ్యంగా ఒక్క విషయం తెలుసుకోండి. ఆత్మజ్ఞాని వాతావరణంలో మార్పుల గురించి విమర్శించడు, ప్రస్తావించడు, వాటిని పట్టించుకోడు. విమర్శించారంటే మీరు చాలా అజ్ఞానంలో ఉన్నట్లే లెక్క.

ఇది నాకు ఎప్పుడు బాగా అర్థమైందంటే? శివప్ప అనే ఆయన పత్రిగారి పాట రికార్డింగ్కి మీరు కూడా హైదరాబాద్ రండి, సార్ కూడా మీరు వచ్చి రికార్డింగ్ చూద్దురు గాని అన్నాడు. అప్పుడు హైదరాబాద్ వెళ్ళాను. అప్పుడు నాకు హైదరాబాద్ లో ఎవరూ తెలియదు కొత్త, సార్ ఇంటికే వెళ్ళి పైన ఒక రూమ్లో ఉన్నాను, అప్పుడు ఆయనకి కారు లేదు. స్టూడియోకి పత్రి గారు నేను ఆటోలో వెళ్తున్నాం. ఆయన ఏదో పాట ప్రాక్టీస్ చేసుకుంటున్నారు.

దారిలో నేను ఖాళీగా ఉండలేక ఎండ చంపేస్తుందండి అన్నాను. అప్పుడాయన ఆత్మజ్ఞాని వాతావరణం గురించి మాట్లాడతాడా? అన్నారు. ఇంక అంతే ఆగిపోయాను. ఆయన లోపల ఏం జరుగుతుందో తెలియదు, కానీ నా లోపల చాలా అంతర్మథనం జరిగింది. ఇంక అక్కడి నుంచి ప్రకృతి గురించి విమర్శించడం కానీ, మాట్లాడడం కానీ ఏమీ చేయలేదు, ఏం జరిగినా అంతా మంచికే అని అర్థం చేసుకున్నాను.

అజ్ఞానులు ఎలా ఉంటారంటే? బట్టలు ఆరబెట్టుకున్నప్పుడు, ఒడియాలు ఆరబెట్టుకున్నప్పుడు వర్షం వస్తే తిట్టుకుంటారు. ఆ వర్షమే లేకపోతే పరిస్థితి ఏమిటి? వర్షం వల్లే కదా మొక్కలన్నీ బ్రతుకుతున్నాయి. మొక్కలన్నీ బాగా బ్రతకడం వల్లే ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ 84 లక్షల రకాల జీవరాశులు బ్రతుకుతున్నాయి. పంట లేకపోతే మీరు ఎక్కడ బ్రతుకుతారు? ఆ వృక్షాలు, ఆ మొక్కలు లేకపోతే జంతువులన్నీ ఎలా బ్రతుకుతాయి? ఆ జంతువులే లేకపోతే మాంసాహార జంతువులు ఎలా బ్రతుకుతాయి? ఇవన్నీ ఉండాలి అంటే వర్షం పడాలి. వర్షమే లేకపోతే ఒక సంవత్సరం రెండు సంవత్సరాల్లో భూమిమీద జీవరాశి అనేది ఉండదు, అంతరించిపోతుంది.

ఆలోచించండి అది ఎంత ప్రమాదం. మీకు అన్నీ సమకూరుతున్నాయి కాబట్టి ఆ ఆలోచన ఉండదు, ఆ కరువు వచ్చినప్పుడు అర్థమవుతుంది. ఎడారి ప్రాంతాల్లో ఒక బిందె నీటి కోసం ఎంత పాటుపడతారో చూడండి. అందుచేత ప్రకృతి ఎప్పుడు, ఏది సమకూర్చాలో సమకూరుస్తుంది. ఎప్పుడు, ఎక్కడ, ఎవరికి, ఏ పాఠం చెప్పాలో ఆ పాఠం చెప్తుంది.

అందుకే ఈ సునామీలు, భూకంపాలు, ఈ వరదలు. దేశాల్లో ఎవడు తిన్నగా జీవిస్తున్నాడు? ఎవడు సరిగ్గా ఉన్నాడు? అంతా ఒకటే అని ఎవరైనా తెలుసుకుంటున్నారా? జ్ఞానం పొందుతున్నారా? ఆ రకంగా జీవిస్తున్నారా? అలా జీవిస్తే ఇవన్నీ ఉండవు. ఇప్పుడు అన్ని దేశాల్లో పరిస్థితి ఇలాగే ఉంది.

అందుచేత జ్ఞానం పొందితే ఇవన్నీ తెలుసుకోగలుగుతారు. జీవితాన్ని మార్చుకుంటారు. గొప్పవాళ్ళు అవుతారు చివరికి దైవ స్వరూపంగా ఎదుగుతారు. రత్నం విలువ తెలియని కుర్రవాడిలా ఉండకూడదు. ఈ శరీరం యొక్క విలువ తెలుసుకొని దీనితో జ్ఞానం సంపాదించి దైవంగా ఎదగడానికి ప్రయత్నించాలి.

::7::

**“ఇనుము మట్టి స్నేహం వల్ల తుప్పు పట్టి నాశనం అవుతుంది. అలాగే నిప్పు స్నేహంతో తుప్పును వదిలించుకొని తన స్వరూపాన్ని పొందుతుంది.**

**అలాగే అజ్ఞాని దుర్జనుల సాంగత్యంతో జీవితాన్ని నాశనం చేసుకుంటాడు. కానీ జ్ఞాని సజ్జనుల సాంగత్యంలో జ్ఞానాన్ని పొంది జీవితంలో తన స్వరూపాన్ని పొందుతాడు”**

ఇనుము మట్టితో సాంగత్యం చేయడమంటే ఇనుము మట్టిలో ఉంటే కొన్నాళ్ళకి అది తుప్పు పట్టి దాని స్వభావం మొత్తం కోల్పోతుంది. మొత్తం తుప్పు పట్టి, పొట్టు, పొట్టు క్రింద రాలిపోతుంది. అదే నిప్పుతో స్నేహం చేసినట్లయితే ఏమైనా కొద్దో గొప్పో తుప్పు ఉన్నా దాన్ని వదిలించుకొని మళ్లీ తిరిగి తన అసలు స్వరూపాన్ని పొందుతుంది.

అలాగే మానవులు రెండు రకాలుగా ఉంటారు, జ్ఞానులు, అజ్ఞానులు అని. అజ్ఞానులు దుర్జనులతో సాంగత్యం చేస్తారు. దుర్జనుడు అన్నీ తప్పులు, పాపాలు, చెయ్యకూడని పనులే చేస్తాడు. వాడికి ఎన్నో రకాల వ్యసనాలు, అలవాట్లు, చెడు లక్షణాలు, చెడు గుణాలు ఉంటాయి. వాటి వల్ల చేయకూడని పనులే చేస్తాడు. అటువంటి దుర్జనులతో వీడు సాంగత్యం చేస్తే, కొన్నాళ్ళకి వీడు కూడా అలాగే తయారైపోతాడు.

మనం చెప్పుకుంటాం కదా! ఒకడు మూడు మాసాలు ఒక తాగుబోతుతో ఉన్నట్లయితే వాడూ తాగుబోతు అవుతాడు. పేకాడే వాడితోటి ఉంటే వీడూ పేకాడుతూ ఉంటాడు. దొంగతో ఉంటే వీడూ దొంగతనం నేర్చుకుంటాడు, అదే కరెక్ట్ అనుకుంటాడు. దీన్నే సహవాస దోషం అంటారు, అందుచేత పెద్దలు దుర్జనులతో సాంగత్యం చేయొద్దు అంటారు.

కానీ ఏ మానవుడైనా సరే సజ్జనుడితో సాంగత్యం చేస్తే అంటే సత్యం తెలిసినవారితో, సత్యంలో జీవించేవారితో, సత్యాన్ని బోధించే వారితో జీవించినట్లయితే వారు మెల్లిగా తన స్వరూపాన్ని తెలుసుకుంటారు, జ్ఞాని అవుతారు. అందుకే శంకరాచార్యుల వారు ఏం చెప్పారంటే?

**"త్రిజగతి సజ్జన సంగతి రేకా**

**భవతి భవార్ణవతరుణే నౌకా"** అన్నారు.

తరించడం అంటే తీరాన్ని దాటటం. ఒక తీరం నుండి ఇంకొక తీరానికి వెళ్లాలంటే నౌక కావాలి. అలాగే మానవుడు దుఃఖ తీరాన్ని దాటి ఆనంద తీరాన్ని చేరుకోవాలి అంటే సజ్జనులతో సాంగత్యం చేయాలి.

ఇప్పుడు మీరందరూ ఈ మూడు రోజుల క్లాసులకి ఎందుకు వస్తున్నారు? సత్యం తెలుసుకోవడానికి, అంటే ఆత్మను తెలుసుకోవడానికి, నేనే ఆత్మను అని తెలుసుకోవడానికి.

మరి రమణ మహర్షుల వారు తన దగ్గరికి ఎవ్వరు ఏ సమస్యతో వచ్చినా, అంటే నాకు కష్టాలు ఉన్నాయి ఏం చేయమంటారండి? అని అడిగినా ముందు నువ్వు ఎవరో తెలుసుకో అనేవారు. నాకు రోగాలు ఉన్నాయి అంటే! నువ్వు ఎవరో తెలుసుకో. ఇంట్లో గొడవలు ఉన్నాయి అంటే! నువ్వు ఎవరో తెలుసుకో. ఇలా ఈ ఒక్క మాటే చెప్పేవారు. చాలామంది ఈయన మాట్లాడితే నువ్వు ఎవరో తెలుసుకో అంటున్నాడు. ఆ మాత్రం దానికి మనం ఆయన దగ్గరికి వెళ్ళి అడిగేదేమిటి? అని కూడా అనుకునేవారట.

ఎందుకు అంటే రహస్యం అంతా అక్కడే ఉంది. ఎవరికైనా సమస్యలో, కష్టాలో, నష్టాలో, బాధలో, ఇబ్బందులో ఏవో వస్తాయి. అవి ఎందుకు వస్తున్నాయో అర్థం కాదు. ఎందుకు వస్తాయి? వాడికి సత్యం తెలియక. తానెవరో తనకి తెలియక. అది తెలుసుకోగలిగితే ఇవన్నీ రావు.

అందుచేత ఎవరి జీవిత లక్ష్యమైనా తన స్వరూపాన్ని, అంటే తన

సత్య స్వరూపాన్ని తెలుసుకోవాలి, తాను ఎవరో తెలుసుకోవాలి, అదే రమణ మహర్షి చెప్పేవారు.

ఎందుచేతనంటే? తాను దేహం అనుకుంటున్నాడు. మరి నిజంగా తాను దేహమా? అంటే కాదు. దేహం అనుకున్నప్పుడు అంతా వేరు వేరుగా కనిపిస్తుంది, వేరుగా భావిస్తాడు. ఇతరులకి తనకి కులాల విషయంలో, మతాల విషయంలో, ప్రాంతాల విషయంలో ఎన్నో తేడాలు కనిపిస్తాయి. అందుకే ఈ ద్వేషాలు, కక్షలు, కార్పణ్యాలు.

అదే అంతా ఒకటే అన్నది అర్థమైతే ఇలాంటి ప్రవర్తన ఉండదు, ఇలాంటి పనులు చేయడు. కష్టాలు వస్తున్నాయి, బాంధవ్యాలు సరిగ్గా లేవు అంటే తానెవరో తెలియకపోవడం వల్లే! సత్యం తెలియకపోవడం వల్లే! సత్యం చెప్పగలిగిన వారి సాంగత్యం చేయకపోవడం వల్లే!

ఎప్పుడైతే ఇద్దరూ ఈ దేహం నేను కాదు, నేను ఆత్మ అని తెలుసుకుంటారో, ఇద్దరూ ఒకటే అని తెలుసుకుంటారో ఒకరినొకరు గౌరవించుకుంటారు. లేకపోతే నేను భర్తను, నేను పురుషుడిని అనుకుంటూ అధికారం, ఆధిపత్యం చేసే ప్రయత్నం చేస్తారు. నా మాటే వినాలి, నేను చెప్పినట్టే ఈవిడ చేయాలి అని చూస్తారు. నేను స్త్రీ అని భావిస్తే నా బ్రతుకు ఇలా అయిపోయింది అని బాధపడుతూ కూర్చుంటుంది. సత్యం తెలుసుకుంటే ఇద్దరూ ఎంతో స్నేహంగా ఉంటారు, సంసారంలో స్వర్గాన్ని చూస్తారు.

అందుకే సజ్జన సాంగత్యాన్ని మించింది లేదు అంటారు. అందుకే మీరు 27 రోజులు అన్ని పనులు చేసుకుంటూ, కుటుంబ బాధ్యతలు నిర్వర్తించుకుంటూ, సంసార సుఖాలు అనుభవిస్తూ, ఈ మూడు రోజులు సజ్జన సాంగత్యం కోసం భీమవరం వస్తున్నారు. రెండు, మూడు గంటలు ఉదయం జూమ్ లో పాల్గొంటున్నారు.

పత్రిగారు చెప్పిన సంసారంలోనే నిర్వాణం అన్న మాటల్ని పూర్తిగా

ఆచరిస్తూ.. సంసారంలోనే నిర్వాణానికి ప్రయత్నిస్తున్నారు. ఎందుకంటే సృష్టిలో సంసారం అనేది ఉంటుంది, సంసారమే లేకపోతే సృష్టే జరగదు. నిర్వాణం ఎంత ముఖ్యమో, సంసారం అంతే ముఖ్యం.

కొంతమంది ఆ పిల్లల్ని, సంసారాన్ని అన్నీ వదిలేసి నేను నిర్వాణం కోసం ప్రయత్నిస్తున్నాను అంటూ ఓవర్ యాక్షన్ చేస్తారు, ఇక్కడ అన్నీ వదలమనలేదు. అలా ఎవరూ చెప్పరు, పత్రిగారు అసలు చెప్పలేదు, కాని మమకారం వదలమన్నారు.

అందుచేత ఒక ప్రక్క భర్త సంపాదించుకుంటూ.. భార్య ఇంటి పనులు చేసుకుంటూ... కొద్ది సమయాన్ని నిర్వాణం కోసం కేటాయించు కోవాలి. మరి నిర్వాణం ఎప్పుడు వస్తుంది? తన స్వరూపాన్ని తాను తెలుసుకున్నప్పుడు వస్తుంది. దుఃఖం నుంచి శాశ్వతంగా బయట పడే స్థితే నిర్వాణం, దాన్నే మోక్షం అన్నారు. పత్రిగారు దానికి ఎన్నో పేర్లు చెప్పారు నిశ్రేయస్సు, అపవర్గం, లిబరేషన్, ఎన్లైటన్మెంట్ ఇలా చాలా మాటలు చెప్పారు.

ఇది ఎప్పుడు జరుగుతుందంటే? సజ్జనుల సాంగత్యంలో జరుగు తుంది. ఎందుచేతనంటే ప్రతి ఒక్కరు తన స్వరూపాన్ని మర్చిపోయారు. నేను ఆత్మ అన్న విషయం జన్మ తీసుకోగానే మర్చిపోయారు. కానీ మళ్లీ శరీరాన్ని వదలగానే అంటే చనిపోగానే తెలుసుకుంటారు.

జన్మతో తన స్వరూపాన్ని మర్చిపోతారు. మరణంతో తన స్వరూపాన్ని తెలుసుకుంటారు. తన స్వరూపాన్ని మర్చిపోవడం వల్లే మాయలో పడిపోతారు. మరణించిన తర్వాత తన స్వరూపం తెలుసుకుంటారు కాబట్టి మాయలో నుంచి బయట పడతారు. అక్కడ మాయ ఉండదు, వాస్తవం ఉంటుంది.

మరణించకపోయినా జీవించి ఉండగానే తన స్వరూపాన్ని తెలుసుకో గలిగితే వాడు కూడా మాయను జయించిన వాడు అవుతాడు. మాయలో ఉన్నంత కాలం అన్నీ రివర్స్‌గానే చేస్తాడు. చెయ్యకూడనివే చేస్తాడు, విరుద్ధమైనవే

చేస్తాడు. కానీ మాయలో నుంచి బయట పడినవాడు చేయవలసినవే చేస్తాడు. మాయ అంటే లేనివన్నీ ఉన్నాయని అనుకోవడం.

శరీరం ఉందా? లేదు. పిల్లలు ఉన్నారా? లేరు. బంధువులు ఉన్నారా? లేరు. ధనం ఉందా? లేదు. ఇవన్నీ ఉన్నాయని అనుకుంటున్నారు అదే మాయ. ఇవన్నీ నావి నావి అనుకుంటారు అదే మాయ. అదే శంకరాచార్యుల వారు జాగ్రత్త పంచకంలో చెప్పారు.

శంకరాచార్యుల వారు బౌద్ధ మతంలో ఉన్న భారతదేశాన్ని మూడు సార్లు కాశ్మీరు నుంచి కన్యాకుమారి దాకా కాలి నడకన తిరిగి హిందూ మతంగా మార్చేశాడు. అంత శక్తివంతుడు, అంత జ్ఞానవంతుడు. ఆయన్ని సామాన్యంగా తీసుకోవడానికి లేదు. భజగోవిందం, వివేక చూడామణి ఇలా ఎన్నో గ్రంథాలు వారువ్రాశారు, అజ్ఞానులందరినీ జ్ఞానం వైపు నడిపించారు, ద్వైతం నుంచి అద్వైతం వైపు నడిపించారు. అటువంటి శంకరాచార్యుల వారు బోధించిందే జాగ్రత్త పంచకం, అది ప్రతి ఒక్కరూ చదవాలి.

చాలామంది సంసారం చేయొద్దా? సంపాదించుకోవద్దా? ఇలాంటి ప్రశ్నలు వేస్తారు. అన్నీ ఉండాలి మమకారం ఉండకూడదు. నీకు సరిపడా నువ్వు సంపాదించుకోవాలి. సంపాదించుకున్న తర్వాత నువ్వు ఈ ఆధ్యాత్మిక మార్గంలో జ్ఞాన మార్గంలో ఎదిగే ప్రయత్నం చేయాలి. ఆ డబ్బు ధర్మంగా సంపాదించాలి.

మమకారం లేకపోతే ధర్మంగా సంపాదిస్తారు, అదే మమకారం ఉంటే అధర్మంగా సంపాదిస్తారు. మమకారం ఉంటే వాడు ఎక్కువ, వీడు తక్కువ అనుకుంటారు. మమకారం లేకపోతే ఉన్నవాడు ఎక్కువా కాదు, లేనివాడు తక్కువా కాదు. వాడి అర్హతను బట్టి వాడు సంపాదించుకున్నాడు, నా అర్హతను బట్టి నేను ఇలా ఉన్నాను అని తృప్తిగా జీవిస్తాడు. మమకారం ఉన్నవాడికి ఎంత ఉన్నా తృప్తి ఉండదు.

పిల్లల మీద, భార్య మీదా, భర్త మీదా మమకారం ఉంటే జీవించే విధానం ఒక రకంగా ఉంటుంది, మమకారం లేకపోతే జీవించే విధానం ఒక రకంగా ఉంటుంది. మమకారం లేదనుకోండి వారి గురించి తప్పులు, పాపాలు చేయరు, ధర్మంగా జీవిస్తారు.

అందుచేత ఇవన్ని ఉండనివే, భ్రమే, భ్రాంతే అని తెలుసుకోవాలి. అది ఎప్పుడు తెలుస్తుంది? చనిపోయాక తెలుస్తుంది. అది ముందే తెలుసుకొని ఆ రకంగా జీవించాలి. ఇది సజ్జన సాంగత్యం వల్ల తెలుస్తుంది.

అందుచేత సంసార జీవితం తప్పని ఎవరూ అనరు. కానీ మీకున్న సమయం వృధా చేయకండి, వాక్కును వృధా చేయకండి, మీ ఇంద్రియ శక్తుల్ని వృధా చేయకండి, ఆత్మకి కేటాయించుకోండి. జీవితాన్ని అవసరాలకు ఉపయోగించుకుంటూ ఉన్న ఖాళీ సమయాన్ని దీనికి ఉపయోగించాలి. ఉద్యోగం చేయకుండా డబ్బు రాదు, డబ్బు రాకుండా భౌతికంగా నువ్వు జీవించలేవు. భౌతికంగా నువ్వు జీవించలేకపోతే ఆధ్యాత్మికంగా ఎక్కడ కృషి చేస్తావు? అందుచేత అదీ చేయాలి, ఇదీ చేయాలి.

అందుచేత దుర్జన సాంగత్యంలో మీరు వున్నట్లయితే జీవితం నాశనం అయిపోతుంది. అదే సజ్జన సాంగత్యం చేసి నీ స్వరూపాన్ని తెలుసు కుంటే జీవితం స్వర్గం అవుతుంది.

::8::

**“కొబ్బరి నీరు త్రాగాక కొబ్బరికాయను పట్టించుకోరు. అలాగే బ్రహ్మానందానుభూతి  పొందినవారు శరీర సుఖాలను పట్టించుకోరు”.**

మీరు ఒక రమణ మహర్షిని కానీ, షిరిడీ బాబాను కానీ, వివేకానందని కానీ, లేకపోతే ఆ అనుభూతి పొందినవారిని ఎవరినైనా చూసినట్లయితే వాళ్ళు శారీరక సుఖాలకి అసలు ప్రాముఖ్యం ఇవ్వలేదు.

ఎందుచేతనంటే! శారీరక సుఖాలు సుఖాన్ని మాత్రమే ఇస్తాయి, ఆనందాన్ని ఇవ్వలేవు. ఈ రెండిటికీ తేడా ఏమిటో తెలుసుకుందాం. సుఖం అన్నది తాత్కాలికం, ఆనందం అన్నది శాశ్వతం. సుఖం శరీరం వరకే, శరీరం ద్వారా మనసుకు తృప్తి కలిగించడం సుఖం. ఆనందం అన్నది ఆత్మకు సంబంధించింది, సుఖాన్ని వర్ణించొచ్చు, ఆనందాన్ని వర్ణించలేరు. అది అనుభూతి పొందవలసిందే.

ఈ సుఖం తాత్కాలికం కాబట్టి ఎన్ని సుఖాలు పొందినా ఇంకా సుఖపడాలనే అనుకుంటూ ఉంటారు. మీకు ఇష్టమైన ఒక స్వీట్ తిన్నారు, కాసేపు తృప్తి ఉంటుంది. మళ్ళీ సాయంత్రం అయ్యేసరికో, లేకపోతే మర్నాడో మళ్లీ తినాలని ఉంటుంది. ఏసీలో పడుకుని తృప్తి పడతారు, బయటికి వెళ్తే అక్కడ వేడిగా ఉంటుంది, మళ్ళీ వెళ్లి ఏసీలో ఉండాలనుకుంటారు.

ఇలా చూసుకుంటే ఎన్ని రకాల సుఖాలు అనుభవించినా ఇంకా ఇంకా కావాలి అనే ఉంటుంది కానీ ఇంక నాకు చాలు అనుకోరు. కానీ ఆ బ్రహ్మానందానుభూతి అంటే ఆ ఆత్మానుందానుభూతి అంటే ఆ ఆత్మ నుంచి పొందిన ఆ అనుభూతి పొందినవాడు అసలు ఈ ప్రపంచంలో ఇంకేమి వద్దంటాడు. దీని ముందు ఏం సరిపోతుంది అని వాటికీ అసలు ప్రాముఖ్యం ఇవ్వడు. ఎక్కడైనా ఉంటాడు, ఎక్కడైనా జీవిస్తాడు. ఎందుకంటే? వాటికి

మించినటువంటి ఆనందాన్ని వాడు పొందుతున్నాడు కాబట్టి.

అటువంటి ఆనందానుభూతి యొక్క రుచి తెలియక ఈ ప్రాపంచిక సుఖాల్లోనే ఏదో ఉందనుకుంటూ, అవే గొప్పవి అనుకుంటూ సామాన్యులు ఆ అనుభూతి పొందిన వారిని దేవుళ్ళు అని ఆరాధిస్తూ.. నేను ఇప్పుడు అనుభవిస్తున్నది సరిపోవట్లేదు, నాకు ఇంకా సుఖాలనివ్వు, నాకు ఇంకా సంపదలనివ్వు అనుభవిస్తాను అని వాళ్ళని పూజించడం, ప్రార్థించడం, ఆరాధించడం చేస్తున్నారు.

షిరిడీ బాబాని చూస్తే మీకు అర్థమవుతుంది. హారతులివ్వడం, మొక్కులు మొక్కడం. ఆయన అనుగ్రహం కలిగితే, ఆయన నుంచి కొద్దిగా శక్తిని పొందగలిగితే ఇంకా బాగా సుఖించొచ్చు, కోట్లు సంపాదించ వచ్చు, ఎన్నో సౌకర్యాలు అమర్చుకోవచ్చు అని భావిస్తూ ఉంటారు. మరి ఆయన వీడికి కొద్దిపాటి శక్తినిస్తేనే వాడు ప్యాలస్లు కట్టుకుని సుఖించేటట్టయితే! ఆయనకున్న శక్తితో ఎన్ని ప్యాలస్లు కట్టొచ్చు! ఎన్ని సౌకర్యాలు అమర్చుకోవచ్చు! ఎంత అనుభవించొచ్చు!

మరి ఆయన ఎందుకు మసీదులోనే ఉన్నాడు? నేల మీద ఎందుకు పడుకుంటున్నాడు? ఎందుకు ఏది ఉంటే అది తిని తృప్తి పడుతున్నాడు? ఆలోచించరు. నిజంగా ఆ ఆలోచన ఉన్నవాడైతే అరే ఆయన్ని ఇవన్నీ అడుగుతున్నామే మరి ఆయన ఎందుకు ఇవన్నీ సమకూర్చుకోలేదు అని ఆలోచిస్తారు. ఆ ఆలోచన చేస్తే ఆయన్ని పాలస్లు అడగరు, జ్ఞానం అడుగుతారు. ఆయనలా ఎదగడానికి ప్రయత్నిస్తారు. ఆయన ఏది పొందాడో అది పొందడానికి ప్రయత్నిస్తారు.

గొప్పవాళ్ళు పొందింది పొందడానికి ప్రయత్నించినవాడు అదృష్టవంతుడు. మీరు కోరుతున్నారు, కానీ మీకు కావాల్సింది అది కాదు. మీకు కావాల్సింది, వారు అనుభవిస్తున్నారు. ఏదైతే వాళ్ళు అనుభవిస్తున్నారో

అది మీకు కావాలి. మీరు కోరిన దాని వల్ల ప్రయోజనం లేదు. అది తాత్కాలికం. షిరిడీ బాబా జీవితం నుంచి నేర్చుకోవాల్సింది ఇదే. ఆత్మ సాక్షాత్కారానికి తొమ్మిది సూత్రాలు అని చెప్పాడాయన. ఆ బ్రహ్మానందానుభూతి, ఆత్మ సాక్షాత్కారం పొందిన వారికి కలుగుతుంది, అది మీరు కూడా పొందండి.

ఆ ఆనందం ముందు వీళ్ళు పొందే సంతోషం అల్పమైనది. దాని కోసం పాకులాడుతున్నారు! అనంతమైన దాని కోసం ప్రయత్నించట్లేదు. ఆయన అనుగ్రహం పొందడానికి ఎంతో కష్టపడుతున్నారు. కొండలెక్కుతున్నారు, కాలినడకలో తిరుగుతున్నారు, ఎన్నో సంవత్సరాలు దీక్షలు తీసుకుంటున్నారు, ఎన్నో నియమాలు పాటిస్తున్నారు.

కానీ ఇలా కష్టపడే బదులు వాళ్ళు చెప్పినట్టుగా మీరు కష్టపడితే వాళ్ళు పొందిన ఆ ఆనందాన్ని మీరు పొందుతారు. ఆ బ్రహ్మానందాన్ని పొందినవాడికి జన్మే ఉండదు. సుఖాలు పొందినవాడు ఎన్ని జన్మలు తీసుకున్నా ఆ సుఖాలు వాడికి తాత్కాలిక తృప్తినిస్తాయి కానీ శాశ్వతానందాన్ని ఇవ్వలేవు.

పత్రిగారు ఏమన్నారంటే ఎవరిని చూసినా నేను బిర్లా అవ్వాలి, రిలయన్స్ అంబానీ అవ్వాలి, ఆదానీ అవ్వాలనే ప్రయత్నిస్తున్నారు కానీ నేను ఒక వివేకానంద అవ్వాలి, ఒక రమణ మహర్షి అవ్వాలి, లేదా షిరిడీ బాబా అవ్వాలి అని ఎవ్వరూ ప్రయత్నించరు! చాలా ఆశ్చర్యంగా ఉంది అనేవారు. ఎందుకీ మాట అన్నారంటే? ప్రజలంతా సుఖాల కోసం పరిగెడుతున్నారు కానీ శాశ్వత ఆనందం కోసం ప్రయత్నించట్లేదు అని ఆయనకు తెలుసు కాబట్టి.

ఇప్పుడు భార్య ద్వారా, భర్త ద్వారా పొందిన సుఖాలు ఇంతకుముందు జన్మలలో నువ్వు పొందలేదని అనుకుంటున్నావా? పిల్లల ద్వారా పొందవలసిన సంతోషం ఇంతకు ముందు జన్మలో పొందలేదని అనుకుంటున్నావా? ఇంతకుముందు జన్మల్లో నువ్వు భోగం పొందలేదు అనుకుంటున్నావా? ఆ

సరదాలన్నీ తీరాయి. నాయనా, ఇంకా తృప్తి కలగలేదా? మూడు పూట్లా రకరకాల రుచులు చేసుకొని తింటున్నావే, మార్చి మార్చి తింటున్నావే ఇంకా తృప్తి కలగట్లేదా?

ఎన్నో రకాల భోగాలు అమర్చుకుని అనుభవిస్తున్నావు, ఏసీలు పెట్టుకుంటున్నావు, కార్లో తిరుగుతున్నావు. ఇంతకు ముందు తిరగలేదను కుంటున్నావా? ఏవైతే కావాలని ఈ జన్మలో నువ్వు ఆరాటపడుతున్నావో ఇంతకుముందు జన్మల్లో అవన్నీ అనుభవించావు నాయనా, ఇంకా తృప్తి తీరలేదా అన్నారు.

పత్రి గారు చెప్పేది ఏమిటి అంటే! ఇలాంటివి ఇంకొక 100 జన్మలు నువ్వు అనుభవించినా కూడా నీకు తృప్తి కలగదు. నీకు తృప్తి కలగాలి అంటే ఈ సుఖాలు, సంతోషాలు కాదు ఆ ఆనందానుభూతి, ఆ బ్రహ్మానందానుభూతి పొందు. దానికి మించింది సృష్టిలో ఇంకొకటి లేదు. అది సంపాదించుకుంటే ఇంక ఏదీ వద్దంటావు అన్నారు.

ఆ అనుభూతి పొందితే ఒక రమణ మహర్షిలా గోచీ పెట్టుకొని హాయిగా జీవిస్తావు. ఇంకా దేన్ని లెక్క చేయవు. క్యాన్సర్ వచ్చినా లెక్క చేయవు, నేల మీద పడుకున్నా లెక్కచేయవు. ఏది ఉంటే అది తింటావు, ఎక్కడుంటే అక్కడ పడుకుంటావు, ప్యాలెస్లు లేవు అనుకోవు, దేనిపట్లా వ్యామోహం ఉండదు.

రమణ మహర్షి ఆశ్రమానికి వందల మంది, వేల మంది వచ్చి వెళ్తూ ఉంటే చూసిన ఒక దొంగోడు అనుకున్నాడట! నేనెందుకు ఈ చిల్లర దొంగతనాలు చేయడం? ఇంతమంది వస్తున్నారు కాబట్టి వాళ్లు ఎన్నో బహుమానాలు, డబ్బు ఇస్తుంటారు. ఆయన దగ్గర చాలా డబ్బు ఉంటుంది. ఒక్కసారి ఆయన దగ్గర దోచుకుంటే ఇంక చిల్లర దొంగతనాలు చెయ్యక్కర్లేదు అనుకున్నాడట.

ఒక అర్ధరాత్రి జాగ్రత్తగా ఆయన ఆశ్రమంలో దూరాడు. ఆయనేమి

తాళాలు వేసుకోడు కాబట్టి చాలా సులువుగా లోపలికి వెళ్ళాడు. అందరూ పడుకుంటారు, రమణ మహర్షి కూడా పడుకుంటాడు అనుకున్నాడు. కాని ఆయన మేలుకొనే ఉన్నాడు, వీడిని చూడగానే ఆయన ఏమన్నారంటే!

ఏం నాయనా ఇలా వచ్చావు! ఆశ్రమంలో ఉన్న సంపదలన్నీ పట్టుకెళ్ళడానికా? నేనుంటే నువ్వు తీసుకెళ్ళడానికి మొహమాట పడతావేమో. ఒక పని చెయ్యి, నేను బయటికి వెళ్ళిపోతాను నువ్వు ఇంచక్క నీకేం కావాలో, ఎన్ని కావాలో అన్నీ మూటలు కట్టుకుని పట్టుకుపో, నువ్వు వెళ్ళాక నేను లోపలికి వస్తాను అన్నారట.

వాడికి మతి లేదు. ఆయన కాళ్ళ మీద పడిపోయాడు. ఆయన దగ్గర  పట్టుకెళ్ళడానికి ఏముంటాయండి? ఇల్లంతా తిరిగితే మహా అయితే ఒక గోచి దొరుకుతుంది. న్యాయంగా రెండు గోచీలు దొరకాలి కానీ వాడికి ఒక గోచీయే దొరుకుతుంది. ఎందుకంటే? ఒకటి ఆయన కట్టుకుని ఉంటాడు కాబట్టి అది పట్టుకెళ్ళలేడు. అదే ఆయన దగ్గర ఉంది.

మరి ఎంత గొప్పవాడండి ఆయన. ఇంత మంది వస్తున్నా వాళ్ళ దగ్గర ఏమీ ఆశించట్లేదు. ఇస్తూ ఉంటారు కానీ ఇలా ఇచ్చినవి అలా పంచి పెట్టేస్తూ ఉంటారు, పత్రిగారి దగ్గర కూడా అదే చూశాను. ఆయన కూడా ఉంటే అనుభవిస్తాడు, లేకపోతే ఎక్కడ ఉంటే అక్కడ, ఎలా ఉంటే అలా, ఏది ఉంటే దానితో తృప్తి పడిపోతాడు. కావాలి అనేమి ఉండదు. మనం ఆ స్థితికి ఎదగాలి.

ఉంటే అనుభవించండి, లేకపోతే లేదని ఏడవకండి. పత్రి గారు మనకి నేర్పింది అదే. చాలా గొప్ప గొప్ప విషయాలు నేర్పారు. మధ్యే మార్గం అన్నారు, సంసారంలో నిర్వాణం అన్నారు, ఉన్న దానితో తృప్తి పడమన్నారు, ఎదుటి వాళ్ళతో నీకు పోలిక అనవసరం అన్నారు, ఇలా ఎన్నో విషయాలు మనకు బోధించారు.

అందుచేత ఈ సందేశం ద్వారా మనం గ్రహించవలసింది ఏమిటంటే గొప్పవాళ్ళు, బ్రహ్మానుభూతి పొందినవారు శరీర సుఖాలను పట్టించుకోరు. మరి చివటం అమ్మవారిని అందరూ పిచ్చిది అనుకునేవారు. ఆవిడికి పిచ్చి కాదు, వీళ్ళకి పిచ్చి. ఇవన్నీ నాకెందుకు అని చెప్పి అన్నిటిని జయించింది. ఆవిడ ఒక అవధూత. ఆ ఆనందానుభూతి అనుభవిస్తూ అలాగే కళ్ళు మూసుకుని కూర్చుంది. అటువంటి వాళ్ళ మాటలూ, చేతలూ ఎవరికీ అర్థం కావు.

కొబ్బరి నీరు త్రాగేసాక పడేయడం ఎందుకు అని బీరువాలో పెడతావా? నువ్వే కొనుక్కున్నావు, సరే తాగావు, దాన్ని బీరువాలో లాకర్లో పెట్టుకోవచ్చుగా? పెడతావా? పెట్టవు. ఎందుకు పెట్టవు? దాని వల్ల ఉపయోగం లేదు కాబట్టి, దాని పని అయిపోయింది కాబట్టి రోడ్డు మీద పడేస్తావు.

అలాగే ఆనందాన్ని పొందావు. ఇంక ఈ ప్రాపంచిక సుఖాలతో, భోగాలతో పనేంటి? అందుకే ఆ బ్రహ్మానుభూతి పొందినవారు, ఆత్మ సాక్షాత్కారం పొందినవారు, ఎన్లైటన్మెంట్ పొందిన వారు, నిర్వాణం పొందిన వారు ప్రాపంచిక సుఖాలను తృణప్రాయంగా చూస్తారు.

అందుకే షిరిడీ బాబా అన్నాడు. ఒకవేళ నువ్వు గత జన్మలో చేసుకున్న పుణ్యాన్ని బట్టి ఇప్పుడు ఇవ్వబడినా.. ఆ సంపదలను త్యాగ బుద్ధితో అనుభవించు అన్నాడు. త్యాగ బుద్ధితో అనుభవించడం అంటే నీ అవసరాలకు ఉపయోగించు కుంటూ మిగిలింది లోక కళ్యాణం కోసం ఉపయోగించమన్నారు.

అదే లేకపోతే, ఉన్నదానితో తృప్తి పడు, లేని దానికి ఆశించకు, ఎవడికో ఉందని అసూయ పడకు. అక్రమంగా, అన్యాయంగా, అధర్మంగా సంపాదించకు, ఎవరిదీ దొంగలించకు. అది నీది కాదు. అదంతా సృష్టికర్తదే, ఆ భగవంతునిదే, సమస్త సంపదలు ఆ పరమేశ్వరునివే! అని షిరిడి బాబా చెప్పారు.

కనుక ఏదీ వదలవద్దు, మమకారం వదలండి. ఇప్పుడు ఉన్నవి ఏవీ శాశ్వతం కాదు. భార్య, భర్త పిల్లలు, ధనం, సంపదలు ఏదీ శాశ్వతం కాదు. నీకు కావలసిన బ్రహ్మజ్ఞానం, ఆత్మ సాక్షాత్కారం పొందడం కోసం తాత్కాలికంగా ఉపయోగించు కోవడానికి ఇవ్వబడినటువంటివే అవన్నీ. అది అర్థం చేసుకుని వాటిని ఉపయోగించుకుంటూ దేన్ని వృధా చేయకుండా మీరు ప్రయత్నించి నట్లయితే, అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారు.

జీవితమన్నాక కష్టాలు ఉంటాయి, సమస్యలు ఉంటాయి, బాధలు ఉంటాయి. ఎన్నో చేశాం కాబట్టి ఉంటాయి, కానీ ఈ ప్రయత్నం మీరు చేసినట్లయితే, ఎన్ని ఉండనివ్వండి, కొన్నాళ్ళకి పోతాయి. మీరు ఇది మానకుండా చేసినట్లయితే, మరు జన్మ చాలా అనుకూలమైన జన్మ పొందుతారు, ఇదే ఆఖరి జన్మ చేసుకుంటారు.


## తటవర్తి దంపతుల Zoom కార్యక్రమాలు చూడాలంటే?

a) ప్రతిరోజూ ఉదయం Zoom లో 4 to 6.30 a.m. Silence Meditation మరియు 6.30 to 7.30 a.m. వరకు **ఆత్మజ్ఞాన సందేశాలు**

Zoom I.D. :2413823868, Password : RAO

b) పై కార్యక్రమము 6.30 to 7.30 a.m. వరకు Youtubeలో కూడా Live ఇవ్వబడుతుంది.

c) ఎవరైతే TVR & TRL Whatsapp గ్రూపులో వుంటారో వారికి Zoom Link & You Tube Links మరియు తటవర్తి దంపతుల క్లాసుల వివరాలు పంపడం జరుగుతుంది. వారు **సింధూర: 8555995217** నెంబరు తప్పనిసరిగా save చేసుకోవాలి.

d) తటవర్తి వారి వాట్సాప్ గ్రూపులో జాయిన్ కావాలనుకునేవారు వీరిని సంప్రదించండి. సింధూర: 85559 95217, మధు: 78939 17364 లేకపోతే www.tst.org.in Open చేసిన తర్వాత Join in Whatsapp group లింక్ మీద నొక్కండి.

## ::9::

## “చీకట్లోనే నక్షత్రాలు కనబడతాయి, కష్టాల్లోనే సత్యం తెలుస్తుంది”

పగలు నక్షత్రాలు కనపడవు కానీ చీకటి పడితే నక్షత్రాలన్నీ మిలమిలా మెరుస్తూ ఉంటాయి. అలాగే కష్టాల్లోనే సత్యం తెలుస్తుంది.

ఇప్పుడు మనమంతా కూడా సత్యాన్ని అనుభవంలోకి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాం, అంటే సత్యాన్ని పూర్తిగా తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నాము. అదే మన జీవిత లక్ష్యం. ఎందుచేతనంటే ఎవ్వరైనా సరే సత్యలోకం చేరు కోవాల్సిందే, సత్యలోకం చేరుకోవాలి అంటే సత్యం అనుభవంలోకి రావాలి.

సత్యం అంటే ఆత్మ అని చెప్తారు. అంతమాత్రాన మీకు సత్యలోక అర్హత వచ్చినట్టు కాదు, మీరు సత్యలోక వాసులు అయిపోరు. దానికి సత్యం అనుభవంలోకి రావాలి అంటే నేను ఆత్మ అన్నట్టుగా మీరు జీవించగలగాలి. అంటే మీరు చేసే ప్రతి పని దేహం అన్నట్టుగా చేయడం కాదు, ఆత్మ అన్నట్టుగా చేయాలి. అప్పుడు మీకు సత్యం అనుభవంలోకి వచ్చినట్టు.

ఎందుకంటే సంసార జీవితంలో ఉన్నారు, బాంధవ్యాలు ఉన్నాయి, మాయా ప్రపంచంలో ఉన్నారు, వీటన్నిటిని అధిగమించాలి. అంటే ఈ సంసారం మీదా, ధనం మీదా, ప్రాపంచిక సుఖాల మీదా, భోగాల మీదా వ్యామోహం ఉండకూడదు, ఎవరి మీదా మమకారాలు ఉండకూడదు.

ఎంతసేపు ఆత్మకి ప్రాముఖ్యం ఇవ్వాలి. కనుక మీరు ఏ పని చేస్తున్నా ఇది దేహానికి లాభమా? ఆత్మకి లాభమా? అని ప్రశ్నించుకోండి. దేహానికి లాభం అయితే తక్కువ ప్రాముఖ్యం ఇవ్వండి, ఆత్మకు లాభం అయితే ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వండి. అలా ఇచ్చిన రోజున మీరు ఆత్మకు దగ్గరౌతున్నట్లు లెక్క. దీని కోసం నేను ఏ స్థితిలో ఉన్నాను? ఎంత ఎదిగాను? అన్నది ఎవరినో అడగాల్సిన పనిలేదు, మీకు మీకే అర్థమవుతూ ఉంటుంది.

ఏ చిన్న ఆటంకం వచ్చినా, చిన్న అవసరం వచ్చినా, మీ ప్రయత్నం

మానేస్తారు. మా అబ్బాయికి పరీక్షలండి అని భీమవరం మూడు రోజుల క్లాసుకు ఎగ్గొట్టే వాళ్ళు కూడా చాలా మంది ఉన్నారు. మా అమ్మాయికి సంబంధాలు చూస్తున్నామండి అని ఏడాది నుంచి భీమవరం ఎగొట్టేసిన వాళ్ళూ ఉన్నారు. వీళ్ళకి సత్యం ఎప్పటికి తెలుస్తుందో? ఎన్ని జన్మలు పడుతుందో? దాని యొక్క ప్రమాదం వాళ్ళకి తెలియదు. ఆ సత్యం అనుభవంలోకి వస్తేనే సత్యలోకానికి చేరుకోగలుగుతారు అన్న అవగాహన ఉండదు.

ఇలాగే జన్మలు తీసుకుంటూ, బాధలు పడుతూ, నా బ్రతుకిలా అయిపోయింది, వాళ్ళ వల్లే నాకు ఈ కష్టాలు, వీళ్ళ వల్లే నాకు ఈ సమస్య అంటూ ఏడుస్తూ కూర్చుంటారు తప్ప ఇటువంటి ఏడుపులో నుంచి బయట పడాలి అంటే సత్యం అనుభవంలో తెచ్చుకోవాలి అని ఆలోచించరు.

ప్రాపంచిక విషయాలకి ప్రాముఖ్యం ఇస్తూ, ఆధ్యాత్మికంగా ఎదగాలంటే ఎలా ఎదుగుతారు? భీమవరం మూడు రోజుల క్లాసు సమయం లోనే ఏదో ఒక ఫంక్షన్, లేకపోతే ఏదో ఒక చిన్న పనో వస్తుంది. దగ్గర వాళ్ళే పిలుస్తారు, వాళ్ళు బాధపడతారని చెప్పి ఈనెల కాకపోతే వచ్చే నెల వెళ్దాంలే అని భీమవరం ఎగ్గొడతారు.

కానీ ఆత్మానుభవం మీద ఆసక్తి ఉంటే వారికి ముందు చెప్పచ్చు, లేదా ముందురోజు వెళ్లి కనబడి రావడమో, లేకపోతే తర్వాత వస్తాననో చెప్పొచ్చు. కానీ చెప్పకపోతే సత్యానికి ఎలా దగ్గర అవుతారు? సత్యంలో ఎలా జీవిస్తారు? సత్యంలో జీవిస్తున్నట్టు ఎలా అవుతుంది? ఆలోచించండి!

"చీకట్లోనే నక్షత్రాలు కనిపిస్తాయి. కష్టాల్లోనే సత్యం అనుభవంలోకి వస్తుంది" అన్నారు.

మీరు చూడండి ఒక కష్టం వచ్చింది దాన్ని తట్టుకోలేకపోతున్నారు, భరించలేకపోతున్నారు. మరి అలా జరిగినప్పుడు గుడికి వెళ్ళడం, స్వామీజీలని పట్టుకోవడం కాదు మీరు చేయవలసింది. అక్కడా, ఇక్కడా మొక్కడం మసీదుకి

వెళ్ళి, చర్చికి వెళ్ళి ప్రార్థించడం కాదు, నాకు అసలు ఈ కష్టం ఎందుకు వచ్చింది? అని ప్రశ్నించుకోవాలి. అప్పుడు మీకు ఖచ్చితంగా అర్థమవుతుంది.

ఇప్పుడు ఏ కష్టాన్ని నేను భరిస్తున్నానో, అలాంటి కష్టం గతంలో కానీ, గత జన్మల్లో కానీ ఇతర జీవులకు కానీ, ఇతరులకు కానీ కలిగించి ఉంటాను. అందుకే దాని ఫలితంగా నాకు ఈ కష్టం వచ్చింది అన్నది అర్థమవుతుంది.. అలా అర్థమైనప్పుడు ఇంక నేను అలా ఎవ్వరిని కష్టపెట్టను అని తీవ్రంగా నిర్ణయించుకోవాలి. ఇంక ఆరు నూరైనా, నూరు ఆరైనా అలాంటి తప్పు చేయకూడదు. అంటే దాని అర్థం ఆ తప్పును మీరు సరిచేసుకున్నారు. ఎప్పుడైతే అలా ఒక తప్పును సరి చేసుకుంటారో ఆధ్యాత్మికంగా అంటే ఆత్మ పరంగా మీరు కొంచెం ఎదిగినట్టు.

అందుకే ముందు కర్మ సిద్ధాంతం గురించి అర్థం చేసుకోవాలి. అప్పుడు మీకు ప్రతీదీ బాగా అర్థమవుతుంది, ఏ కష్టం వచ్చినా గతంలో నేను చేసిన కర్మే కారణం అని అర్థమవుతుంది. అప్పుడు అలాంటి తప్పు చేయరు. అలాగే ఆర్థిక ఇబ్బందులు వస్తాయి, అలా వచ్చినప్పుడు వెంటనే నేను ఎవరినో మోసగించాను, ఎవరికో అన్యాయం చేశాను, ఎవరిదో అపహరించాను, అందుకే నాకు ఈ పరిస్థితి వచ్చింది అని అర్థం చేసుకొని, ఇంకెప్పుడూ నేను ఎవ్వరినీ మోసగించను, ఎవ్వరిదీ అపహరించను, అసలు ఎవ్వరిదీ ఆశించను అని మీరు నిర్ణయించుకున్నప్పుడు మీరు ఆ తప్పు కూడా సరి చేసుకున్నట్లే. అంటే మీరు ఇంకొంచెం ఎదిగినట్టు లెక్క.

అలా ఒక్కొక్క తప్పు మీరు సరి చేసుకుంటే ఆత్మ పరంగా ఎదుగుతూ వుంటారు. అంటే ఆ తప్పు ఎలా సరి చేసుకున్నారు? కష్టం రావడం వల్ల, అంటే కష్టంలోనే ఎదుగుతున్నారు కదా? ఆత్మ ఎదిగింది కదా? అందుకే పత్రి గారు కష్టాలు, నష్టాలు, అవమానాలు ఆత్మ పురోగతికి సోపానాలు అన్నారు

కానీ అందరు చిన్న కష్టం వస్తే దేవుడు నన్ను కష్టాలు పెట్టేస్తున్నాడు, ఆయనికి నాపై దయలేదు అని దేవుడ్ని నిందిస్తారు. వాళ్ళు చేసే తప్పుడు పనులు గుర్తుండవు. వారు కోళ్ళు, మేకలు కోసుకు తినేస్తారు, వాటిపై దయ చూపించరు కానీ భగవంతుడు వీళ్ళపై దయ చూపించాలి అంటారు, ఎలా చూపిస్తాడు?

ఇప్పుడు నిజానికి కష్టం వచ్చినప్పుడు అలాంటి పని నేను చేయ కూడదు అని నిర్ణయించుకుంటారు. కానీ నేనేం చెప్తున్నానంటే? కష్టం వచ్చినప్పుడు ఆ పని చేయకూడదు అని నిర్ణయించుకోవడం కాదు, ఆ పని చేసే ముందే ఆ పని చెయ్యడం వల్ల వచ్చే ఫలితం ఏమిటి అన్నది మీకు గుర్తుకు రావాలి. ఆ స్థాయికి మీరు ఎదిగితే మీరు చాలా గొప్పవాళ్లే! ఈ జన్మలో మీరు ఇంక ఏ తప్పూ చేయరు.

చూడండి సాధారణంగా భర్తలకి భార్య లోకువ. ఏదో కొద్దిమంది భార్యలకి భర్త కూడా లోకువే. వాళ్ళూ ఉంటారు, వీళ్ళూ ఉంటారు. లోకువ అని చెప్పి ఏదో మాటలు అనడం, వేళాకోళంగా వాళ్ళని కొంచెం బాధించడం, మరి వాళ్ళు బాధపడుతుంటే పైశాచిక ఆనందం పొందడం చేస్తూ ఉంటారు. కానీ అలాంటి పనులు చేసేటప్పుడు వీళ్ళు ముందే గుర్తుకు తెచ్చుకుని, ఇప్పుడు నేను ఈ పని చేస్తే రేపు మళ్లీ అదే ఫలితం నేను అనుభవించాల్సి వస్తుంది, ఎందుకు వచ్చిన గొడవ అని వారు ఆ పని చేయపోతే ఇంక వారికి ఆ కష్టం రాదు.

అందుచేత మీరు తప్పు చేసే ముందే అది మీరు గ్రహించగలగాలి, అప్పుడు మీ తప్పులు బాగా తగ్గిపోతాయి. అప్పుడు ఆత్మకు బాగా దగ్గర అవుతారు, లక్ష్యానికి దగ్గర అవుతారు, మీ జన్మలు బాగా తగ్గిపోయి. ఆ స్థితికి మీరు వస్తే చివరి జన్మలలోకి వచ్చినట్టు లెక్క.

ఇక్కడ తప్పు చేయించేది మనసు, మనసుని బట్టే ఆ పని చేస్తారు.

మనసు ఆ పని చేయిస్తున్నప్పుడు ముందే మనసు చేసే ఆ పని తెలుసుకో గలగాలి. మరి అది ఎలా తెలుస్తుంది అంటే? మీలో ఎరుక ఉంటే తెలుస్తుంది. అప్పుడు ముందే తెలుసుకుంటారు. ఎరుక అంటే "గమనించే దాన్ని గమనించడం". గమనించేదాన్ని గమనించగలిగేదే ఎరుక అదే ఆత్మ.

ఆ ఎరుక ఉన్నవాళ్ళకి తప్పు చేసేముందే స్పష్టంగా తెలుస్తుంది. ఈ పని నేను చేస్తే తర్వాత మళ్ళీ కష్టాలు పడవలసి వస్తుంది. ఎందుకు వచ్చిన గొడవ అని ఆ తప్పు చేయరు. అంటే ఆ హెచ్చరికలు మీరుతెలుసుకో గలుగుతారు, ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు, ఆది ఎవరికి వాళ్ళకే తెలుస్తుంది. ఆ ఎరుక ఎవరికీ బాగా ఉంటుంది అంటే? తీవ్ర ధ్యాన సాధన చేసిన వాళ్ళకి, సాత్వికమైన శాకాహారం తీసుకునే వాళ్ళకి ఉంటుంది.

అందుకే నేను ప్రతినెల భీమవరం రమ్మంటాను. మీరు భీమవరం రాకుండా ఏదో జూమ్లో క్లాస్ విన్నంత మాత్రాన ఎరుక ఉండదు, మీరు తప్పులు చేసేస్తూనే ఉంటారు, తర్వాత దాని ఫలితం అనుభవిస్తారు. ఆ కష్టాలు వచ్చినప్పుడు ఇంకా వస్తున్నాయేంటి? అని అనుకుంటారు. అందుచేత తెలుసుకోండి ఎంత తీవ్రంగా "శ్వాస మీద ధ్యాస" ఉంచి ధ్యానం చేస్తారో! మీలో ఎరుక అంత బాగా పెరుగుతుంది.

ఎరుక యొక్క గొప్పతనం ఏమిటంటే! తప్పు చేసినప్పుడే తెలియ పరుస్తూ ఉంటుంది, హెచ్చరిస్తూ ఉంటుంది. ఎరుక అంటే ఏదో కాదు ఆత్మే అంటే భగవంతుడు. మీ ధర్మాన్ని ఎప్పటికప్పుడు తెలియపరాస్తాడు. ఈ స్థాయికి మీరు ఎదగగలిగితే మీరు చాలా గొప్పవాళ్ళు అయినట్టే లెక్క. మీరు ఈ ఎరుక గురించి ఎంత అవగాహన చేసుకుంటే మీరు సాధన అంత బాగా చేస్తారు.

ఒక పెళ్లికి వెళ్ళాలని మీకు అనిపించినప్పుడు, పెళ్లికి వెళ్ళి నేనేం సంపాదిస్తాను? భీమవరం వెళ్ళి ధ్యానం చేస్తే నాకు అంటే ఆత్మకు లాభం

కదా? నేను ఆత్మ కదా? అనేటటువంటి స్పృహ  వచ్చినప్పుడు పెళ్ళి మానేసి భీమవరం వస్తే నీ ఎరుక బాగా పనిచేస్తున్నట్టు లెక్క.

అలాగే ఖాళీ దొరికితే కొంతమంది సెల్ చూస్తూ కూర్చుండిపోతారు, అప్పుడు కూడా నేను సమయాన్ని వృధా చేస్తున్నాను అని ఎరుక రావాలి.

అలాగే చాలామంది ఫోన్లలో ఊరికే అక్కర్లేని మాటలు మాట్లాడతారు. గంటలు గంటలు సమయాన్ని వృధా చేస్తారు, అలా చేస్తుంటే వెంటనే మీకు ఈ మాటలు మాట్లాడే బదులు మంచి వీడియో ఒకటి వినొచ్చు కదా? లేదా పుస్తకం చదవుకోవచ్చు కదా? అని అనిపిస్తే మీకు ఎరుక బాగా ఉన్నట్టు.

అలాగే మీ డబ్బు ఖర్చు పెట్టేటప్పుడు పనికి రాని వాటికి ఖర్చు పెడుతూ ఉంటే దీనికి ఎందుకు ఖర్చు పెడతావు? ఆత్మకు లాభించే జ్ఞానాన్ని పెంచుకునే వాటికి ఖర్చు పెట్టొచ్చుగా అనే ఎరుక రావాలి. కొంతమంది డబ్బులు కర్చు అవుతాయని కూడా భీమవరం ఎగ్గొడతారు, బయట మాత్రం బాగా ఖర్చు పెడతారు. అలా వృధాగా ఖర్చుపెట్టేవి ఆదా చేసుకొని ఆత్మ లాభానికి ఖర్చు పెట్టండి, అటువంటి సేవల్లో మీరు పాల్గొనండి. అలాంటి పుస్తకాలు కొనండి, పుస్తకాలు అందరికీ ఇవ్వండి. ఎవరికి ఏ పుస్తకం ఇస్తే బాగుంటుందో అలాంటి పుస్తకాలు తీసుకు వెళ్లి ఇవ్వండి, ధనాన్ని ఆత్మ లాభానికి కర్చుపెట్టండి, ధనాన్ని సద్వినియోగం చేయండి.

అలాగే ఎన్నో సందర్భాల్లో ఆత్మకు నష్టం కలిగే పనులు చేస్తున్నప్పుడు ఆత్మ హెచ్చరిస్తూ ఉంటుంది. కానీ ఇంకా తెలియట్లేదు అంటే మనసు మరీ మలినంగా ఉంది అని అర్థం. తప్పు చేయకముందే దాని ఫలితం మళ్లీ నేను అనుభవించాల్సి వస్తుంది అన్నది తెలుసుకుని అది చేయకుండా ఉండగలిగితే అప్పుడు మీరు బాగా ఎదిగిన వారి క్రింద లెక్క. అందుచేత గుర్తుపెట్టుకోండి.

"చీకట్లోనే నక్షత్రాలు ఎలా కనబడతాయో, కష్టాల్లోనే సత్యం తెలుస్తుంది"

అందుచేత కష్టాలు మనకు మంచివే కానీ చెడ్డవి కాదు. అందుకే కష్టాలకు ఎప్పుడూ బాధపడకండి. కష్టం వచ్చినప్పుడు దీని నుంచి నేను ఏమి నేర్చుకోవాలి? ఈ కష్టం నాకు నేర్పే పాఠం ఏమిటి? అని విచారణ చేసుకోండి. ఒక కష్టం వచ్చిందంటే నేనేదో తప్పు చేయడం వల్లే వచ్చింది అని ఇంక అటువంటి తప్పు నేను చేయకూడదు అని నిర్ణయించుకోండి.

## తటవర్తి దంపతుల Website ద్వారా పొందే సమాచారము

website address : www.tst.org.in

a) తటవర్తి దంపతుల ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల వివరములు మరియు Google Maps Location తెలుసుకోవచ్చు.

b) తటవర్తి దంపతుల మొత్తం పుస్తకాలు PDF రూపంలో కలవు. వాటిని ఉచితంగా Download చేసుకోవచ్చు. ఈ పుస్తకాలు తెలుగు, కన్నడ, హిందీ మరియు ఇంగ్లీషు భాషలలో వున్నాయి.

c) తటవర్తి దంపతుల సందేశాలు Concept వారీగా YouTube Play lists రూపంలో ఇవ్వడం జరిగింది.

d) తటవర్తి దంపతుల సందేశాల సారాంశము కొటేషన్స్ రూపంలో ఇవ్వడం జరిగింది.

e) తటవర్తి దంపతుల ఫోటోలు కూడా చూడవచ్చు.

5. భీమవరంలో ప్రతి నెలా 1, 2, 3 తేదీలలో జరిగే ఉచిత ధ్యాన యజ్ఞంలో రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబరు : **సింధూర, 8555995217**

## ::10::

**"ఊగే చెట్లను ఊపే గాలులు మనకు కనబడవు, అలాగే అజ్ఞానికి కర్మ ఫలితాలు తెలియవు"**

ఊగే చెట్లను ఊపే గాలులు మనకు కనపడవు అన్నారు, అంటే మనం గమనిస్తే చెట్లు ఊగుతూ ఉంటాయి. దేని వల్ల ఊగుతాయి అంటే? గాలి వల్ల ఊగుతూ ఉంటాయి, గాలి లేకపోతే చెట్లూ కదలవు, కొమ్మలూ కదలవు, ఆకులూ కదలవు, ఏదీ కదలదు. గాలికి అవి కదులుతూ ఉంటే కనిపిస్తుంది, కానీ వాటిని కదిపే గాలి మట్టుకు మనకి కనిపించదు.

"అలాగే అజ్ఞానికి కర్మ ఫలితాలు తెలియవు". దానికి ముఖ్య కారణం ఏమిటంటే? జ్ఞాని అంటే సృష్టిలో కంటికి కనిపించని వాటి గురించి తెలుసుకో గలిగిన వాడు. కంటికి కనిపించని ఆత్మ గురించి తెలుసుకున్న వాడు, పైన ఉన్నటువంటి లోకాల గురించి తెలుసుకున్నవాడు, అలాగే సృష్టిలో జరిగే చాలా విషయాలు తెలుసుకున్నవాడు.

మానవుడు చేసే ప్రతి కర్మ ఈ ఆకాశిక్ రికార్డ్స్ లో రికార్డు అవుతాయి అనే విషయం కూడా తెలుసుకుంటాడు. సృష్టిలో ఉన్నటువంటి సిద్ధాంతాలు అంటే ఆత్మ సిద్ధాంతం, పునర్జన్మ సిద్ధాంతం, కర్మ సిద్ధాంతం పూరోగమన సిద్ధాంతం లాంటి సిద్ధాంతాలన్నీ తెలుసుకున్నవాడు, వాటి పర్యవసానం కూడా తెలుసుకున్నవాడు.

ఇలా జ్ఞాని ఈ కంటికి కనిపించేవే కాకుండా కనిపించనివి కూడా తెలుసుకుంటాడు కాబట్టి తప్పులు చేయడు, పాపాలు చేయడు, అధర్మంగా వ్యవహరించడు, సృష్టి విరుద్ధంగా ప్రవర్తించడు. అందుచేత జ్ఞానికి కష్టాలు రావు.

కానీ అజ్ఞానికి ఈ కంటికి కనిపించనివి తెలియవు. వాడికి నేను ఆత్మ అన్న సంగతి తెలీదు, కనిపించే దేహమే నేను అనుకుంటాడు. వాడికి

సృష్టిలో ఉన్నటువంటి సిద్ధాంతాలు, ధర్మాలు ఇవేమి తెలియవు. వాడు వాటిని పట్టించుకోడు. ఎంతసేపు సంపాదించడం, అనుభవించడం మీదే దృష్టి పెడతాడు

ఈ సిద్ధాంతాలు, ధర్మాల గురించి తెలియకపోవడం వల్ల, వాటి ఫలితం ఏమిటో అర్థం కాక తనకి నచ్చినట్టు జీవిస్తూ ఉంటాడు, అధర్మంగా సంపాదిస్తాడు, ఎంజాయ్ చేస్తాడు, అదే జీవితం అనుకుంటాడు. అందుచేత అజ్ఞానికి కష్టాలు వస్తూ ఉంటాయి.

ఇక్కడ ఊగే చెట్లను ఊపే ఆ గాలి మనకి ఎలా కనిపించదో! అలాగే అజ్ఞానికి తాను చేసే కర్మల యొక్క ఫలితం తెలియదు. పాపం చేసేస్తాడు, కష్టం వస్తే దానికి కారణం వేరే ఏదో అనుకుంటాడు. ఇది తాను చేసిన కర్మ ఫలితమే అని అనుకోడు, దానికి వేరెవరో కారణం అనుకుంటాడు, అది అజ్ఞాని పరిస్థితి. అజ్ఞానికి కర్మ ఫలితాలే కాదు ఇంకా చాలా విషయాలు తెలియవు.

నేను ఆత్మ అన్న సంగతి కూడా తెలీదు. అది తెలియక దేహమే నేను అనుకుంటాడు, దేహ సుఖం కోసం, దేహ ఆనందం కోసం చేయకూడని పనులు ఎన్నో చేస్తాడు, కష్టాలు తెచ్చుకుంటాడు. నేను ఆత్మ  అన్న సంగతి తెలియకపోవడం వల్ల అంతా వేరు వేరు అనుకుంటాడు, ఇతరులను ద్వేషిస్తాడు, మోసగిస్తాడు, తానే గొప్పగా ఉండాలనుకుంటాడు. చివరికి ఇవన్నీ దుఃఖాన్ని కలిగిస్తూ ఉంటాయి.

అంతేకాదు అజ్ఞానికి పునర్జన్మ సిద్ధాంతం కూడా తెలియదు. మానవుడు మళ్ళీ ఇంకొక జన్మ తీసుకుంటాడు అన్నది తెలియదు, చచ్చిపోతే జీవితం ఆఖరు అనుకుంటాడు. అందుకే కష్టాలు వస్తే తప్పించుకోవాలని, బయట పడాలని  ఆత్మహత్య చేసుకుంటాడు. ఆ చెట్లను ఊపే గాలి మనకి ఎలా కనబడదో అలాగే అజ్ఞానికి ఇవన్నీ తెలియవు.

కానీ జ్ఞానికి ఇవన్నీ తెలుసు అందుకే ఎన్ని కష్టాలు వచ్చినా

ఓర్చుకుంటాడు కానీ ఆత్మహత్య చేసుకోడు. తాను చేసిన పాపాల వల్లే ఈ కష్టాలు వచ్చాయి కొన్నాళ్ళు ఓర్చుకుంటే ఆ కర్మ యొక్క ప్రభావం పోతుంది. అని ఓపిక పడతాడు ఆ కష్టం నుంచి బయట పడతాడు.

అజ్ఞానులు స్త్రీ అయినందుకు బాధపడతారు, పురుషుడు అయినందుకు గర్వపడతారు. కానీ జ్ఞాని స్త్రీ అయినందుకు బాధపడడు, పురుషుడుగా ఉన్నందుకు గర్వించడు. ఇదంతా తాత్కాలికం, మళ్ళీ కొన్నాళ్ళు పోయాక ఈ శరీరాన్ని వదిలేయాలి. ఇప్పుడు పురుషుడైనా మరల స్త్రీగా పుట్టవలసి వస్తుంది, ఇప్పుడు స్త్రీ అయినా మరల పురుషుడిగా పుట్టవలసి వస్తుంది. ఇదేమీ శాశ్వతం కాదు అని జ్ఞాని తెలుసుకుంటాడు, అందుచేత దేనికీ దుఃఖపడడు, దేనికీ గర్వించడు మామూలుగానే జీవిస్తాడు.

స్త్రీగా సాధించవలసింది ఏమిటో తెలుసుకుని వాటిని సాధించడానికి ప్రయత్నిస్తారు. పురుషుడిగా ఏమేమి పాఠాలు నేర్చుకోవాలో అవి తెలుసుకుని అవి నేర్చుకునే ప్రయత్నం చేస్తారు.

పత్రి గారు జ్ఞాని లక్షణాలు ఎలా ఉంటాయి? అజ్ఞాని లక్షణాలు ఎలా ఉంటాయి? అన్నది చెప్పారు. ఆయనేమి చెప్పారంటే?

"జ్ఞాని దుఃఖంలో కూడా ఆనందంగా ఉంటాడు" అంటే కష్ట సమయాల్లో కూడా ఆనందంగా ఉంటాడు. కానీ "అజ్ఞాని ఆనందంగా ఉండవలసిన సమయంలో కూడా దుఃఖపడుతూ ఉంటాడు" అని చెప్పారు.

దీనికి ముఖ్య కారణం ఏమిటంటే? జ్ఞానికి అపారమైన శక్తి ఉంటుంది, కానీ అజ్ఞానికి అంత శక్తి ఉండదు. మరి ఎందుకు జ్ఞానికి ఎక్కువ శక్తి ఉంటుంది? అజ్ఞానికి తక్కువ శక్తి ఉంటుంది? తెలుసుకోవాలి.

మీరు చూడండి ఎవరైతే తమో గుణంలో, రజో గుణంలో ఉంటారో వాళ్ళ అజ్ఞానంలో ఉన్నట్టే, వాళ్ళకి శక్తి బాగా తక్కువ ఉంటుంది. అదే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం చేస్తూ, ఆలోచనా రహిత స్థితికి చేరుకుంటే శక్తి పెరుగుతుంది. అలా నెలలు తరబడి, సంవత్సరాలు తరబడి వారు ధ్యానం

చేసినప్పుడు శక్తి అపారంగా పెరుగుతూ ఉంటుంది.

అలా శక్తి పెరిగే కొద్ది వారిలో ఎన్నో మార్పులు జరుగుతాయి. మనసు శుద్ధి అవుతుంది, గుణం మారుతుంది. తమో గుణం, రజో గుణంలో ఉన్న వాళ్ళు శక్తి పెంచుకొని ఆ రెండు రకాల గుణాల నుంచి బయటపడి సాత్విక గుణంలోకి వస్తారు. సాత్విక గుణంలోకి రావడం వల్ల జ్ఞానం పొందే ప్రయత్నం చేస్తారు, ఈ కంటితో చూడలేని వాటిని తెలుసు కోవడం కోసం శక్తి పెంచుకోవడానికి ఇంకా తీవ్ర సాధన చేస్తారు.

అలా పెంచుకొని సాత్విక గుణంలో నుంచి శుద్ధ సాత్విక గుణంలోకి వెళ్తారు. మెల్లి మెల్లిగా ఇంకా తీవ్రాతి తీవ్రమైన సాధన చేయడం వల్ల శుద్ధ సాత్వికంలో నుంచి నిర్గుణంలోకి వెళ్తూ ఉంటారు. ఇక్కడ మీరు గమనిస్తే శక్తి పెరిగితేనే గుణం మారుతుంది. ఎంత శక్తి ఉంటే అటువంటి గుణంలో ఉంటారు. మరి అపారమైన శక్తి పెరిగి నిర్గుణంలోకి వెళ్ళడం వల్ల వారి జ్ఞానం పెరుగుతూ ఉంటుంది.

ఇక్కడ సాత్విక గుణంలో బుద్ధి బాగా ఉంటుంది, నిర్గుణలోకి వచ్చిన వాళ్ళకి జ్ఞానం కలుగుతూ ఉంటుంది. ఎందుకంటే నిర్గుణంలోకి వచ్చినవారు ఆత్మ స్థితిలో ఉంటారు. ఆత్మ అంటే భగవంతుడు. మరి భగవంతుడు అపార జ్ఞాన సంపన్నుడు కాబట్టి ఆ జ్ఞానం అంతా వాళ్ళకి అబ్బుతూ ఉంటుంది. అందుకే వాళ్ళు జ్ఞానవంతులై కనిపించని వాటి గురించి కూడా తెలుసుకొని సవ్యంగా జీవిస్తూ ఉంటారు.

శక్తి పెరగకపోతే తమోగుణం, రజోగుణంలో ఉండి చేయకూడని పనులు చేసి కష్టాలు తెచ్చుకుంటారు. చిన్న కష్టం వచ్చినా, సమస్య వచ్చినా తట్టుకోలేక విలవిలలాడిపోతారు. అదే శక్తి ఉన్నవాడు మిన్ను విరిగి మీద పడినా, ఎటువంటి భయంకరమైన సమస్యలు వచ్చినా, ధైర్యంగా ఉంటాడు.

అందుచేత అపారమైన శక్తి సంపాదించుకున్నవాడు జ్ఞానాన్ని పొందుతాడు, జ్ఞాని అవుతాడు. కష్టాలు వచ్చినప్పుడు ఆ కష్టాలకి కారణం

గతంలో నేను చేసిన కర్మలే అని తెలుసుకుంటాడు.. కర్మ ఉన్నంతవరకే నాకు ఈ కష్టం ఉంటుంది, కర్మ తీరిపోతే నేను ఈ కష్టంలో నుంచి బయట పడిపోతాను అని కూడా తెలుసుకుంటాడు. అప్పుడు వాడికి అది కష్టం కిందే అనిపించదు. అందుకే దేనికీ భయపడడు, బాధపడడు, నిర్భయంగా, ధైర్యంగా ఉంటాడు.

కాని అజ్ఞానికి కర్మ ఫలితాలు తెలియవు, సృష్టి నియమాలు సిద్ధాంతాలు ఏమీ తెలియవు, శక్తి ఉండదు, అందుకే చిన్న కష్టం వచ్చినా విలవిలలాడిపోతాడు, ఎందుకు ఈ జీవితం అని బాధపడిపోతాడు.

అందుకే ఆత్మజ్ఞాని దుఃఖంలో కూడా ఆనందంగా ఉంటాడు. అజ్ఞాని ఆనందంగా ఉండవలసిన సమయంలో కూడా దుఃఖపడుతూ ఉంటాడు అన్నారు.

కనుక అజ్ఞానంలో ఉండకండి జ్ఞానం సంపాదించుకోండి. జ్ఞానం యొక్క గొప్పతనం తెలియపరచడానికే ఈ ఉపమానం చెప్పబడింది, ఈ జ్ఞానం అన్నది మీ శక్తి పెరిగే కొద్ది వస్తుంది. శక్తి పెరగాలి అంటే "శ్వాస మీద ధ్యాస" ధ్యానం ఒక్కటే మార్గం.

సృష్టిలో ఈ కంటికి కనిపించినవి ఎన్నో ఉన్నాయి, అవన్నీ ఎంత తెలుసుకుంటే దుఃఖం నుంచి అంత బయట పడతారు, జ్ఞానం పొందే ప్రయత్నం చేస్తారు, దుఃఖం ఉన్నా కూడా ఆనందంగా ఉంటారు. జ్ఞానం పెంచుకునే కొద్దీ చేసిన కర్మలన్నీ రహితం చేసుకుంటారు.

పత్రిగారు "ఎవరి వాస్తవానికి వాళ్ళే సృష్టికర్తలు", "ఎవరిని వారే ఉద్ధరించుకోవాలి" అని చెప్పారు. ఒకళ్ళని ఒకళ్ళు ఉద్దరించలేరు అన్నది అజ్ఞానికి తెలియదు. కాని జ్ఞానం పొందితే అవన్నీ తెలుసుకోగలుగుతారు. కనుక జ్ఞానం పొందే ప్రయత్నం చేయండి.

## ::11::

**"వేరుకు పురుగు పడితే వృక్షం అభివృద్ధి చెందదు, ఫలాలు ఇవ్వదు. అలాగే జ్ఞానం లేకపోతే మానవులు ఉచ్ఛ దశకు పోరు, పతనం చెందుతారు".**

మనకి ఫలాలనిచ్చే వృక్షాలు ఎన్నో ఉన్నాయి. మామిడి, నేరేడు, సపోట, సీతాఫలము, యాపిల్ ఇలా ఎన్నో. అవి బాగా ఎదిగితే ఎన్నో ఫలాలను ఇస్తాయి. కానీ ఎంత గొప్ప వృక్షమైనా దాని వేర్లకు పురుగు పడితే అది ఎదగదు. మెల్లి మెల్లిగా దానికి కావలసిన సారం అందదు. ఆ వేర్లని ఆ పురుగు తినేస్తుంది, అది ఎదగడానికి కావలసినవి దానికి అందకపోతే ఆ వృక్షం ఫలాలు ఇవ్వలేదు.

అలాగే మానవులు జ్ఞానం సంపాదించుకోకపోతే ఉచ్ఛ దశకు పోరు అంటే ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితికి చేరుకోరు, ఆత్మ పరంగా ఎదగరు. ఇక్కడ ఎవరైనా సరే ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితికి చేరుకోవాలి అంటే జ్ఞానం కావాలి. జ్ఞానం ఎంత ముఖ్యమైనదో ఎంత ప్రముఖమైనదో ఈ ఉపమానాన్ని బట్టి మనం అర్థం చేసుకోవచ్చు.

ఏ మానవుడికైనా రెండు రకాల జీవితాలు ఉన్నాయి. ఇహలోక జీవితము, పరలోక జీవితము. ఇహంలో సుఖ శాంతులు ఉండాలి, పరంలో ఊర్ధ్వ లోకాలు చేరుకోవాలి. వాడు చాలా గొప్పవాడిగా కీర్తించబడతాడు.

వృక్షం ఫలాలు ఇస్తే అవి ఎంతోమందికి ఉపయోగపడతాయి, లోకంలో అందరూ ఆ ఫలాలని ఆరగించి ఆకలి తీర్చుకుంటారు, వాటి రుచిని ఆస్వాదిస్తారు, ఎంతో తృప్తి పడతారు. అలా వృక్షాలు లోకంలోని వారికి ఎంతో మేలు చేస్తాయి. మానవులే కాదు జంతువులు కూడా ఈ ఫలాల మీద జీవిస్తున్నాయి. మీరు చూడండి కోతులు, పక్షులు అనేక జంతువులు వృక్షాలకు కాసే ఫలాల మీదే బ్రతుకుతున్నాయి.

మీరు గమనిస్తే గొప్ప గొప్ప యోగులు హిమాలయాల్లో సాధనలు చేసుకునేవారు కూడా వృక్షాల నుంచి లభించే ఫలాలు, కాయలు తినే జీవిస్తారు.

నేను అనుకునేవాడిని ఇక్కడ మనం ఊళ్ళల్లో ఉంటే అన్ని రకాలు దొరుకుతాయి. కానీ హిమాలయాలకి వెళ్ళిపోతే అక్కడ ఏం దొరుకుతాయి? వాళ్లు ఎలా బ్రతుకుతారు? అనుకునేవాడిని. కాని కొన్ని పుస్తకాల్లో చదివాను వాళ్ళు అక్కడికి వెళ్ళిన తర్వాత అక్కడ బ్రతికే వాళ్ళ నుంచి ఏమి తింటే ఇంచక్కా జీవించి, తన సాధన కొనసాగించుకోవచ్చు అన్నది తెలుసుకునే వారట. అటువంటివన్నీ దొరికే అనుకూలమైన వాతావరణంలో వాళ్ళు బస చేసేవారట.

ముఖ్యంగా సాధకులకి నీరు బాగా అవసరం. కొంతమంది కొండల మీద తపస్సు చేసేవారు అంటే సాధన చేసుకునేవారు. నిజంగా నీళ్ళ కోసం అంత కొండ ఎక్కాలి, దిగాలి అంటే మామూలు విషయం కాదు, చాలా కష్టం. మరి ఎలా వీళ్ళు మెయింటైన్ అయ్యేవారు? ఎలా సాధన చేసుకునేవారు? అని నాకు సందేహం వచ్చేది.

కానీ కొన్ని ప్రదేశాల్లో నేను చూశాను అంత ఎత్తు కొండ మీద కూడా నీళ్లు ఉండేవి. నుయ్యిల్లాగ ఉంటాయి. అవి తవ్వినవి కాదు, సహజంగా ఏర్పడ్డాయి. అక్కడ నీళ్ళు ఎప్పుడూ ఉంటాయి, అవి అక్కడికి ఎలా వస్తాయో ఆశ్చర్యమే!

అలా కొంతమంది ముందు నీరు చూసుకుని ఆశ్రమాలు స్థాపించుకుంటారు. అవి లేకపోతే మనుగడ సాగించలేరు. మరి అలాంటి సాధకులు ఈ వృక్షాల ద్వారా ఫలాలు పొంది శరీరాన్ని నిలబెట్టుకుని తీవ్ర సాధనలు చేసి, గొప్పవారు కాగలిగారు. ఆ వృక్షాలే లేకపోతే మానవులే కాదు, జంతువులు కూడా జీవించడం కష్టం. అలా వృక్షాలు అభివృద్ధి చెంది లోకంలో ఎన్నో జీవులకు ఎంతో మేలు చేస్తూ ఉంటాయి.

అలాగే జ్ఞానం పొందిన మానవులు ఇహం లోనూ మేలు చేస్తూ ఉంటారు, పరంలోను మేలు చేస్తూ ఉంటారు. మనకి ప్రత్యక్ష ఉదాహరణ పత్రిగారే. ఆయన జీవితాన్ని లోక కళ్యాణం కోసమే వినియోగించారు. ఆయన

ఎంతో జ్ఞానం సంపాదించుకున్నారు, జ్ఞానం సంపాదించుకోవడం అంటే సర్వము తెలుసుకోవడం.

మరి బుద్ధుడు, రమణ మహర్షి, పత్రీజీ, ఇలా గొప్ప గొప్పవాళ్ళు, మహా జ్ఞానులంతా మానవుల దుఃఖానికి కారణం ఏమిటి? ఆ దుఃఖం పోవాలంటే ఏం చేయాలి? అనే విషయాలను తెలుసుకుని, అజ్ఞానంలో ఉన్న మానవులకి ఈ విషయాలు తెలియజేసి వారు కూడా దుఃఖంలోనుంచి బయటపడి ఆనందంగా జీవించగలిగేలా కృషి చేసేవారు.

అందుకే మానవులు అటువంటి యోగులు దర్శనం చేసుకునేవారు. వారి నుంచి సందేశాలు విని, అవి జీవితంలో ఆచరించి దుఃఖం నుంచి బయట పడేవారు. అటువంటి గొప్పవాళ్ళు సృష్టిలోని ధర్మాలు బోధించేవారు. అందరిని తమలాగే జ్ఞానవంతుల్ని చేయడానికి ఎంతో కృషి చేసేవారు, తాము ఆనందంగా ఉండడమే కాదు లోకంలో అందరూ ఆనందంగా ఉండాలని తపన పడేవారు. పత్రిగారిని గమనిస్తే మనకి ఇవన్నీ అర్థమవుతాయండి.

మానవుడు ఎక్కువగా నష్టపోయేది, దుఃఖానికి లోనయ్యేది జీవ హింస వల్లే. అందుచేత పత్రి గారు అది ఒక్కటే పట్టుకున్నారు. తన జీవితంలో మొట్టమొదటి ఆశయం అదే అని, అందరిచేత మాంస భక్షణ మాన్పించాలి, హింస మాన్పించాలి, అందరూ శాకాహారులు అవ్వాలనే కంకణం కట్టుకుని దానికి ఎంతో కృషి చేశారు. ఆయన ఉద్యోగం కూడా మానేసి లోక కళ్యాణం కోసమే పాటుపడ్డారు.

మరి జ్ఞానం పొందినవారు అలా లోక కళ్యాణానికి పాటుపడి ఎంతో మందికి మేలు చేయడం వల్ల ఎంతో ఉన్నత స్థితికి ఎదుగుతారు, ఇహంలో అందరి గౌరవం పొందుతారు, అందర్నీ సంతోష పెడుతూ, వారు సంతోషంగా జీవిస్తారు. వారు శాంతిగా జీవిస్తూ, అందరూ శాంతిగా జీవించే ప్రయత్నం చేస్తారు. పరంలో కూడా ఊర్ధ్వ లోకాలు చేరుకుంటారు. ఊర్ధ్వ లోకాలు అంటే జనాలోకం పైన ఉన్న మూడు లోకాలు మహాలోకము, తపోలోకము,

సత్యలోకము.

ఆ లోకాలకి చేరుకున్నవారు అక్కడికి వెళ్ళినా కూడా భూమిమీద ఏ పని చేశారో ఆ పనే చేస్తారు. జనాలోకం క్రింద లోకాల్లో ఉన్నటువంటి వారికి కౌన్సిలింగ్లు చేస్తారు. భూమిమీదకి వెళ్లి వాళ్ళు ఏం చేశారో తెలుసుకోమంటారు. ఇంకేం చేయాలో వాళ్ళకి బోధిస్తూ ఉంటారు. వాళ్ళకి లాభం కలిగే ప్రయత్నం భూమ్మీదే  శరీరంతో ఉన్నప్పుడే కాదు, శరీరం లేకపోయినా అక్కడ కూడా ఆ బోధలు చేస్తూ ఉంటారు.

వాళ్ళ ఆశయం ఒకటే. అందరూ బాగుండాలి, అందరూ సంతోషంగా ఉండాలి, అందరూ శాంతిగా జీవించాలి, అదే వారి ఆశయం. ప్రకృతి కూడా  అటువంటి వారినే మెచ్చుతుంది. అటువంటి వారికే ప్రకృతి సహకారం ఎప్పుడూ ఉంటుంది.

పత్రిగారు ఉద్యోగం మానేసి ఈ ప్రచారం చేస్తూ తిరిగేవారు. ఆయనకు బ్రతకడానికి ఉండేది జీతం ఒకటే. ఉద్యోగం మానేస్తే జీతం ఎవరిస్తారు? అయినా సరే అవి చెప్పడం వల్ల ఎక్కడికి వెళ్ళినా ఏదో నాలుగు మాటలు చెప్పాక వాళ్ళు భోజనం పెట్టి, ఏదో ఒకటి ఇచ్చేవారు, ఆయన అలా జీవించేవారు.

ఆయనకు మొదట్లో డబ్బులు ఉండేవి కావు. అందుకే రైల్లో  జనరల్ కంపార్ట్మెంట్ టాయిలెట్ల దగ్గర కూర్చునేవారట. ఆయనేమి హోటల్స్ లో రూమ్‌లో ఉండే వారు కాదు. బస్టాండ్‌లో, రైల్వేస్టేషన్ లో ఎక్కడ వీలైతే అక్కడ పడుకునే వారు. ఆయనకి ఒకసారి ట్రైన్ లో వెళ్తున్నప్పుడు టీ త్రాగాలనిపించిందట, అందరూ త్రాగుతున్నారు కానీ ఈయన జేబులో చూస్తే డబ్బుల్లేవు. అలా అనిపించిన కాసేపటికి అక్కడే, ప్రక్కన కూర్చున్న ఆయనే, రెండు టీలు కొని ఒకటి  ఈయనకి కూడా ఇచ్చాడట.

ప్రకృతి చూసుకోవడం అంటే అదే. ఆయన అంత సేవ చేయడం వల్ల, అందరికీ జ్ఞానం పంచడం వల్ల, అందరినీ అలా సంతోష పెట్టడం వల్ల,

తన స్వార్థం వదులుకొని, తన సుఖం వదులుకొని, ఎంత కష్టమైనా ఆ పని చేస్తూ ఉండడం వల్ల, ఎంతో మంది ఆయన్ని అనుసరించారు, ఆయన సందేశాల్ని మెచ్చుకున్నారు. చివరికు ఆయన విమానాల్లో తిరగగలిగే స్థాయికి వచ్చారు.

టీ కూడా త్రాగలేని స్థితిలో ఉన్నటువంటి ఆయనకి ప్రకృతి ఎంత సహకరించిందో చూడండి. అటువంటి పరిస్థితుల్లో ఉన్న ఆయన ఎలాంటి ప్రాజెక్టులు తీసుకొచ్చారు! మనకి ఎన్ని కోట్లు ఉన్నా అలాంటి ప్రాజెక్టులు కట్టగలమా?

ఒక ఛానల్లో ఏదో ఒక 10 నిమిషాలో, పావు గంటో ఇంటర్వ్యూ చేస్తే జ్ఞానం గురించి చెబుదాం అనుకునేవారాయన. అలా ఎవరైనా ఛానల్ వాళ్ళు ఆయన్ని రమ్మని పిలిచినప్పుడు మన వాళ్ళంతా మెసేజ్లు పెట్టుకునేవారు. ఈరోజు ఫలానా సమయంలో పత్రి గారి ఇంటర్వ్యూ ఉంటుందని. అప్పుడు ఆ టైంలో మనవాళ్ళంతా ఆ ఛానల్ పెట్టుకొని చూసేవారు.

అలా ఆ రకంగా కూడా ఆయన 10 మందికీ సందేశాలు చెప్పాలని తపన పడేవారు. మరి ఆయన తపనకి తగ్గట్టుగానే ప్రకృతి ఒక ఛానల్ పెట్టుకునే స్థాయికి ఆయన్ని తీసుకురావడం జరిగింది. దీన్ని బట్టి మీరు అర్థం చేసుకోండి.

ఈ పనులన్నీ ఎందుకు చేశారు? అపారమైన జ్ఞానం సంపాదించు కోవడం వల్లే ఆ పనులు చేయగలిగారు. జ్ఞానం లేకపోతే 10 మందికి మేలు చేయాలనే అభిప్రాయం ఉండదు, తను బాగుంటే చాలని అంతవరకే చూసుకుంటారు, అందరూ బాగుండాలి అన్న ఆలోచన ఉండదు, అది జ్ఞానం ఉన్నవాళ్ళకే ఉంటుంది.

అలాగే ఊర్ధ్వ లోకాల్లో చేరుకున్న వాళ్ళు మరుజన్మ తీసుకునేటప్పుడు వాళ్ళ ఇచ్ఛానుసారం అంటే ఇష్ట ప్రకారం ఎటువంటి జన్మ కావాలో అటువంటి జన్మ ఎంచుకోవడానికి అవకాశం ఉంటుంది. భూలోకంలోనే ఇరుగు, పొరుగు

కాదు, ఊర్ధ్వ లోకాల్లో కూడా ఈ జ్ఞానపరమైన విషయాలు చర్చించడానికి ఋషులు, మహర్షులు, యోగులు, తపః సంపన్నులు ఉంటారు.

అలాంటి వారితో వాళ్ళకి పరిచయం ఉంటుంది. వాళ్ళు ఇంకా పై లోకాలకి వెళ్ళాలంటే, లక్ష్యం సాధించాలంటే ఇంకా ఏం చేయాలి? ఆ జ్ఞానాన్ని ఇంకా ఎంత వృద్ధి చేసుకోవాలి? ఎలా వృద్ధి చేసుకోవాలి? భూమ్మీదకి వెళ్లి ఎలాంటి పనులు చేయాలి, ఏ పనులు చేస్తే ఇంకా పైలోకాలకి చేరుకునే అవకాశం ఉంటుంది అన్నది వాళ్ళతో చర్చించి తెలుసుకుంటారు.

ఒకళ్ళ అభిప్రాయాలు ఒకళ్ళు, ఒకళ్ళ జ్ఞానం ఇంకొకళ్ళు పంచుకుంటారు. జ్ఞానులే ఉన్నత లోకాలకి చేరుకోగలరు కాబట్టి వారికి పెద్ద కర్మలు ఏమీ ఉండవు. అందులో కొంతమంది కర్మలు రహితం చేసుకున్న వారు ఉంటారు, కొద్దిగా కర్మలు ఉన్నవాళ్ళు కూడా ఉంటారు. దానికి అనుగుణమైన జన్మ ఎంచుకుంటారు.

స్త్రీ జన్మ కావాలంటే స్త్రీ జన్మ, పురుష జన్మ కావాలంటే పురుష జన్మ, ఎలాంటి కుటుంబంలో కావాలంటే అలాంటి కుటుంబంలో జన్మ తీసుకుని వాళ్ళు ఇంకా ఇంకా గొప్ప లోకాలకు చేరుకుంటారు. ఇక్కడ మీకు జనాలోకం పైన ఉన్నవి మూడే. మరి ఇంకా గొప్ప లోకాలు అంటే అక్కడ మీరు అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే? ఒక మహాలోకం తీసుకుంటే ఏదో ఒక ఊర్లో ఉన్నట్టు కాదు, ఒక రాష్ట్రంలో ఉన్నట్టు కాదు, ఒక దేశంలో ఉన్నట్టు కూడా కాదు, ఒక భూమి మీద ఉన్నట్టు కూడా కాదు.

మీరు చూడండి పత్రి గారు చెప్పారు ఇలాంటి భూలోకాలు లక్షల కొద్దీ ఉన్నాయట, ఒకదాన్ని మించి ఒకటి. అలాగే పరంలో కూడా ఎన్నో రకాలైనటువంటి లోకాలు ఉంటాయి. అలా ఆ మహాలోకంలో భూమిమీదకి వెళ్ళినప్పుడల్లా ఇంకా ఉన్నతమైన లోకాలు చేరుకునే ప్రయత్నం చేస్తారు.

అక్కడి నుంచి తపో లోకానికి వెళ్తారు అక్కడ కూడా ఎన్నో లోకాలు ఉంటాయి, వాటిలో ఉన్నతమైన స్థితికి చేరుకుంటారు. చివరిగా సత్యలోకం

చేరుకునే అర్హత సంపాదిస్తారు.

అందుచేత అంత ఉన్నత దశకి చేరుకోవాలి అంటే ఖచ్చితంగా జ్ఞానం పొందడం అన్నది తప్పనిసరి. భూమి మీదకు వచ్చింది ఖానా, పీనా, సోనా కోసం కాదు. సహజంగా ఎక్కువ శాతం మందికి ఇవన్నీ తెలియవు కాబట్టి, ఈ జ్ఞానం లేదు కాబట్టి, వాళ్ళు ఏమని భావిస్తారంటే? బాగా చదువుకొని, బాగా సంపాదించుకొని, పెళ్లిళ్లు చేసుకొని, పిల్లల్ని కని హాయిగా జీవించాలి, అదే జీవితం అనుకుంటారు.

భూమ్మీద ఉన్నప్పుడు అలాగే అనుకుంటారు, కానీ పైకి వెళ్ళాక తెలుస్తుంది. అక్కడ దొబ్బులు పెడతారు. నువ్వు వెళ్ళింది ఎందుకు? ఏం చేసుకొచ్చావని? కానీ అజ్ఞానంలో ఉన్న వాళ్ళకి ఇవి తెలియవు. జ్ఞానం పొంది ఇంకొంచెం జ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలని భూమి మీదకి వచ్చిన వాళ్ళు చిన్న వయసులో ఉన్నా కూడా, తల్లిదండ్రులు ఎంత చెప్పినా జ్ఞానం పొందాలనే తపనే వారిలో ఉంటుంది.

వారి తపన తల్లిదండ్రులు అర్థం చేసుకోలేరు. పిల్లలు పెద్దవాళ్ళు అయితే పెళ్లి చేసుకోవడం, మంచి ఉద్యోగం సంపాదించడం, పిల్లల్ని కనడం, వాళ్ళని బాగా పోషించడం అదే డ్యూటీ అంటారు వాళ్ళు. సృష్టిలో ఇవన్నీ ఉన్నాయన్న సంగతి వాళ్ళకి తెలియదు.

వాళ్ళున్న ఊరే వాళ్ళ ప్రపంచం. చచ్చేదాకా ఏ లోటూ లేకుండా బ్రతకడమే వాళ్ళ ఆశయం. మళ్ళీ కష్టాలు వస్తే ఆ తల్లిదండ్రులే విలవిల లాడిపోతారు, ఆ సమస్యలు ఎందుకు వచ్చాయో తెలియదు, దాంట్లోనుంచి ఎలా బయటపడాలో తెలియదు. ఏమీ అర్థం కాకపోతే, ఏ దిక్కూ లేని వాడికి దేవుడే దిక్కు అంటూ నచ్చిన దేవుణ్ణి ఆశ్రయించి మొక్కుతూ, మొక్కులు తీర్చుకుంటూ, వాళ్ళనుకున్న కోరికలు నెరవేరితే ఆ దేవుణ్ణి ఇంకా నమ్ముతూ, తీరకపోతే ఆ దేవుణ్ణి వదిలేసి ఇంకొక దేవుణ్ణి పట్టుకుని తిప్పలు పడుతూ ఉంటారు.

కానీ జ్ఞానం పొందిన వారు అలా జీవించరు. వాళ్ళ ఆశయం వాళ్ళకు తెలుసు, వాళ్ళ లక్ష్యం ఏమిటో వాళ్ళకి తెలుసు. ఎవరెన్ని చెప్పినా వారి దృష్టి జ్ఞానం పొందడం మీదే ఉంటుంది. ఇప్పుడు రామకృష్ణ పరహంస వివేకానందుడ్ని ఎలా ప్రభావితం చేశాడో, మన పత్రిగారు కూడా నన్ను అలా ప్రభావితం చేశారు. ఆ రామకృష్ణ పరమహంస చెప్పిందే వివేకానంద ఆశయం అయింది, పత్రి గారు చెప్పిందే జీవితంలో నా ఆశయం అయింది.

వ్యాపారం చేసుకునే నేను, లక్షలు, కోట్లు సంపాదించే నేను, అన్నీ వదిలి జ్ఞాన మార్గంలో పయనించడం మొదలుపెట్టాను. జ్ఞానమే మానవుడికి కావలసింది, స్త్రీ అయినా, పురుషుడు అయినా, వృద్ధుడైనా, బాలుడైనా సరే జ్ఞానం సంపాదించుకున్నవాడే గొప్పవాడు. భూమి మీద ఉన్నది శాశ్వతం కాదు. ఇక్కడ ఉన్నవన్నీ తాత్కాలికం, ఎంత కోటీశ్వరుడైనా క్షణ కాలంలో అన్నీ కోల్పోయే పరిస్థితులు కూడా ఏర్పడతాయి.

ఇప్పుడు జపాన్ లో చూడండి భూకంపాలు, సునామీలు. చైనాలో వరదలకి డాములే కొట్టుకుపోతున్నాయి. ఎన్నో బ్రిడ్జీలు, నగరాలు కూడా మునిగిపోతున్నాయి. రష్యాలో, అమెరికాలో  ఇలా ఏ దేశంలో చూసినా పరిస్థితి అల్ల కల్లోలంగా ఉంది. ప్రకృతి వైపరిత్యాలు, లేకపోతే యుద్ధాలు. బాంబులు వేసుకుని ఎన్ని లక్షల మంది చనిపోతున్నారు.

ఎన్నో పెద్ద పెద్ద భవనాలు పేకమేడల్లా కూలిపోతున్నాయి. వాళ్ళ బ్రతుకులు కూడా అలాగే కూలిపోతున్నాయి. నేను చక్కగా బాగున్నాను, ఎప్పుడూ ఇలాగే ఉంటానని అనుకుంటారు మీరు. కానీ గుర్తుపెట్టుకోండి మీరు ఇహంలో ఉన్నా, పరంలో ఉన్నా మిమ్మల్ని రక్షించేది ధనం కాదు, మిమ్మల్ని  కాపాడేది జ్ఞానం ఒక్కటే. వేరుకు పురుగు పడితే వృక్షం అభివృద్ధి చెందదు, ఫలాలు ఇవ్వదు. అలాగే జ్ఞానం లేకపోతే మానవులు ఉచ్ఛ దశకు పోరు, పతనం చెందుతారు. అందుచేత జ్ఞానం సంపాదించండి. భూమిమీదా, పరంలో కూడా ఉచ్ఛ దశలో ఉండండి. గొప్పగా జీవించండి.

::12::

**“వర్షపు నీరు చవిటి నేలపై పడితే వృధా అవుతుంది. అలాగే ఎంత జ్ఞాన బోధ చేసినా కూడా కలుషిత హృదయాలకు వృధా అవుతుంది”.**

నేలల్లో రకాలు ఉంటాయి. సారవంతమైన నేల, చవిటి నేల ఇలా ఎన్నో ఉంటాయి. చవిటి నేలలో ఏ విత్తనము మొలకెత్తదు, ఏ మొక్కా ఎదగదు. అటువంటి చవిటి నేల మీద వర్షం పడితే, పడిన వర్షమంతా వృధా అవుతుంది. అదే ఆ వర్షం సారవంతమైనటువంటి భూమి మీద పడితే వర్షం లేక ఎండిపోయిన గడ్డి మొక్కలు, వాడిపోయినటువంటి చెట్లు కూడా, మళ్ళీ చిగురించి నవనవలాడుతూ ఎదుగుతూ ఉంటాయి. అలా ఎంతో ఏపుగా పెరిగిన ఆ మొక్కలు, వృక్షాలు లోకానికి, సమస్త జీవులకు ఎంతో ఉపయోగ పడతాయి, ఆ వర్షం వృధా కాదు.

అలాగే గురువులు, పెద్దలు, యోగులు మానవులకు జ్ఞానబోధ చేస్తూ ఉంటారు. వాళ్ళు ఎంత జ్ఞానబోధ చేసినా, ఎంత విపులంగా చెప్పినా, అర్థమయ్యేటట్టు వివరించినా, కలుషిత హృదయాలు కలిగిన వారికి అంటే మురికి మనసు కలవారికి, ఒక రకంగా చెప్పాలంటే తమోగుణము, రజోగుణములో ఉన్నవారికి అర్థం కాదు, ఎంత చెప్పినా అది వృధా అవుతుంది. ఎందుచేతనంటే? ఆ జ్ఞానం యొక్క విలువ వాళ్ళకి తెలియదు.

పత్రిగారు ఎక్కువగా జ్ఞానాన్నే బోధించేవారు. ఎందుచేతనంటే జ్ఞానం వల్లే కర్మలు రహితమవుతాయి, జ్ఞానం వల్లే దుఃఖంలోనుంచి బయట పడతారు, జ్ఞానం వల్లే ప్రవర్తన మారుతుంది, జ్ఞానం వల్లే ముక్తి కర్మలు చేస్తారు, జ్ఞానం వల్లే ముక్తిని పొందుతారు అని బ్రహ్మజ్ఞాని అయినటువంటి పత్రి గారికి తెలుసు.

అందుకే ఆయన అందరూ అజ్ఞానం తొలగించుకోవాలని, జ్ఞానులు అవ్వాలని తపన పడేవారు. అవకాశం దొరికినప్పుడల్లా జ్ఞానబోధ చేసేవారు.

మరి ఆయన సభలకు, ఆయన్ని కలవడానికి రకరకాల వారు ఎంతో మంది వచ్చినా అందులో చాలామందికి ఆయన చేసే ఈ జ్ఞాన బోధ అర్థమయ్యేది కాదు. కారణం ఏమిటంటే వారు కలుషిత మనస్కులు అంటే చవిటి నేలలాంటివారు.

పత్రి గారి జ్ఞాన బోధ వాళ్ళకి అర్థమయ్యేది కాదు. వాళ్ళ దృష్టి ఎంతసేపూ ఆయన ప్రవర్తన మీద ఉండేది కాని ఆయన బోధ మీద ఉండేది కాదు. ఆయన ఎవడైనా చేయకూడని పని చేసినప్పుడు, తప్పు చేసినప్పుడు, కార్యక్రమాల్లో అవరోధం కలిగిస్తున్నప్పుడు, క్రమ శిక్షణ పాటించనప్పుడు కోపగించుకుంటే ఈ చవిటి నేల లాంటి వాళ్ళు అంటే కలుషిత మనస్కులు, ఆయన చెప్పేది అర్థం కాక ఈయన ఒక గొప్ప గురువంటారు, ఈయనకేంటి ఇంత కోపం? అని అనుకునేవారు.

ఈయన దగ్గర మనమేం నేర్చుకుంటామని మళ్ళీ ఆయన దగ్గరికి వచ్చేవారు కాదు. అలాగే ఒక్కొక్కసారి ఆయన కొంతమందిని కొట్టడం కూడా జరిగింది. అప్పుడు ఇంకా కొంతమంది ఈ చవిటి నేలలాంటి వారే, ఈయన తిట్టడమే కాదు కొడుతున్నాడు, ఇదేం గురువు అని ఆయనకి దూరం అయ్యేవారు, ఆయన సభలకి వచ్చేవారు కాదు.

అలాగే ఎన్నో సమస్యలతోటి, బాధలతోటి ఉన్నవాళ్ళు అంతటి గొప్ప గురువు వచ్చాడని ఆయనతో సన్నిహితంగా ఉంటూ, ఆయన నుంచి ఇంకా ఎన్నో తెలుసుకోవచ్చు, నేర్చుకోవచ్చు అనే ఉద్దేశ్యంతో పురుషులే కాదు, స్త్రీలు కూడా ఆయనకు దగ్గర అయ్యేవారు. ఇలా చేస్తున్నప్పుడు ఈ చవిటి నేల లాంటి వాళ్ళు, అదేంటి ఈయన ఆడవాళ్ళ మీద చేతులు కూడా వేస్తున్నాడు అని దూరమైపోయేవారు.

పత్రి గారు మా ఇంటికి చాలా సార్లు వచ్చారు. వచ్చినప్పుడు నాకు

తెలిసిన వాళ్ళు చాలామంది ఆయన్ని చూడటానికి వచ్చారు.. వాళ్ళలో కూడా చాలామంది ఆయన జ్ఞానం వినేవారు కాదు, ఆయన ప్రవర్తన చూసేవారు, చూసి మళ్లీ వచ్చేవారు కాదు.

ఎప్పుడైనా అటువంటి వాళ్ళు నాకు కనిపించినప్పుడు ధ్యానానికి ఎందుకు రావట్లేదు అని అడిగితే కొంతమంది వేరే కారణాలు చెప్పేవారు, కొంతమంది బాగా దగ్గర వాళ్ళు ఓపెన్ గా అదేంట్రా బాబు మీ గురువు అలా ఉన్నాడు అనేవారు. అప్పుడు వాళ్ళు చాలా అజ్ఞానంలో ఉన్నారు, చాలా తక్కువ జన్మల్లో ఉన్నారు, మరి పత్రి గారిని అర్థం చేసుకోవాలంటే వాళ్ళకి ఇంకా చాలా జన్మలు పడుతుంది అన్నది అర్థమైంది. అందుకే ఆసక్తి చూపించని వారికి మరలా చెప్పేవాడిని కాదు.

ఇప్పుడు అదే పరిస్థితి నాకు వచ్చింది. ఇప్పుడు చాలా మంది ధ్యానంలోకి వచ్చిన వాళ్ళే! ఈ జ్ఞానబోధ చేస్తూ ఉంటే చేసే జ్ఞానబోధ మీద దృష్టి పెట్టరు, వాళ్ళ దృష్టంతా నా ప్రవర్తన మీదే ఉంటుంది.

ఈయనకి కోపం ఎక్కువ అందరినీ తిడతాడు అని కొంతమంది, ఈయన శాకాహార రాలీలకు వ్యతిరేకం, పిరమిడ్ల గురించి చెప్పడు, పత్రి గారేమో మ్యూజిక్ పెట్టి చేయిస్తూ ఉంటే ఈయన అది తప్పంటాడు అని కొంతమంది ఇలా నా క్లాసులకు దూరమైపోయిన వాళ్ళు చాలా మంది ఉన్నారు.

అసలు నా క్లాసులు వినరు. పోనీ మన దగ్గరకు రాకపోయినా, యూట్యూబ్‌లో వున్న వీడియోలైనా వింటే వాళ్ళకి అర్థమవుతుంది. అవీ వినరు, కారణం ఏమిటంటే! వాళ్ళంతా కలుషిత మనస్కులు, మలినమైన మనసు ఉన్నవాళ్ళు, చవిటి నేల లాంటివారు.

వాళ్ళకి మనం చెప్పే జ్ఞానం బోధ అర్థం కాదు. ఈయన ఇలా ఉన్నాడేంటి? అని దూరమైపోతారు. పత్రి గారు ఒక సందర్భంలో అన్నారు,

ఈ మూర్ఖులు నేను తిట్టానని, నేనేదో తప్పు చేసినట్టు అంటారు కానీ ఎందుకు తిట్టాను అన్నది ఆలోచించరు అని.

20 సంవత్సరాల క్రితం పత్రి గారి క్లాసుకు ఒక ఆవిడ చంటి పిల్లని ఎత్తుకుని మొదటి వరుసలో కూర్చుంది. పాప ఎంతో ఏడుస్తుంది, చెప్పేవాడికి ఎంత అసౌకర్యంగా ఉంటుంది, వాళ్ళ ఏకాగ్రత ఎంత దెబ్బ తింటుంది అన్నది కలుషిత మనస్కులకి, చవిటి నేల లాంటి వాళ్ళకి అర్థం కాదు. అలా ఇబ్బంది పడుతున్న గురువుగారు చెప్పకపోతే ఇంకెవరు చెప్తారు. మరి ఆయన తిట్టినప్పుడు వాళ్ళ దృష్టి ఎంతసేపు ఈయన తిడుతున్నాడు అన్న దాని మీదే ఉంటుంది కానీ, ఆవిడ చేసిన తప్పు మీద దృష్టి ఉండదు.

అలా పత్రి గారిని దూరం చేసుకున్నవాళ్ళు వేలు కాదు లక్షల మంది కూడా ఉన్నారు. ఇప్పుడు నా విషయంలో కూడా అలాగే ప్రవర్తిస్తున్నారు. కానీ ఎవరేం చేసుకున్నా, ఎలా అనుకున్న నాకు అనవసరం. నా పని నేను చేసుకుంటూ పోతాను, పత్రిగారు ఎలా ఎవరినీ లెక్క చేయలేదో, అలాగే నేను కూడా ఎవరినీ లెక్క చేయను. సారవంతమైన భూమి మీద విత్తనాలు ఎలా మొలకెత్తుతాయో, వర్షం నీరు ఎలా సద్వినియోగం అవుతుందో, అలా జ్ఞానాసక్తి ఉన్న వాళ్ళందరికీ బోధించడానికే నేను జన్మ తీసుకున్నాను, ఇదే నా ప్రణాళిక.

మన సొసైటీలో జ్ఞానం బోధించేవారు చాలా చాలా తక్కువ. కానీ అన్ని రకాలు బోధించే వాళ్ళు ఉన్నారు, రకరకాల ధ్యానాలు చేయిస్తారు, శాకాహార ర్యాలీలు చేయిస్తారు, పిరమిడ్లు కట్టిస్తారు ఇవే పత్రి గారు చెప్పారని భావిస్తారు, అంటారు.

వాళ్ళు ఏ స్థాయిలో చెప్తున్నారంటే మీరు శాకాహార ర్యాలీలో పాల్గొంటే మీ కర్మలన్నీ పోతాయి అంటారు. శ్రీకృష్ణ భగవానుడు జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం అన్నాడు. అంటే జ్ఞానం అనే అగ్నిలోనే కర్మలు దగ్ధమవుతాయని స్పష్టంగా

చెప్పాడు. కానీ వాళ్ళకి అన్నీ తెలిసున్నట్టు, జ్ఞానం ఉన్నట్టు ఆ పల్లెటూరు జనాలకి, అమాయకులైనటువంటి వారికి మీరు ర్యాలీలో పాల్గొంటే మీ కర్మలు పోతాయి అని చెప్తున్నారు. మరి వీళ్లు చాలా అజ్ఞాన స్థితిలో ఉన్నారు కాబట్టే మనం చెప్పే జ్ఞానం అర్థం కావట్లేదు అని నాకు అర్థమైంది. ఎందుచేతనంటే శాకాహార ర్యాలీలతోనే ఆగిపోవద్దు. జ్ఞానం కూడా సంపాదించుకోండి అని చెప్తాను. వీరు ర్యాలీలే వద్దంటాడు అని ప్రచారం చేస్తున్నారు.

ఇప్పుడు మన జ్ఞానాన్ని అర్థం చేసుకున్న వాళ్ళు, జ్ఞానకాంక్ష ఉన్న వాళ్ళంతా మనల్ని అనుసరిస్తున్నారు. లేని వాళ్ళు మనకు దూరం అవుతున్నారు. అజ్ఞానంలో ఉన్నవాడు ప్రచారం కూడా చేస్తాడు సమాజంలో ఇది సహజం, దానికి మనం ఏమీ చేయలేం. అసలు పత్రిగారిలా జ్ఞానబోధ చేసే వారు మన సొసైటీలో ఎంత మంది వున్నారు? మరి జ్ఞానం అవసరం లేదా? పత్రిగారు స్పష్టంగా చెప్పారు. **"ధ్యానం వల్లనే జ్ఞానం, జ్ఞానం వల్లనే ముక్తి"** అని.

జ్ఞానకాంక్ష ఉన్నవాళ్ళంతా సారవంతమైన భూమి లాంటివారు. జ్ఞానబోధ వాళ్ళకి బాగా అర్థమవుతుంది. వాళ్ళు ఎంతో ఎదుగుతారు, ఆ జన్మలోనే గొప్పగా జ్ఞానం పెంచుకుంటారు. వాళ్ళు తీసుకున్న జన్మని పూర్తిగా సద్వినియోగం చేసుకుంటారు, ఏ ఉద్దేశంతో భూమి మీదకి వచ్చారో అది సాధించగలుగుతారు. ఇంకా చెప్పాలి అంటే మన దగ్గరికి వచ్చే వాళ్ళంతా వాళ్ళు నిర్ణయించుకున్న దానికంటే ఎక్కువగానే జ్ఞానాన్ని సంపాదించు కుంటున్నారు, ఒక రకంగా అదనంగా కూడా పొందినవారు అవుతారు.

మీరు ఎంత అదృష్టవంతులో, ఆత్మైన మీరు ఎంత గొప్ప లోకాలకి చేరుకుంటారో తర్వాత మీకు ఎంత గొప్ప జన్మ వస్తుందో మీకు ఇప్పుడు తెలియదు, శరీరం వదిలాక అర్థమవుతుంది.

అందుచేత జ్ఞానాసక్తి లేనివారిని మనం పట్టించుకోవాల్సిన పనిలేదు. నిజానికి అమ్మ కానీ, నేను కానీ మూడు రోజుల క్లాసులకి ఎక్కువ ప్రాముఖ్యం ఎందుకు ఇస్తున్నామంటే మూడు రోజుల క్లాసుల్లో వచ్చేవాళ్ళంతా కూడా జ్ఞానాసక్తి ఉన్నవాళ్ళు. అందుకే చుట్టుపక్కల నుంచే కాదు ఎంతో దూరం నుంచి వస్తున్నారు. అటువంటి వాళ్ళు చాలా ఆసక్తితో వింటారు, శ్రద్ధ చూపిస్తారు, చెప్పే విషయాలన్నీ వ్రాసుకుంటారు, ఇంటికి వెళ్ళి దాన్ని మననం చేసుకుంటారు, పుస్తకాలు కొంటారు, వాళ్ళకి చెప్పినవి అర్థమవుతాయి.

మేమిద్దరము ఎలా కష్టపడుతున్నామో, ఎంత కృషి చేస్తున్నామో అలాగే వాళ్ళు కూడా  చేయాలి అనే భావంలో ఉంటారు. ఎంత చేయగలరో అంతా చేయడానికి ప్రయత్నిస్తున్నారు.  అలా ఎదుగుతున్నారు, జ్ఞానం పెంచుకుంటున్నారు, మాస్టర్లు అవుతున్నారు. మాస్టర్ అంటే జ్ఞానం బాగా పొందినవాడు అని అర్థం.

సారవంతమైన నేల మీద వర్షం పడితే ఆ వర్షపు నీరు ఎంత సద్వినియోగం అవుతుందో ఆ మొక్కలు, చెట్లు ఎంత నవనవలాడతాయో, లోకానికి ఎంత ఉపయోగపడతాయో, అలాగే ఒక సద్గురువు చేసిన జ్ఞాన బోధ ఎంతో మందిని ప్రభావితం చేసి, వారిలో జ్ఞానాన్ని పెంచి, వారు కూడా లోక కళ్యాణానికి పాటుపడే విధంగా చేస్తుంది. వాళ్ళు లాభం పొందడమే కాదు వాళ్ళ ద్వారా ఎంతో మంది లాభం పొందుతారు.

ఇప్పుడు చూడండి పత్రి గారు నన్ను, అమ్మని తయారు చేశారు. ఇప్పుడు మేమిద్దరము మీ అందరినీ తయారు చేస్తున్నాం. ఇప్పుడు మీలో కూడా ఎంతోమంది ఈ కృషిలో పాల్గొంటున్నారు. ఒక్కొక్కళ్ళు ఎన్నో పనులు చేస్తున్నారు, ఎవరూ మీ సమయాన్ని వృధా చేయట్లేదు, ఎవరి శక్తి మేర వాళ్ళు పాల్గొని సేవలు చేస్తున్నారు. దీనికి ముఖ్య కారణం ఆ జ్ఞానాన్ని అవగాహన చేసుకోవడమే!

అందుకే అమ్మకానీ, నేను కానీ వీలైనంత మటుకు ప్రతిరోజు జూమ్ క్లాస్ చెప్పడానికే ప్రాముఖ్యం ఇస్తున్నాం, జ్ఞానం అర్థం కాని వాళ్ళ గురించి, ఆసక్తి చూపించని వారి గురించి మనం పెద్ద పటించుకోవాల్సిన పనిలేదు, వాళ్ళకి చెప్పవలసిన పని కూడా లేదు. ఏదో విధంగా వాళ్ళకి నచ్చ చెప్తే మారతారని మీరు అనుకుంటారు. కానీ ఎవ్వరైతే మీతో వాదనకు దిగుతూ ఉంటారో వాళ్ళు మూర్ఖులు, మీరు వాళ్ళతో వాదించకండి.

అన్ని రకాలవారు మీకు తగులుతారు, కానీ ఆసక్తి ఉన్నవాళ్ళకి చెప్పండి. మీరేమి నిరుత్సాహపడవలసిన పనిలేదు, ఒకవేళ వాళ్ళ విమర్శల్లో నిజం ఉంటే వాటిని సరి చేసుకోండి తప్పేమీ లేదు. నేను అదే చేసేవాడిని, అలా అన్నీ నోట్ చేసుకుని తర్వాత దాని మీద ఆలోచించి విశ్లేషణ చేసుకునేవాడిని.

వర్షపు నీరు చవిటి నేలపై పడితే వృధా అవుతుంది. అలాగే కలుషిత హృదయం కలవారికి ఎంత జ్ఞాన బోధ చేసినా కూడా వృధా అవుతుందని తెలుసుకోండి.



## ::13::

**"మామూలు యజ్ఞశాలలో కత్తితో పశువును బలి ఇస్తే నరకాన్ని పొందుతారు. అలాగే శరీరం అనే యజ్ఞశాలలో ధ్యానం అనే కత్తితో అజ్ఞానం అనే పశువును బలియిస్తే జ్ఞానం అనే అగ్ని ప్రజ్వరిల్లి మోక్షాన్ని పొందుతారు"**

ఇక్కడ యజ్ఞశాలని శరీరంతో, కత్తిని ధ్యానంతో, బలి ఇచ్చే పశువును అజ్ఞానంతో పోల్చడం జరిగింది. అలా హింస చేసే యజ్ఞంలో నరకాన్ని పొందుతారు. కానీ ఇటువంటి యజ్ఞంలో జ్ఞానం ప్రజ్వరిల్లడం వల్ల మోక్షాన్ని పొందుతారు.

పూర్వం నుంచి రాజులు, ధనవంతులు, లేదంటే గురువులు యజ్ఞాలు, యాగాలు చేసేవారు. ఇప్పుడూ చేస్తున్నారు. వీటిని గొప్ప పుణ్య కర్మలుగా భావిస్తారు. అవి పుణ్య కర్మలు అంటే కామ్య కర్మలు అని తెలుసుకోవాలి. కామ్య కర్మ అంటే కోరికతో చేసేది.

రాజ్యం విస్తరించాలంటే అశ్వమేధ యాగం, పుత్రులు కలగాలి అంటే పుత్ర కామేష్టి యాగం, అలాగే వర్షాలు పడాలి అంటే వరుణ యాగం చేసేవారు. ఈ యాగాల్లో సహజంగా ఎవరో ఒక దేవతనో, లేకపోతే దేవుణ్ణో ఉపాసించే వారు. అంటే ఆ పేరుతో మంత్రాలు చదివి ఆహ్వానించేవారు. వారిని ఉద్దేశించి ఇవన్నీ చేశారు కాబట్టి, ఆ దేవతలు ఎంతో సంతోషించి వీరిని సంతృప్తి పరచడానికి వీరి కోరికని తీర్చేవారు.

వరుణ దేవుణ్ణి ఉపాసన చేసి యాగం చేస్తే వరుణ దేవుడు ఆ దేశంలో వర్షాలు కురిపించేవాడు, అప్పుడు పంటలు బాగా పండేవి, నీటి కరువు తీరిపోయేది, ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేవారు. అలాగే పుత్రులు లేని దశరథ మహారాజు పుత్రకామేష్టి యాగం చేస్తే నలుగురు పుత్రులు కలిగారు.

కానీ కాలానుగుణంగా ఆ యజ్ఞాల్లో పశువులని కూడా బలి ఇవ్వడం మొదలుపెట్టారు. ఆ దేవతలకి, ఆ దేవుళ్ళకి ప్రీతికరం అంటూ, తమ కోరికలు

తొందరగా నెరవేరుతాయని జీవ హింస చేసేవారు. ఆ యజ్ఞంలో వీరికి ఫలితం వస్తుందో లేదో తెలియదు కానీ, అలా ఎన్నో జీవులని హింసించడం వల్ల వాళ్ళు నరకానికే వెళ్తారు. దాని ఫలితం తర్వాత దారుణంగా అనుభవిస్తారు.

ఈ యజ్ఞాలు, యాగాలు పూర్వం నుంచి ఆచారంగా వచ్చాయి. మానవులు చేసే పుణ్య కర్మల్లో గొప్ప పుణ్యకర్మలు ఇవే. ఇటువంటి పుణ్య కర్మలు చేయడం వల్ల మరు జన్మలో భోగం అనుభవిస్తారు, ఆ భోగం అనుభవించిన తర్వాత మరలా ఆ పుణ్యం అంతా ఖర్చైపోతుంది, వారు మళ్ళీ మామూలు స్థితికి వస్తారు.

కానీ పత్రి గారు వచ్చి నాయనా మనం అన్నిటికంటే గొప్ప యజ్ఞం చేద్దాం అన్నారు. మరి దానికి అగ్నిని రగల్చక్కర్లేదు, యజ్ఞశాలలు అక్కర్లేదు, దీనికి మామూలు కత్తి కూడా అవసరం లేదు అన్నారు.

నీ శరీరమే ఒక గొప్ప యజ్ఞశాల, దాన్ని ఉపయోగించి ధ్యానం చెయ్యి. ధ్యానమనే కత్తితోటి మామూలు పశువుని కాదు నీ శరీరంలో అజ్ఞానమనే పశువుని సంహరించు అన్నారు. ఎప్పుడైతే అజ్ఞానం అనే పశువును నువ్వు బలిస్తావో, జ్ఞానం అనే అగ్ని ప్రజ్వరిల్లుతుంది. ఆ అగ్ని ప్రజ్వరిల్లే కొద్దీ నువ్వు జన్మ జన్మల్లో చేసిన కర్మలన్నీ దగ్ధమై పోతాయి, అలా నీ కర్మలన్నీ దగ్ధమైనప్పుడు నువ్వు మోక్షాన్నే పొందుతావు అని చెప్పడం జరిగింది.

అందుకే ఆయన ప్రతి సంవత్సరం మనందరి చేత ధ్యాన యజ్ఞాలు చేయించేవారు. అలా ఆయన నిర్వహించే అంత గొప్ప యజ్ఞాల్లో మనమందరం పాల్గొనేవాళ్ళం. మరి గత 20 ఏళ్లుగా భీమవరంలో కూడా ప్రతి నెల ఒకటి, రెండు, మూడు తారీఖులలో వందల మంది కలిసి సరైన ధ్యానం "శ్వాస మీద ధ్యాస" చేస్తూ ఒక గొప్ప యజ్ఞాన్ని నిర్వహిస్తున్నాం.

చాలామందికి దాని విలువ తెలియదు. ఏదో భీమవరం వెళ్తే మూడు లేదా నాలుగు గంటలు ధ్యానంలో తేలికగా కూర్చోవచ్చు అనుకుంటారు. కానీ వాళ్ళు ఒక గొప్ప యజ్ఞంలో పాల్గొంటున్నారు అన్న సంగతి వాళ్లకి

తెలియదు, దాని ఫలితం ఏమిటో, దాని గొప్పతనం ఏమిటో తెలియదు.

కొంతమంది మేము భీమవరం రాకపోయినా లైవ్‌లో చూస్తున్నామండి అంటారు. అలా యజ్ఞం చేసేవాడు ఒకడు, దాన్ని దూరం నుంచి చూసేవాడు ఒకడు. మనం యజ్ఞం చేస్తుంటే వాళ్లంతా లైవ్ లో చూస్తున్నారు. దాని వల్ల వాళ్లకేం ఫలితం వస్తుంది? ఆ యజ్ఞంలో పాల్గొంటేనే అజ్ఞానమనే పశువుని బలి ఇస్తే, జ్ఞానం పొంది, కర్మలు రహితం చేసుకుని మోక్షాన్ని పొందుతారు. ఎంత అద్భుతమైన అవకాశం, అందుకే ఈ అవకాశాన్ని జార విడుచుకోవద్దు అంటాను.

ఎందుచేతనంటే మన సొసైటీలో యజ్ఞాలు చేస్తున్నారు కానీ, సరైన ధ్యానం చేయట్లేదు. సరైన ధ్యానం చేస్తేనే జ్ఞానాగ్ని ప్రజ్వరిల్లుతుంది, కానీ సరికాని ధ్యానాలు చేస్తే జ్ఞానాగ్ని ప్రజ్వరిల్లదు. జ్ఞానాగ్ని ప్రజ్వరిల్లకపోతే కర్మలు దగ్ధం కావు, కర్మలు దగ్ధం కాకపోతే మోక్షం రాదు. వాళ్ళు యజ్ఞం చేశాను అనుకుంటారు కానీ అది ఫలితం ఇవ్వనటువంటి యజ్ఞం, అందుకే నేను ప్రతి నెల మానొద్దు అని ప్రతి ఒక్కరికి చెప్పడానికి కారణం.

ఏదో కొన్ని నెలలు వచ్చి, వచ్చానని అంటున్నారు కానీ జ్ఞానాగ్ని ప్రజ్వరిల్లిందా? లేదా? మీ కర్మలు దగ్ధమయ్యాయా లేదా? అన్నది ఆలోచించడం లేదు. మన వాళ్ళు దీన్ని త్రీ డేస్ క్లాస్ అంటారు కానీ ఇది మూడు రోజుల ధ్యాన యజ్ఞం. పత్రీగారు ఏమన్నారంటే 10 మంది కలిసి నిర్వహించేది యజ్ఞము అన్నారు. మరి మనకి భీమవరంలో 10 మందితో కాదు 400 మందితో నిర్వహిస్తున్నాం. అలాంటప్పుడు అది ఎంత గొప్ప యజ్ఞమండి!

మరి ఇటువంటి యజ్ఞంలో పాల్గొంటే ఖచ్చితంగా పశువులాంటి అజ్ఞానాన్ని మనం బలిస్తాం. వెంటనే జ్ఞానాగ్ని ఉద్భవిస్తుంది. అటువంటి అగ్నిలో కర్మలు దగ్గం అవుతాయి. ఏ మానవుడికైనా కావల్సింది అదే, సాధించవలసింది అదే, కృష్ణుడు చెప్పింది, పత్రీగారు చెప్పిందీ అదే. అందుకే **"ధ్యానం వల్లనే జ్ఞానం, జ్ఞానం వల్లనే కర్మ రాహిత్యం, కర్మ రాహిత్యం వల్లనే మోక్షం అన్నారు".**

మామూలు యజ్ఞాలు పుణ్యం కోసం, కోరికల కోసం చేస్తారు. కానీ ఈ ధ్యాన యజ్ఞాలు జ్ఞానం కోసం, మోక్షం కోసం చేస్తున్నాం. కానీ కొంతమంది భీమవరం రమ్మంటే బోలెడు పనులున్నాయండి అంటారు. మీరంతా ఎన్నో జన్మలు నుంచి ఈ పనులన్నీ చేసిన వాళ్లే, అలా చేస్తూనే ఉన్నారు. ఆ జన్మల్లో మొగుళ్లు లేరా? పెళ్ళాలు లేరా? పిల్లలు లేరా? సంసారాలు లేవా? ఆ సుఖాలు పొందలేదా? ఆ సరదాలు తీర్చుకోలేదా? ఆ జన్మల్లో ఏమీ తినలేదా? ఏదో కడుపు నింపుకోవడానికి తినడం వేరు, ఎప్పుడూ తిననట్టు, మొహమాసినట్టు తినడం వేరు.

అందుచేత ఇప్పటి నుంచైనా జ్ఞానం సంపాదించండి. ఇవన్నీ శరీర అవసరాల కోసం. అలాగని వాళ్లని వదిలేయమనట్లేదు, అవసరాలు తీర్చుకోండి. ఇంకెన్ని జన్మలు ఎత్తుతారు? విసుగెత్తట్లేదా? వద్దనే భావం రావట్లేదా? ఇప్పుడైనా బయట పడదాం, ఇదే ఆఖరి జన్మ చేసుకుందాం, జ్ఞానం సంపాదిద్దాం, ధ్యాన యజ్ఞాల్లో పాల్గొందాం.

షిరిడీ బాబా కూడా ఇదే చెప్పారు. ఇదే ఆఖరి జన్మ చేసుకోవాలనే కాంక్ష, తీవ్ర తపన, ఆ ముముక్షత్వం ఉండాలి అన్నారు. ఈ అజ్ఞానం అనే పశువును బాగా పుష్టిగా పెంచి పోషించాం, దాన్ని పెంచడం కాదు, దాన్ని బలిచ్చి జ్ఞానం అనే అగ్నిని  రగల్చండి. యజ్ఞంలో సమిధుల్ని భస్మం చేసినట్టే జ్ఞానం అనే అగ్నిలో కర్మలన్నిటిని భస్మం చేయండి.

దానికోసం సరైన ధ్యాన యజ్ఞాల్లో పాల్గొనండి.

## ::14::

**"ప్రమిదలో నీరు పడితే దీపం వెలగదు. అలాగే హృదయంలో విషయ వాంఛలు ఉంటే జ్ఞానజ్యోతి ప్రకాశించదు".**

మీరు చూడండి ఒక ప్రమిదలో నూనె పోసి దీపం వెలిగిస్తారు. కానీ అందులో నీరు పడితే అది అస్తవ్యస్తంగా వెలుగుతూ చివరికి ఆరిపోతుంది. మళ్లీ వెలిగిద్దామన్నా కూడా కష్టమే. ఆ వత్తి నీరు లాక్కోవడం వల్ల దీపం వెలగదు. దీపం నూనె వల్లే వెలుగుతుంది.

అలాగే మానవుని హృదయంలో విషయ వాంఛలు ఉంటే! అంటే కోరికలు ఉంటే వారిలో జ్ఞానజ్యోతి ప్రకాశించదు. ఇప్పుడు చూడండి మనమందరం ప్రతిరోజు పత్రి గారు చెప్పినట్టు నాలుగు పనులు చేస్తున్నాం.

1) శ్వాస మీద ధ్యాసం ఉంచి తీవ్రంగా ధ్యానం చేస్తున్నాం.

2) జ్ఞానవంతమైన పుస్తకాలు చదువుతున్నాం.

3) సత్యం గురించి తెలుసుకునే సందేశాలు వింటున్నాం.

4) ఈ జ్ఞాన మార్గంలో ఎవరు చేయగలిగిన సేవలు వాళ్ళు చేస్తున్నాం.

దేనికోసం ఇవన్నీ చేస్తున్నాము అంటే? మన హృదయంలో ఉన్నటువంటి జ్ఞానజ్యోతిని ప్రకాశింప చేసుకోవడానికి. ఎందుకు ప్రకాశింప చేసుకోవాలి అంటే? ఈ దుఃఖం నుంచి శాశ్వతంగా బయటపడటానికి. దుఃఖం అనేక రకాల సమస్యల వల్ల వస్తుంది, మరి అన్ని రకాల సమస్యల నుంచి బయటపడాలి. ఎందుకంటే? దుఃఖం ఉంటే శాంతి ఉండదు, సుఖం ఉన్నా అనుభవించలేరు కాబట్టి.

మరి వీటిలోనుంచి బయట పడటానికే జ్ఞానం పెంచుకోవడానికి ప్రయత్నిస్తున్నాం. జ్ఞానం పెంచుకోవడం వల్లే ఏ కర్మలు అయితే మనకి కష్టాలను ఇస్తున్నాయో ఆ కర్మలని దగ్ధం చేసుకోగలం. మరి ఈ జ్ఞానం

ప్రకాశించాలి అంటే హృదయంలోనే ప్రకాశించాలి. కారణం ఆ హృదయంలోనే భగవంతుడు ఉన్నాడు, భగవంతుని యొక్క స్థానం హృదయం.

అందరూ కూడా పూజ అయిపోయాక మంత్ర పుష్పం చెప్తారు. మంత్ర పుష్పం యొక్క అర్థం ఏమిటి అంటే? ఈ సృష్టిని సృష్టి చేసిన, సృష్టిని నడిపిస్తున్నటువంటి భగవంతుడు, ఆ పరబ్రహ్మ ప్రతీ మానవుని శరీరంలో ఉన్నటువంటి హృదయంలోనే ఉన్నాడు అని చెప్తుంది. మరి జ్ఞానం అన్నది ఆయన దగ్గరే ఉంది కాబట్టి, మనకి జ్ఞానం కావాలంటే హృదయంలో వున్నటువంటి ఆయన్ని ఆశ్రయించాలి.

మరి హృదయంలో ఉన్న ఆయన్ని ఆశ్రయించాలి అంటే? హృదయంలో మలినాలు కానీ, విషయ వాంఛలు అంటే ప్రాపంచికమైన కోరికలు కానీ ఉండకూడదు. ఇలాంటివి ఉంటే ఆయన్ని ఆశ్రయించలేము. ఆయన్ని ఆశ్రయించకపోతే మానవునిలో జ్ఞానం పెరగదు. ఎన్ని తిప్పలు పడినా, ఎన్ని చోట్లకు తిరిగినా, ఎంతమంది గురువులని ఆశ్రయించినా వారిలో జ్ఞాన ప్రకాశం కలగదు.

అందుచేత హృదయంలో ఉండేటువంటి ఆ భగవంతుని అంటే ఆత్మను ఆశ్రయించాలి. అలా ఆశ్రయించాలి అంటే హృదయం శుద్ధిగా ఉండాలి. హృదయం శుద్ధిగా ఉండాలి అంటే ముందు మనసుని శుద్ధి చేయాలి. మనసు శుద్ధమయ్యే కొద్దీ హృదయ శుద్ధి కలుగుతుంది. మనసుని శుద్ధి చేసే మార్గమే పత్రి గారు మనకి బోధించినటువంటి "శ్వాస మీద ధ్యాస" ధ్యానం.

అందుచేత ఈ విషయ వాంఛలు అంటే ప్రాపంచికమైన కోరికల్ని వాటినే అరిషడ్ వర్గాల్లో కామము అంటారు. దాన్ని అదుపు చేసుకోవాలి. ఎప్పుడైతే ఈ కోరికల మీద మీకు అదుపు ఉంటుందో అవి మీకు నష్టాన్ని కలిగించవు. మీ జ్ఞానాన్ని పెంచుకోవడానికి మంచి అవకాశం కలుగుతుంది. అందుచేత ఎవరైనా సరే కోరికలు ఖచ్చితంగా అదుపు చేసుకోవాల్సిందే.

ఆ విషయ వాంఛల్ని అదుపు చేసుకుంటేనే మీలో జ్ఞాన ప్రకాశం

కలుగుతుంది, పాప కర్మలు రహితమవుతాయి, జీవితంలో సుఖ సంతోషాలే కాదు, ఆనందంగా కూడా జీవించగలుగుతారు.

గుర్తుపెట్టుకోండి కోట్లు ఉన్నంత మాత్రాన ఆనందంగా ఉండలేరు. చాలామంది అనుకుంటారు కోట్లు ఉంటే ఆనందమని, కానీ ఎన్ని కోట్లు ఉంటే అంత దుఃఖం ఉంటుంది.

మనం చూస్తున్నాం కోట్లు సంపాదించే ఈ సినిమా యాక్టర్లు, రాజకీయ నాయకులు, ఎన్నో గొడవలు పడుతున్నారు, ఎన్నో తగువులు ఆడుకుంటున్నారు, అనుక్షణం ఎంతో భయంతో జీవిస్తున్నారు, ఏ కేసులు వచ్చి మీద పడతాయో, వేటి వల్ల హాని జరుగుతుందో అని నిద్ర పట్టని పరిస్థితిలో ఉంటున్నారు.

కానీ కోట్లు లేకపోయినా ఈ విషయ వాంఛలు అదుపు చేసుకోగలిగిన వాడు ఎంతో హాయిగా నిద్రపోతాడు, జీవితంలో శాంతిగా జీవిస్తాడు, ఏ ఆందోళనలు, ఏ భయాలు, ఏ అశాంతి ఉండదు.

వాటన్నిటిని అదువు చేసుకోవడమే కాదు, లేకుండా కూడా చేసుకోగలుగుతాడు. మరి అలా శాంతిగా జీవించేవాడు, హాయిగా నిద్ర పోగలిగిన వాడే గొప్పవాడు. పత్రిగారు ఏమంటారంటే! మీరు నిద్ర పోయేటప్పుడు ధ్యానంలో కూర్చోండి, మెల్లిగా యోగ నిద్రలోకి జారుకుంటారు అన్నారు. యోగ నిద్ర అంటే గాఢ నిద్రా స్థితి అంటే గాఢ నిద్రలోకి వెళ్ళి పోతారు. యోగము అంటే కలయిక, అలా గాఢ నిద్రలో ఎవరితో కలుస్తారు? సాక్షాత్తు భగవంతునితో, ఆ భగవంతునితో ఉన్న స్థితే యోగం అంటారు, అది ఆ గాఢ నిద్రాస్థితిలో వస్తుంది.

ఆ స్థితిలో శరీరం పని చేయదు, ఇంద్రియాలు పని చేయవు, ఆఖరికి మనసు కూడా పనిచేయదు. ఏమీ పని చేయనప్పుడు ఉండేది ఆత్మ అంటే భగవంతుడు. ఆ స్థితిలో ఉన్నవాడు అంతులేని ఆనందాన్ని పొందుతూ ఉంటాడు. అటువంటి ఆనందానుభూతిని అనుభవిస్తున్నప్పుడు గంటలు

నిమిషాల్లా గడిచిపోతాయి. వాడు ఐదు గంటలు పడుకున్నా, ఆరు గంటలు పడుకున్నా, ఐదు నిమిషాలు నిద్ర పోయినట్టు ఉంటుంది. అరే అప్పుడే తెల్లారిపోయిందా! అని ఆశ్చర్య పోతాడు.

నిద్ర పోతే అలాంటి నిద్రపోవాలి. కలత నిద్ర కూడా పనికిరాదు. కలత నిద్రలో కలలు కంటూ ఉంటారు, మనసు పని చేస్తూనే ఉంటుంది. అందుకే పత్రిగారు ఏమంటారంటే! గాఢ నిద్రాస్థితి పొందాలి అంటే మీరు నిద్ర పోయేటప్పుడు ధ్యానంలో కూర్చోండి అంటారు.

దీనివల్ల రెండు రకాల లాభాలు పొందుతాము.

1) ఆ నిద్ర పోయేటప్పుడు ఆ దైవంతో ఉంటారు, ఆ శక్తి పొందుతూ ఉంటారు.

2) నిద్రపోయినప్పుడు ఎంతో రిలాక్స్ అవుతారు. కోల్పోయిన శక్తి అంతా తిరిగి సంపాదించుకుంటారు. మీ ఇంద్రియాలు అవయవాలు ఆ రోజంతా ఎంతో శక్తివంతంగా పనిచేస్తాయి.

అందుచేత హృదయంలో విషయ వాంఛలు ఉంటే వాళ్ళ హృదయంలో జ్ఞానజ్యోతి ప్రకాశించదు అన్నదే ఈ ఉపమానం యొక్క గొప్ప సందేశం.

ఆ స్థితి రావాలి అంటే ఎవ్వరైనా సరే "శ్వాస మీద ధ్యాస" వుంచి ధ్యానం చేస్తూ ఉండాలి. ఈ ధ్యానం వల్ల ఒక్క లాభం కాదండి ఎన్నో ఉన్నాయి. మీరేదో కళ్ళు మూసుకుని మ్యూజిక్ పెట్టుకుంటే అది ధ్యానం అనుకుంటారు, కాని అక్కడ మనసు పనిచేస్తూ ఉంటుంది, అది ధ్యానం ఎలా అవుతుంది? మనసు పనిచేస్తే, మనసుతో ఉంటారు. మనసుతో ఉంటే మీకా రిలాక్సేషన్ ఎక్కడ వస్తుంది? ఆత్మతో ఉంటేనే కదా? మీరు ఎంతో రిలాక్స్ అయ్యేది.

అందుకే గైడింగ్‌లు, మ్యూజిక్‌లు కాదు హాయిగా "శ్వాస మీద ధ్యాస" పెడితే రెండు రకాల లాభాలు కలుగుతాయి. ఒకటి ఈ మనసులో ఉన్నటువంటి ఆలోచనలన్నీ పూర్తిగా తొలగిపోతాయి. ఎప్పుడు ధ్యానంలో

కూర్చున్న అపారమైన శక్తి  సంపాదించుకుంటారు. నిద్రలో కూడా ఎంతో శక్తి సంపాదించు కుంటారు.

కానీ ఈ మ్యూజిక్ ఇవి పెట్టుకున్నప్పుడు మనసు ఆలోచనల మీద నుంచి ఈ మ్యూజిక్ మీదకి మళ్ళడం వల్ల మనసులో ఆలోచనలు అలాగే ఉండిపోతాయి. రోజు రోజుకి పెరిగిపోతూ ఉంటాయి. అలా ఆలోచనలతో కూర్చోవడం వల్ల  శక్తి రాదు. ఇలా రెండు రకాలుగా కూడా నష్టపోతారు. చేసిన సమయం అంతా వృధా అవుతుంది.

మనకి ధ్యానం చేసుకుని లాభాలు పొందటానికి ఈ జన్మలో మంచి అవకాశం ఇవ్వబడింది. మరి రకరకాల ధ్యానాలు చేయడం వల్ల ఆ ఇవ్వబడిన అవకాశం కోల్పోతారు. ఇంకా అలాగే కొనసాగిస్తే ఆ జన్మే వృధా చేసుకున్న వాళ్ళు అవుతారు.

ధ్యానంలోకి వచ్చి “శ్వాస మీద ధ్యాస” కాకుండా గొప్పల కోసం, లాభాల కోసం, అనుభవాల కోసం  ఇంక ఏ రకమైన ధ్యానాలు చేసినా అవన్నీ కూడా వృధా అన్న సంగతి వాళ్ళకి శరీరం వదిలినప్పుడే అర్థమవుతుంది. అప్పుడు ఎవరూ, ఏమీ చేయలేరు.


ఇంకా కొంతమంది మాస్టర్లు విచిత్రంగా ఏం చెప్తున్నారంటే? ప్రాపంచికంలో టెక్నాలజీ పరంగా, ఈ పరంగా, ఆ పరంగా ఎన్నో మార్పులు వస్తున్నాయి. అలాగే ఆధ్యాత్మికంలో కూడా ఎన్నో మార్పులు వస్తూ ఉంటాయి అంటున్నారు. నిజంగా వాళ్ళని పిచ్చోళ్ళనే అనుకోవాలి. ప్రపంచం అన్నది ఎప్పుడూ మారుతూనే ఉంటుంది. ఈ ప్రపంచంలో, ఈ ప్రకృతిలో మార్పు అన్నది సహజం అన్నారు పత్రిగారు.

కానీ ఆధ్యాత్మికంలో అంటే ఆత్మలో మార్పు లేదు, మారదు. మారితే అది ఆత్మ కాదు, సత్యమే కాదు. ఆత్మ గురించి భగవంతుని గురించి అనేక రకాలుగా వివరించొచ్చు. వివరించడంలో మార్పు రావాలి. ఆత్మలో మార్పు రాదు. ఇది వాళ్ళకి అర్థం కాక ఆ పుస్తకాలూ, ఈ పుస్తకాలూ చదివి,

యూట్యూబ్‌లో చూస్తూ ఎవడు ఏది చెప్తే దాన్ని అనుసరిస్తున్నారు. వాళ్ళు శరీరం వదిలితే గాని ఈ ఆత్మకి, మనసుకి ఉన్న తేడా వాళ్ళకి అర్థం కాదు.

అందుచేత ఆధ్యాత్మికంలో మార్పులేమీ ఉండవు. ఎవ్వరైనా సరే ఎన్ని యుగాలు మారినా ఆత్మస్థితి సంపాదించుకోవాల్సిందే, మోక్షాన్ని పొందవలసిందే, నేను ఆత్మ అన్న సంగతి తెలుసుకోవాల్సిందే.

అందుచేత మీలో ఉన్నటువంటి ఆ జ్ఞాన జ్యోతి ప్రకాశింప చేసుకోండి, కర్మలు రహితం చేసుకోండి, జన్మ లేని స్థితి సంపాదించుకోండి.





# Tatavarthy Raghavarao Sir
# Books in English

| | | |
|---|---|---|
| 1. | Life Science (Part-I) | Rs.120 |
| 2. | Why is Guiding Not Meditation ? | Rs.100 |
| 3. | Which is the right meditation ? | Rs.100 |
| 4. | Die before death! | Rs.120 |
| 5. | The Law of Karma | Rs.100 |
| 6. | What is Meditation? | Rs.80 |
| 7. | True Path | Rs.80 |
| 8. | Why soul-knowledge | Rs.70 |
| 9. | What comes after death ? | Rs.70 |
| 10. | How to improve Financial Status ? | Rs.60 |
| 11. | Wisdom is attained only through Meditation | Rs.60 |
| 12. | What is Intention? | Rs.50 |
| 13. | Why is this life? | Rs.50 |
| 14. | Vegetarian Food Is Human Food | Rs.50 |
| 15. | Meditation for the Development of Students | Rs.40 |
| 16. | Non violence and vegetarianism | Rs.40 |



# श्री तटवर्ती वीर राघवराव के हिन्दी किताब

1. आत्म शास्त्र ।........................................ Rs.200/-
2. ध्यान विद्या ।........................................ Rs.160/-
3. भगवद् गीता का सार ।........................................ Rs.160/-
4. सत्य मार्ग ।........................................ Rs.160/-
5. मरने से पहले मरना है।........................................ Rs.130/-
6. गाईडिंग ध्यान क्यों नहीं ?........................................ Rs.120/-
7. भगवान कौन है।........................................ Rs.120/-
8. कर्म सिद्धांत ।........................................ Rs.120/-
9. विज्ञान का अर्थ – निहितार्थ ।........................................ Rs.120/-
10. ब्रह्म ज्ञान ।........................................ Rs.100/-
11. यह जीवन क्यों है ?........................................ Rs.100/-
12. मेहर बाबा का संदेश ।........................................ Rs.100/-
13. कौन सा ध्यान सही है ?........................................ Rs.100/-
14. मरने के बाद, साथ में आने वाले विषयों ।................ Rs.80/-
15. भगवत के दृश्यों का अर्थ ।........................................ Rs.80/-
16. आत्म हंतक कौन होता है ।........................................ Rs.70/-
17. स्त्री जन्मों में सीखने वाले विषयों, पुरुष जन्मों में सीखने वाले विषयों।. Rs.70/-
18. दुख निवारण का मार्ग........................................ Rs.75/-
19. उत्तम पुरूष........................................ Rs.60/-
20. आर्थिक स्थिति बढाना है तो ?........................................ Rs.60/-
21. निर्वाण मार्ग........................................ Rs.60/-
22. सत्य........................................ Rs.50/-
23. क्या हम इस लोक के वासी हैं या परलोक के वासी हैं ?......... Rs.50/-
24. गुरू को पहचानना कैसे ?........................................ Rs.50/-
25. विद्यार्थियों के विकास के लिए ध्यान विद्या ............... Rs.50/-
26. अलौकिक शक्तियाँ........................................ Rs.50/-
27. शाकाहार ही मानव का आहार है!........................................ Rs.50/-
28. ब्रह्मं क्या है ?........................................ Rs.50/-
29. संकल्प अर्थात ?........................................ Rs.40/-

**For Books Contact : TATAVARTHY VEERA RAGHAVARAO**
**BHIMAVARAM-534201. CELL: 9490171853, 9440309812**

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

1) జీవితశాస్త్రం (మొదటి భాగం) - రూ.130/-
2) జీవితశాస్త్రం (రెండవ భాగం) - రూ.130/-
3) జీవిత సత్యాలు - రూ.130/-
4) సత్యమార్గం - రూ.160/-
5) ధ్యాన శక్తి - రూ.130/-
6) ధ్యాన శాస్త్రం - రూ.130/-
7) ఆత్మ శాస్త్రం - రూ.120/-
8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం -రూ.160/-
9) మరణించకముందే మరణించాలి - రూ.130/-
10) జీవిత సూక్ష్మాలు - రూ.130/-
11) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? - రూ.120/-
12) గీతాసందేశం - రూ.120/-
13) ఉపమాన ధ్యాన సందేశాలు -రూ.110/-
14) భగవంతుడంటే - రూ.100/-
15) తెలుసుకోండి - రూ.100/-
16) మెహర్‌బాబా సందేశాలు - రూ.100/-
17) మరణం తర్వాత జరిగేది తెలుసుకుంటే కలిగే లాభాలు- రూ.100/-
18) పత్రీజీ చెప్పిన శ్వాస మీద ధ్యాసా? పత్రీజీ చేయించిన మ్యూజిక్ మీద ధ్యాసా? ఏది సరైన ధ్యానం? - రూ.100/-
19) కోరికల వల్ల నష్టాలు - రూ.100/-
20) శంకరాచార్యుల వారి జ్ఞాన సందేశాలు- రూ.100
21) కఠోపనిషత్తు - రూ.90/-
22) ఉపమాన జ్ఞాన సందేశాలు-రూ.90/-
23) కర్మ సిద్ధాంతం - రూ.80/-
24) ధ్యానమంటే ? - రూ.80/-
25) త్రివిధాలు - రూ.80/-
26) ఉత్తమ పురుషుడు - రూ.80/-
27) శాస్త్రాల అర్థం- అంతరార్థం - రూ.70/-
28) ఆత్మజ్ఞానం ఎందుకు? - రూ.70/-
29) జ్ఞాన జ్యోతి - రూ.70/-
30) జ్ఞాన కుసుమాలు - రూ.70/-
31) మరణం తర్వాత కూడా వచ్చేవి - రూ.70/-
32) షిరిడీ సాయి సందేశాలు - రూ.70/-
33) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య- రూ.70/-
34) బుద్ధుని సందేశాలు - రూ.70/-
35) భూతదయే దైవత్వం - రూ.70/-
36) ఆత్మహంతకులంటే ఎవరు?- రూ.70/-
37) స్త్రీ జన్మల్లో నేర్చుకునేవి, పురుష జన్మల్లో నేర్చుకునేవి - రూ.70/-
38) ధర్మ సూక్ష్మాలు - రూ.70/-
39) దుఃఖ నివారణామార్గం - రూ.60/-
40) బ్రహ్మజ్ఞానం - రూ.60/-
41) ధ్యానం (పత్రీజీ) - రూ.60/-
42) ధ్యానం వల్లనే జ్ఞానం - రూ.60/-
43) అతీంద్రియ శక్తులు - రూ.60/-
44) ఆలోచించండి - రూ.60/-
45) నిర్వాణ మార్గం - రూ.60/-
46) ధ్యానులకు సూచనలు - రూ.60/-
47) యోగీశ్వరుల సందేశాలు - రూ.60/-
48) సంకల్పమంటే? - రూ.50/-
49) ఈ జీవితం ఎందుకు? - రూ.50/-
50) ఆశ్చర్యం... ఆశ్చర్యం - రూ.50/-
51) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే- రూ.40/-
52) ఛాంపియన్ అవ్వాలంటే? -రూ.40/-
53) బ్రహ్మం అంటే? -రూ.40/-
54) శంకరాచార్యుల వారి జాగ్రత పంచకం -రూ.40/-
55) శంకరాచార్యుల వారి నిర్వాణ షట్కం -రూ.40/-
56) మహాత్ముల సందేశాలు - రూ.40/-
57) సత్యం - రూ.40/-
58) చక్రాలు - రూ.40/-
59) గురువును గుర్తించడం ఎలా? - రూ.40/-
60) భాగవత సన్నివేశాల అంతరార్థం- రూ.40/-
61) మౌన ధ్యానం - రూ.40/-
62) మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? -రూ.20/-
63) శాకాహారమే మానవాహారం - రూ.15/-
64) అహింస మరియు శాఖాహారం- రూ.15/-

పుస్తకముల కొరకు : **తటవర్తి వీర రాఘవరావు**, తటవర్తివారి వీధి,
భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర. సెల్: 9440309812,



- “జ్ఞానం కోసం “శ్వాస మీద ధ్యాస” ధ్యాన సాధన చేసేవారు జ్ఞానం కోసం కొన్ని రోజులు వేచి ఉండాలి. అలా వేచి ఉన్నప్పుడు తాను చేసిన శ్రమ వృధా అయినట్టు కనిపిస్తుంది, కానీ నిరుత్సాహ పడకుండా అలాగే కొనసాగిస్తే ఏదో ఒక రోజు ఫలితం దానంతట అదే వస్తుంది, మీరు పడిన శ్రమ ఫలిస్తుంది”.
- “మానవుని జీవితం ఎప్పుడు అంతమవుతుందో తెలియదు. అవకాశం ఉన్నప్పుడే ధ్యాన సాధన చేయాలి, జ్ఞానాన్ని సంపాదించు కోవాలి, ఆత్మను తెలుసుకోవడానికి ప్రయత్నించాలి, తాను తెలుసుకున్న జ్ఞానాన్ని ఇతరులకు పంచడానికి ప్రయత్నించాలి”.
- “మలిన మనసు ఉన్నవారికి విన్నవి సరిగ్గా అర్థం కావు, వివేకం ఉండదు, సరైన నిర్ణయాలు చేయలేరు, మూర్ఖునిలా ప్రవర్తిస్తారు. అంతేకాదు చెడు అలవాట్లకు, చెడు వ్యసనాలకు బానిసై వాటి వల్ల వచ్చే కష్టాలు అనుభవించలేక జీవితంలో నరకం అనుభవిస్తారు. శుద్ధ మనసు గలవారికి తాను చేసే పనుల ఫలితం తెలియడం వల్ల వాటి నుంచి మంచినే పొందుతారు”.
- “జ్ఞాని పరోపకారం చేయడం వల్ల ధనానికి లోటు ఉండదు. ఏదో విధంగా అతనికి ధనం సమకూరుతూనే ఉంటుంది. దుఃఖం కూడా దూరం అవుతుంది, నూతన సామర్థ్యం లభిస్తుంది, మనసు చంచలత్వం తొలగిపోతుంది. బుద్ధికి కొత్త తేజస్సు వస్తుంది, శరీరానికి కష్టాలు సహించే శక్తి వస్తుంది. అటువంటి జ్ఞానికి అన్ని రకాలుగా గొప్పతనానికి మార్గం సుగమమవుతుంది అంటే తేలికవుతుంది”.

రూ.**90/-**

**- బ్రహ్మర్షి తటవర్తి వీరరాఘవరావు**